www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

greenko | am green

శనివారం | 17-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 311 | గుంటూరు సిటీ

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి రా.12.04 తదుపరి అమావాస్య, నక్షత్రం: మూల ఉ.8.12 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: శేషం ఉ. 8.12, రా.6.36-8.20, దుర్ముహూర్తం: ఉ.6.52-8.21, అమృతఘడియలు: తె.5.01-6.45, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం: 5.58

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 17-1-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal |Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గుంటూరు సిటీ

## ఏసీ లేని అమృత్ భారత్ రైళ్లు

**హైదరాబాద్ నుంచి ఏపీ మీదుగా రెండు రైళ్లు**

**23న కేరళలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ**



హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల పేద, మధ్య తరగతి వర్గాలకు రైల్వేశాఖ తీపి కబురు చెప్పింది. ఏసీ క్లాస్ లేకుండా స్లీపర్, సెకండ్‌క్లాస్ కోచ్‌లు మాత్రమే ఉండే రెండు అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా వివిధ ప్రాంతాలకు నడపనుంది. ఇందులో ఒకటి చర్లపల్లి- నాగర్‌కోయిల్ మధ్య, మరొకటి హైదరాబాద్-తిరువనంతపురం మధ్య నడవనున్నాయి. చర్లపల్లి-నాగర్‌కోయిల్ రైలు గుంటూరు, నెల్లూరు, చెన్నై, తిరుచిరాపల్లి, మదురై మీదుగా నాగర్‌కోయిల్ వెళ్తుంది. హైదరాబాద్-తిరువనంతపురం అమృత్‌భారత్ విజయవాడ, ఒంగోలు, తిరుపతి, సేలం, కోయంబత్తూరు, త్రిశూర్ మీదుగా తిరువనంతపురం చేరుకుంటుంది. ఈ రెండు రైళ్లను ప్రధాని మోదీ ఈ నెల 23న కేరళ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

## అలా ఎలా అడ్డుకుంటారు?



'ఐ ప్యాక్'లో ఈడీ సోదాల వివాదంలో మమతా బెనర్జీపై సుప్రీం సీరియస్

రెండు వారాల్లోగా వివరణ ఇవ్వండి

పశ్చిమ బెంగాల్ సీఎంకు నోటీసులు

డీజీపీ, కోల్‌కతా సీపీకి కూడా..

ఈడీపై పెట్టిన మూడు కేసుల్లో స్టే

2




## ఏఐపై మైక్రోసాఫ్ట్ దృష్టి

సిబ్బందికి లైబ్రరీ, న్యూస్‌పేపర్లు బంద్

చందాల రద్దుపై పబ్లిషర్లకు ఈమెయిల్

## 'క్యాంపస్' పరిస్థితులు దారుణం!

విద్యార్థుల మానసిక స్థితిగతులను పర్యవేక్షించే వ్యవస్థ ఎక్కడా లేదు

విద్యార్థుల అసహజ మరణాలపై పోలీసులకు సమాచారం ఇవ్వండి

వాటి నివారణకు చర్యలు తీసుకోండి

ఉన్నత విద్యా సంస్థలకు సుప్రీం మార్గదర్శకాలు



2

మాయమైపోతున్నదమ్మా

## మనిషన్నవాడు

**భార్య నిప్పంటించుకుంటే దగ్గరుండి వీడియో తీసిన భర్త**

బాలుడిని ఢీకొన్న చేపల ట్రక్కు.. పిల్లవాడిని చూడకుండా చేపలు ఎత్తుకెళ్లిన జనం

2

# క్లీన్ ఎనర్జీలో మరో చరిత్ర!

**కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ | ప్రపంచంలోనే పెద్దది.. దేశంలో మొదటిది**

నేడు భారీ యంత్రాల ఏర్పాటుకు శ్రీకారం.. హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్



1.5 ఎంటీపీఏ ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు

దేశంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్

7.5 గిగావాట్ల సోలార్, విండ్ ఎనర్జీ కూడా

2 గిగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంటు ఏర్పాటు

3 దశల్లో మొత్తం రూ.90 వేల కోట్ల పెట్టుబడి

2027 నాటికి తొలి దశ ఉత్పత్తి ప్రారంభం

గ్రీన్‌కోకు చెందిన ఏఎం గ్రీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు

**విశేషాలు ఎన్నెన్నో..**

10 బిలియన్ డాలర్ల(సుమారు రూ.90 వేల కోట్లు) పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఏడాదికి 15 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రాజెక్టుతో సుమారు 8 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.

గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టును 3 దశల్లో పూర్తి చేస్తారు. తొలిదశలో 2027 నాటికి ఏడాదికి 0.5 టన్నుల అమ్మోనియాను ఉత్పత్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

తొలిదశలో రూ.18 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. రెండో దశలో 2028 నాటికి 1 టన్ను, మూడో దశలో 1.5 టన్నుల అమ్మోనియాను ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు.

"దేశంలో తయారైన గ్రీన్ అమ్మోనియా విదేశాలకు ఎగుమతి కావడం కాకినాడ నుంచే ప్రారంభం కానుంది. గ్రీన్ అమ్మోనియాను భారీ రవాణా షిప్పులకు, భారీ ట్రక్కులకు, సరుకు రవాణా రైళ్లకు ఇంధనంగా వినియోగిస్తారు. విద్యుత్ ఉత్పత్తికి కూడా దీన్ని వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టు కేవలం ఓ పారిశ్రామిక పెట్టుబడి మాత్రమే కాదు. రాష్ట్ర ఇంధన భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశం."

- మంత్రి లోకేశ్

అమరావతి/కాకినాడ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): క్లీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం సరికొత్త చరిత్ర సృష్టించనుంది. ప్రపంచంలోనే అతిపెద్దది.. దేశంలోనే మొదటి గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు రాష్ట్రం వేదిక కానుంది. కాకినాడ కేంద్రంగా.. గ్రీన్‌కో గ్రూప్‌నకు చెందిన ఏఎం గ్రీన్ సంస్థ ఏడాదికి 15 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసే గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ కాంప్లెక్స్ నుంచి గ్రీన్ అమ్మోనియా జర్మనీ, జపాన్‌కు ఎగుమతి కానుంది. కేవలం ఏడాది కాలంలో అన్ని అనుమతులూ పొంది శరవేగంగా నిర్మాణం జరుపుకొంటున్న ఈ ప్రాజెక్టులో భారీ యంత్ర పరికరాల ఏర్పాటు ప్రక్రియకు శనివారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. గ్రీన్‌కో గ్రూప్‌నకు చెందిన 'ఏఎం గ్రీన్' సంస్థకు గత ఏడాది జనవరిలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిస్తూ జీవో విడుదల చేసింది. 10 బిలియన్ యూఎస్ డాలర్ల(సుమారు రూ.90 వేల కోట్లు) పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఏడాదికి 15 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను

మిగతా 12వ పేజీలో...

## తిరుపతిలో 'ఏపీ-ఫస్ట్'!

**అతిపెద్ద పరిశోధనా కేంద్రం**

యువత భవితకు భరోసా

పలు కీలక రంగాల్లో శిక్షణ

ఏరో స్పేస్, డిఫెన్స్, ఐటీ సలహాదారులతో సీఎం సమావేశం

ఏపీ-ఫస్ట్ ఏర్పాటుకు ఆమోదం.. డ్రోన్ వ్యవస్థపై మరింత అధ్యయనం.. అన్ని విభాగాల్లోనూ 'డ్రోన్' సేవలు

"కొత్త ఆవిష్కరణలకు, వివిధ స్టార్టప్ కంపెనీలకు రాష్ట్రం వేదికగా నిలవాల్సిన అవసరం ఉంది. ఇలా వచ్చే కంపెనీలకు, పరిశ్రమలకు నైపుణ్యం ఉన్న యువతను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. భవిష్యత్తులో డిమాండ్ ఉన్న రంగాలకు పెద్దపీట వేస్తూ స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తాం. వీటికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఓ అతిపెద్ద రిసెర్చ్ సెంటర్ అవసరం. తిరుపతిలో ఏర్పాటు చేయబోతున్న 'ఏపీ ఫస్ట్' పరిశోధన సంస్థ ఆ అవసరాలను తీర్చేలా పూర్తిస్థాయిలో పనిచేయాలి."

- సీఎం చంద్రబాబు

12



తల్లిదండ్రుల సమాధి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

## అందరి ఆనందమే లక్ష్యం!

మన మూలాలను మరచిపోరాదు. మన పెద్దలను స్మరించుకోవడం మానరాదు. లేకపోతే జంతువుకూ, మనిషికీ తేడా ఉండదు.

- సీఎం చంద్రబాబు

**2027 నాటికి భూసమస్యలుండవు: సీఎం**

**అదే ఇప్పుడు నాకు సవాల్.. బాధ్యత కూడా**

జేసీలకు ఈ ఏడాదంతా ఇదే పని

గత ఏడాది ప్రజల అవసరాలు తీర్చాం

ఈ సంవత్సరం వారి ఆకాంక్షలు తీర్చేలా పనిచేద్దాం

సంక్షేమం.. అభివృద్ధితో సుపరిపాలన

ట్రూడౌన్‌తో విద్యుత్ చార్జీల భారం ఇప్పటికే తగ్గించాం

గ్రామాల్లో ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ పెట్టేలా చర్యలు

ప్రకృతి సాగుకు ప్రోత్సాహం

పీ-4లో 10 లక్షల కుటుంబాల దత్తత

ఈ ఏడాది వాటిపై దృష్టి పెడతాం: సీఎం

అమరావతి/తిరుపతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని వర్గాలూ ఆనందంగా ఉండాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. గత ప్రభుత్వం భూములను 22(ఏ) నిషేధిత జాబితాలో పెట్టి చాలా గందరగోళం సృష్టించిందని విమర్శించారు. పట్టాదార్ పాస్ పుస్తకాలపై అప్పటి సీఎం తన సొంత ఫొటో పెట్టుకుని భూముల రికార్డులను గందరగోళంగా మార్చారన్నారు. సర్వే చేసి రాజముద్రతో తిరిగి పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇస్తున్నామని.. వాటిపై క్యూఆర్ కోడ్ కూడా ముద్రిస్తున్నామని తెలిపారు. 2027 నాటికి రాష్ట్రంలో భూ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామన్నారు. అదే ఇప్పుడు తనకు సవాల్‌గానూ, పెద్ద బాధ్యత

మిగతా 12వ పేజీలో...



## టీవీలు, ఫోన్ల ధరలు పెరుగుతాయ్!

మెమొరీ చిప్‌ల కొరతే కారణం 2

మార్కెట్లో ఇప్పటికే మొదలైన ప్రభావం

డిస్కౌంట్లు, ఆఫర్లు తగ్గిస్తున్న కంపెనీలు

రాబోయే 2 నెలల్లో ధరలు పెంచే అవకాశం.. పరిశ్రమ వర్గాల అంచనా

## బీజేపీ 'మహా' విజయం

మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో భారీ గెలుపు

29 కార్పొరేషన్లలో 25చోట్ల ఘన విజయం

ముంబైలో మహాయుతి కూటమి హవా 2

25 ఏళ్ల శివసేన ఏకఛత్రాధిపత్యానికి చెక్

ప్రభావం చూపని ఠాక్రేలు, పవార్‌ల ఐక్యత



12

తెలుగు రాష్ట్రాల జల జగడాలపై

## 30న ఉన్నత స్థాయి కమిటీ తొలి భేటీ

# కోట్లలో కూత!



**దాదాపు రూ.2 వేల కోట్ల పందేలు**

**పండగ మూడు రోజులూ 'బరి'లోనే గోదారి**

తెలంగాణ వాసుల రాకతో జోష్

పశ్చిమలో రూ.300 కోట్లు

గుండాట, పేకాటల జాతర రూ.500 కోట్లు

రూ.800 కోట్లు రాబట్టిన 'కృష్ణా'

బాపట్లలో 200 కోట్ల పందేలు

తాడేపల్లిగూడెంలో ఒకే పందెం రూ.1.53 కోట్లు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. కోళ్ల కత్తులు రువ్వి నిర్వాహకుల పంట పండించాయి. కోడిపందేలతోపాటు గుండాట, కోతాటలతో హోరెత్తించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మూడు రోజుల్లో రూ.500 కోట్ల వరకు పందేలు తెగినట్టు అంచనా. ఒక్క కాకినాడ జిల్లాలోనే ఏకంగా రూ.250 కోట్ల లావాదేవీలు సాగినట్టు చెబుతున్నారు. ఒక్కో బరి వద్ద మూడు నుంచి నాలుగు గుండాట బోర్డులు ఏర్పాటు చేయించి నిర్వాహకులు లాభాలు

మిగతా 11వ పేజీలో...



పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెద అమిరంలో కోడి పందెం విజేతకు నగదు అందజేస్తున్న సినీ నటి డింపుల్ హయాతి

## మందుబాబులకు పండగే!

**మూడ్రోజుల్లో రూ.438 కోట్ల మద్యం తాగేశారు**

**గత వారంలో 877 కోట్ల విక్రయాలు**



అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగువారికి సంక్రాంతి పండుగ ఎంత ముఖ్యమైనదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. బతుకుదెరువు కోసం ఎక్కడెక్కడికో వెళ్లిన వారంతా రెక్కలు కట్టుకుని మరీ సొంతూళ్లలో వాలిపోతుంటారు. పండుగ సరదాలు, సంబరాలు, మందు, విందులు కూడా అంతేస్థాయిలో ఉంటాయి. మద్యం విక్రయాల లెక్కలు చూస్తుంటే గత మూడ్రోజుల్లో.. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో మందు బాబులు మద్యంలో మునిగి తేలినట్లు కనిపిస్తోంది. సాధారణ రోజులతో పోలిస్తే మద్యం

మిగతా 11వ పేజీలో...

## ఊరూరా సంబరం

గోదావరి జిల్లాల్లో 11

తెలంగాణ సందడి

ఇంటింటా అనుబంధాల సవ్వడి



భోగి మంటలు, భోగి పళ్లతో పండగ మొదలు

పోయినోళ్ల జ్ఞాపకాలతో ఘనంగా పెద్దల పండుగ

కనుమ రోజు పశువుల సందడి.. ప్రభల తీర్థాలు

ఏడాదికి సరిపడా జ్ఞాపకాలు పంచిన సంక్రాంతి

## మైనస్ మార్కులతో పీజీ ప్రవేశాలా?

వైద్య విద్య నాణ్యతపై నీలినీడలు?.. మిగిలేవి నాన్ క్లినికల్ సీట్లే

'ప్రైవేటు'లోనే అధికం.. ఉత్తరాదిన ఎక్కువగా ఈ పరిస్థితి




హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య విద్యలో ప్రవేశానికి మైనస్ 40 మార్కులను కటాఫ్‌గా నిర్ణయిస్తూ జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 18 వేలకు పైగా పీజీ సీట్లు మిగిలిపోవడంతో.. వాటిని భర్తీ చేయాలనే ఉద్దేశంతో ఎన్ఎంసీ ఈ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే, దీనిపై వైద్యరంగ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో 200 ప్రశ్నలుంటాయి. ఒక్కో సరైన సమాధానానికీ నాలుగు మార్కులు. అంటే.. మొత్తం 800 మార్కులు. తప్పుడు సమాధానం రాస్తే మైనస్ మార్కులిస్తారు. ఒక్కో తప్పు జవాబుకూ

మిగతా 2వ పేజీలో...

## ట్రంప్ చేతికి నోబెల్

తనకు వచ్చిన శాంతి బహుమతిని అమెరికా అధ్యక్షుడికి బహూకరించిన మరియా మచాడో

వెనెజువెలా స్వేచ్ఛకు మద్దతిచ్చినందుకేనని వెల్లడి

పతకం యజమానులు మారొచ్చుగానీ..

విజేత పేరు మారదు: నోబెల్ కమిటీ

2

# మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు..

» భార్య నిప్పంటించుకుంటే దగ్గరుండి వీడియో తీసిన భర్త
» బాలుడిని ఢీకొన్న చేపల ట్రక్కు.. పిల్లవాడిని చూడకుండా చేపలు ఎత్తుకెళ్లిన జనం

సూరత్/ పట్నా, జనవరి 16: ఆత్మహత్య చేసుకునేందుకు భార్య ఒంటిపై డీజిల్ పోసుకొన్నా ఆ భర్త అడ్డుకోలేదు.. ఆపై ఒంటికి నిప్పంటించుకున్నా ఆమెను కాపాడేందుకు ప్రయత్నించలేదు. పైపెచ్చు.. ఆమె బలవన్మరణం వెనుక తన పాత్రేమీ లేదనే సాక్ష్యం సిద్ధం చేసేందుకు ఘటననంతా పక్కనే ఉండి సెల్‌ఫోన్‌లో చక్కగా వీడియో తీశాడు! సభ్యసమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసే ఈ ఘటన గుజరాత్‌లోని సూరత్‌లో జరిగింది. మృతురాలు 31ఏళ్ల ప్రతిమా దేవి. నిందితుడు ఆమె భర్త అయిన 31 ఏళ్ల రంజిత్ షా. వీరిది బిహార్. రంజిత్ వరుసకు సోదరుడయ్యే వ్యక్తికి, ప్రతిమ సోదరికి పెళ్లి జరగడంతో ఇరు కుటుంబాలకు బంధుత్వం ఏర్పడింది. కొన్నాళ్ల రాకపోకల తర్వాత రంజిత్-ప్రతిమ మధ్య ఏర్పడిన పరిచయం, ప్రేమకు దారితీసింది. ఇద్దరి పెళ్లికి ఇంట్లో వాళ్లు ఒప్పుకోకపోవడంతో 2013లో ప్రతిమ-రంజిత్ సూరత్‌కు పారిపోయి పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు. రంజిత్ మెకానిక్. ప్రతిమ ఇంట్లోనే ఉంటూ పిల్లలను చూసుకునేది. మూడోబిడ్డ పుట్టాక భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. జనవరి 4న పొరుగింటోళ్లు మేడ మీద ఆరబెట్టిన గోధుమలను రంజిత్, ప్రతిమ పిల్లలు చిందరవందర చేశారు. పిల్లలను రంజిత్ తిట్టిపోశాడు. బయటకు వెళ్లనీయకుండా బంధించాడు. తగదని ప్రతిమ వారించినా రంజిత్ వినిపించుకోలేదు. ఈ విషయంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఇంట్లో తాను క్యాన్‌లో డీజిల్ తెచ్చిపెట్టాడని.. ఒంటిమీద పోసుకొని, నిప్పంటించుకొని చచ్చిపో అంటూ భార్యను రంజిత్ రెచ్చగొట్టాడు. అతడి మాటలకు తీవ్ర మనస్తాపం చెందిన ప్రతిమ అలానే చేసింది. మంటలతో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రతిమ 11న మృతిచెందింది. ఆమె ఆత్మహత్య ఘటనలో తన ప్రమేయం లేదని, తనకు తానుగా ఆమె ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకుందనేందుకు రుజువుగా ఘటననంతా రంజిత్ వీడియో తీసినా ఆ వీడియోనే అతడి మెడకు చుట్టుకుంది. పోలీసులు రంజిత్‌ను అదుపులోకి తీసుకొని జైల్లో పెట్టారు. ఇక మానవతావాదుల గుండెలను మెలిపెట్టేసేలా మరో ఘటన బిహార్‌లో జరిగింది. సీతామర్హీ జిల్లాలో ఉదయం శిక్షణా తరగతులకు హాజరయ్యేందుకు రితేశ్ కుమార్ (13) అనే ఏడో తరగతి విద్యార్థి వెళుతుండగా చేపల లోడ్‌తో వెళుతున్న ట్రక్కు అతడిని ఢీకొట్టి.. రోడ్డుకు అడ్డంగా పల్టీకొట్టింది. ఈ ఘటనలో ఆ బాలుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే క్షణాల్లో గుమిగూడిన జనం, బాలుడు చనిపోయాడన్న కించిత్ సానుభూతి కూడా చూపకుండా.. రక్తపు మడుగులో పడ్డ మృతదేహాన్ని పట్టించుకోకుండా ట్రక్కులోని చేపలను ఎత్తుకెళ్లడానికి పోటీపడ్డారు. దొరికినన్ని చేపలను సంచీల్లో వేసుకొని వెళ్లిపోయారు.

## లోకం తీరు




## 'ఐ ప్యాక్'లో ఈడీ సోదాల వివాదంలో మమతా బెనర్జీపై సుప్రీం సీరియస్

న్యూఢిల్లీ, జనవరి 16: కోల్‌కతాలో 'ఐ ప్యాక్' అధిపతి ప్రతీక్ జైన్ ఇంట ఈడీ సోదాలను అడ్డుకున్న వ్యవహారంలో బెంగాల్ సీఎం మమతపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులపై బెంగాల్ పోలీసులు నమోదు చేసిన 3 కేసుల్లో దర్యాప్తుపై స్టే విధించింది. ఈడీ తదితర కేంద్ర సంస్థల దర్యాప్తులో రాష్ట్ర సంస్థలు జోక్యం చేసుకోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. "ఒక పార్టీకి చెందిన ఎన్నికల పనుల్లో వేలుపెట్టే అధికారం కేంద్ర దర్యాప్తు సంస్థలకు లేదు. అయితే ఆ ముసుగులో వేరే కేసులో దర్యాప్తు చేస్తున్న అధికారులను అడ్డుకోవచ్చా" అని ప్రశ్నించింది. మమత, డీజీపీ రాజీవ్‌కుమార్ తదితరులకు నోటీసులు జారీచేసింది. ఈ వ్యవహారంలో సీబీఐ విచారణకు ఆదేశించాలని ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. గతంలో సీబీఐకి, బెంగాల్ ప్రభుత్వానికి మధ్య వేరే కేసులో జరిగిన ఘర్షణను ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇది పరిపాటిగా మారిందన్నారు.

## వర్సిటీ ప్రాంగణాల్లో పరిస్థితులు దారుణం: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 16: దేశంలోని ఉన్నత విద్యాసంస్థల క్యాంపస్‌లు దారుణంగా ఉన్నాయని సుప్రీంకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. ముఖ్యంగా విద్యార్థుల మానసిక పరిస్థితులను అంచనా వేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పేర్కొంది. విద్యార్థుల ఆత్మహత్యలు, అసహజ మరణాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా సమయానుగుణంగా పోలీసులకు వెల్లడించడం లేదని.. ఇకపై అలా జరగడానికి వీల్లేదని స్పష్టం చేసింది. విద్యార్థుల ఆత్మహత్యలకు సంబంధించిన సమాచాన్ని పోలీసులకు తక్షణమే నివేదించాలని ఉన్నత విద్యాసంస్థలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## చైనాతో యుద్ధం వేళ 600 కిలోల బంగారమిచ్చిన దర్భంగ మహారాణి కామసుందరి కన్నుమూత



న్యూఢిల్లీ, జనవరి 16: అసమాన్య దేశభక్తి, త్యాగం, సేవకు ప్రతిరూపంగా నిలిచిన దర్భంగ మహారాణి కామసుందరీ దేవి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. 93వ ఏట బిహార్‌లోని దర్భంగలో చారిత్రక కళ్యాణి ప్యాలస్‌లో సోమవారం తుదిశ్వాస విడిచారు. దర్భంగ రాజ్యంలో చివరి రాణి అయిన ఆమె మరణంతో గొప్పదైన ఓ రాజవంశ శకం ముగిసినట్లయింది. 1962 భారత్, చైనా యుద్ధ సమయంలో కామసుందరీ దేవి దేశ రక్షణ కోసం 15మణుగులు(సుమారు 600 కిలోలు) బంగారాన్ని విరాళంగా ఇచ్చారు. మూడు ప్రైవేట్ విమానాలను, 90 ఎకరాల ఎయిర్‌స్ట్రిప్‌ను దేశం కోసం త్యాగం చేశారు. తర్వాత కాలంలో ఆ ఎయిర్‌స్ట్రిప్ కేంద్రం దర్భంగ విమానాశ్రయంగా మారింది. విద్యాభివృద్ధికి, పరిశ్రమల కోసం దర్భంగ రాజవంశం ఎన్నో విరాళాలు అందజేసింది. 1932లో జన్మించిన కామసుందరీ దేవి తన 8వ ఏట దర్భంగ మహారాజు కామేశ్వర్ సింగ్‌ను వివాహం చేసుకున్నారు. 1962లో ఆయన కన్నుమూశారు. ఆయనకు సంతానం లేకపోవడంతో కామసుందరీదేవి రాజకుటుంబ బాధ్యతలు నిర్వహించారు.

## 242 బెట్టింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ, జనవరి 16: అక్రమంగా నిర్వహిస్తున్న 242 బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లను నిషేధిస్తూ శుక్రవారం కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ చట్టం-2025 ప్రకారం ఈ చర్య తీసుకొంది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత 7,800 గ్యాంబ్లింగ్ వైబ్‌సైట్లను నిషేధించడం గమనార్హం. యువత ఆర్థిక మోసాల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ వెబ్‌సైట్లపై దృష్టి పెట్టింది.

## ఏఐపై మైక్రోసాఫ్ట్ దృష్టి

న్యూఢిల్లీ, జనవరి 16: ప్రముఖ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ గత కొన్ని నెలలుగా కృత్రిమ మేధస్సు (ఏఐ)పై దృష్టి సారిస్తోంది. దీనిలో భాగంగా గతేడాది 15వేల మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించింది. తాజాగా ఈ కంపెనీ తన సిబ్బందికి లైబ్రరీ, వార్తాపత్రికలను అందుబాటులో ఉంచడాన్ని కూడా తగ్గిస్తోంది. అమెరికన్ టెక్నాలజీ వెబ్‌సైట్ 'ది వెర్జ్' కథనం మేరకు.. గత ఒప్పందాల గడువు ముగిశాక వాటి చందాలను పునరుద్ధరించబోమంటూ పలువురు పబ్లిషర్లకు ఈమెయిల్ పంపింది. ఈ క్రమంలో కంపెనీలోని దాదాపు 2,20,000 మంది ఉద్యోగులకు రెండు దశాబ్దాలకు పైగా గ్లోబల్ నివేదికలు అందించిన పబ్లిషర్ స్ట్రాటజిక్ న్యూస్ సర్వీస్ (ఎస్ఎన్ఎస్)తోనూ బంధాన్ని తెంచుకుంది.

## ఏప్రిల్ నుంచి ఏటీఎం ద్వారా పీఎఫ్

న్యూఢిల్లీ, జనవరి 16: ఈపీఎఫ్ఓ చందాదారులకు ఏప్రిల్ నెల నుంచి మరో వెసులుబాటు కలగనుంది. యూపీఐ విధానం ద్వారా నేరుగా ఖాతాదార్ల బ్యాంకు ఖాతాలో పీఎఫ్ సొమ్ము జమయ్యే సౌకర్యం కలగనుందని ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. దీంతో ఏటీఎంల ద్వారా సొమ్ము డ్రా చేసుకునే వీలు కలగనుంది. చందాదారులు పీఎఫ్ సొమ్ములో కొంత మొత్తాన్ని ఖాతాల్లో నిల్వ చేసుకొని, ఎక్కువ మొత్తాన్ని డ్రా చేసుకునే విధంగా కేంద్ర కార్మిక శాఖ నూతన విధానాన్ని రూపొందిస్తోంది. పీఎఫ్ ఖాతాలోని సొమ్ము నేరుగా యూపీఐ ద్వారా బ్యాంకు ఖాతాకు జమయ్యేలా ఏర్పాటు చేసుకొని, తమ నచ్చిన అవసరాలకు వినియోగించుకోవచ్చు. డెబిట్ కార్డుల ద్వారా ఏటీఎంల నుంచి సొమ్ము తీసుకోవచ్చు.

## ఏప్రిల్ 1 నుంచి టోల్‌ప్లాజాల్లో నగదు చెల్లింపులు బంద్..!

న్యూఢిల్లీ, జనవరి 16: ఏప్రిల్ 1వ తేదీ నుంచి జాతీయ రహదారిపై ఉండే టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ నిలిపేయనుంది. ఈ మేరకు వాహనదారులు టోల్ చార్జీలను కచ్చితంగా ఫాస్టాగ్, యూపీఐ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో టోల్ ప్లాజాల వద్ద భారీ క్యూలైన్లు తగ్గడంతో పాటు ప్రయాణం మరింత సాఫీగా కొనసాగించవచ్చు. అయితే దీనికి సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ ఇంకా విడుదల కాలేదు. ఈ 'నో స్టాఫ్' వ్యవస్థను ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద దేశంలోని 25 టోల్‌ప్లాజాల్లో అమలు చేసి పరీక్షిస్తున్నారు.

## పొందూరు ఖద్దరుకు 'జీఐ' ట్యాగ్ వచ్చేసింది!

న్యూఢిల్లీ, జనవరి 16: శ్రీకాకుళం జిల్లా పొందూరు ఖద్దరుకు భౌగోళిక సూచిక (జీఐ) ట్యాగ్ వచ్చింది. ఖాదీ గ్రామోద్యోగ (కేవీఐసీ) ఛైర్మన్ మనోజ్‌కుమార్ శుక్రవారం ఢిల్లీలో వెల్లడించారు. ఖాదీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రధాని మోదీ చేస్తున్న కృషి ఫలితంగానే ఈ గౌరవం లభించిందని.. ఇది ఖాదీ రంగానికే గర్వకారణమని తెలిపారు. జీఐ ట్యాగ్‌తో అరుదైన ఈ చేనేత వస్త్రాలకు అధికారిక గుర్తింపు లభిస్తుందని.. అంతేగాక తరతరాలుగా ఈ చేతివృత్తిని కాపాడుకుంటూ వస్తున్న కళాకారుల శ్రమను గౌరవించినట్లవుతుందని చెప్పారు. ఈ ఖద్దరు వస్త్రాలను నేస్తున్న చేనేత కార్మికుల ఆదాయం రెట్టింపవుతుందని.. కొత్తగా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని చెప్పారు. నకిలీ ఉత్పత్తులకు వ్యతిరేకంగా రక్షణ లభిస్తుందని.. అధికారిక, అసలైన ఉత్పత్తులు ప్రజలకు చేరతాయన్నారు.

# బీజేపీ సేన 'మహా' విజయం

## మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో భారీ గెలుపు.. 29 కార్పొరేషన్లలో 25 చోట్ల విజయం

### ముంబైలో మహాయుతి కూటమి పాగా

హైదరాబాద్/ముంబై, జనవరి 16: మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ, శివసేన, ఎన్సీపీల మహాయుతి కూటమి ఘనవిజయం సాధించింది. రాష్ట్రంలోని 29 మునిసిపల్ కార్పొరేషన్లకుగాను 25 కార్పొరేషన్లను కైవసం చేసుకుంది. గురువారం జరిగిన ఈ ఎన్నికల ఫలితాలను శుక్రవారం ప్రకటించారు. ముఖ్యంగా అత్యంత కీలకమైన బృహన్‌ముంబై మునిసిపల్ కార్పొరేషన్(బీఎంసీ)లో దాదాపు 25 ఏళ్ల తర్వాత ఉమ్మడి శివసేన ఆధిపత్యానికి బీజేపీ గండి కొట్టింది. గత 25 ఏళ్లుగా ఉమ్మడి శివసేననే ఇక్కడ అధికారం చెలాయిస్తూ వచ్చింది. తాజా ఫలితాల్లో ఇక్కడ సొంతంగా మెజారిటీ సాధించకపోయినా, బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీ 88 వార్డులు గెలిచింది. రెండోస్థానంలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) నిలిచింది. ఈ పార్టీ 67 చోట్ల విజయం సాధించింది. ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 28 వార్డులు గెలిచి మూడో పెద్దపార్టీగా నిలిచింది. కాంగ్రెస్ పార్టీ 24, మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) 6, ఎన్సీపీ 3, ఎన్సీపీ (ఎస్పీ) 1 చోట, ఇతరులు 10 చోట్ల గెలుపొందారు. దేశంలోనే అత్యంత ధనిక కార్పొరేషన్ అయిన బీఎంసీలో 227 వార్డులు ఉన్నాయి. మెజారిటీ మార్కు 114. బీజేపీ, శివసే, ఎన్సీపీలకు వచ్చిన సీట్లు కలిపితే మెజారిటీ మార్కు లభిస్తుంది.. మిగిలిన మున్సిపల్ కార్పొరేషన్లలోనూ ఎక్కువశాతం మహాయుతి కూటమే గెలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 2,869 వార్డులు ఉండగా, బీజేపీ 1,440, శివసేన 404, కాంగ్రెస్ 318, శివసేన (యూబీటీ) 156, ఎన్సీపీ 164, ఎన్సీపీ (ఎస్పీ) 36, ఎంఎన్ఎస్ 14, వీబీఏ 15, ఇతరులు 322 చోట్ల గెలిచారు. బీజేపీ గెలుపుపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ ఫలితాలే కేంద్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వ పనితీరుకు దక్కిన మద్దతు అని అన్నారు. కాగా, తమిళనాడు బీజేపీ నేత అన్నామలై బీఎంసీలో ప్రచారం చేసిన మూడుచోట్ల బీజేపీ విజయం సాధించింది.


మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ విజయాభివాదం

### ఫలితమివ్వని పునరేకీకరణలు

ఈ ఎన్నికల కోసం రెండు ప్రధాన పార్టీల్లోని చీలిక వర్గాలు చేతులు కలిపాయి. 20 ఏళ్ల తర్వాత ఉద్ధవ్ ఠాక్రేతో మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) అధినేత రాజ్ ఠాక్రే కలిసిపోయారు. అలాగే అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్(ఎన్సీపీ), శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ(ఎస్పీ) వర్గాలు కూడా కలిసిపోయాయి. అయినా, ఎన్నికల్లో వీరు ప్రభావం చూపలేకపోయారు. మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో తమ అభ్యర్థులు 112 మంది గెలిచినట్లు మజ్లిస్ పార్టీ ప్రకటించింది. కాగా, ఈ ఎన్నికల్లో ఈసీ బీజేపీ, శివసేనకు అనుకూలంగా వ్యవహరించిందని రాహుల్‌గాంధీ ఆరోపించారు.

### గౌరీలంకేశ్ హత్య కేసు నిందితుడి గెలుపు

కర్ణాటకకు చెందిన ప్రముఖ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త గౌరీలంకేశ్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న శ్రీకాంత్ పంగార్కర్ మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో గెలుపొందాడు. జాల్నా మునిసిపల్ కార్పొరేషన్‌లోని 13వ నంబర్ వార్డులో అతడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు. శుక్రవారం వెల్లడైన ఫలితాల్లో 2,661 ఓట్లు సాధించిన శ్రీకాంత్.. తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి రావ్‌సాహెబ్ ధోబ్లేను ఓడించారు. 2017 సెప్టెంబర్ 5న బెంగళూరులోని తన ఇంటిముందే గౌరీ లంకేశ్‌ను దుండగులు కాల్చి చంపారు.

### హిందీనా..? ఇది మహారాష్ట్ర భాయ్..!: అమీర్‌ఖాన్

ముంబైలో గురువారం మునిసిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ ఓటువేసేందుకు ఓ పోలింగ్ కేంద్ర వద్ద ఓటర్ల వరుసలో నిలుచోగా.. ఆయనను మీడియా పలకరించింది. దీంతో 'ప్రజలంతా వచ్చి తమ విలువైన ఓటును వినియోగించుకోండి' అని ఆయన మరాఠీలో పిలుపునిచ్చారు. మీడియా ప్రతినిధులు అదే విషయాన్ని హిందీలో చెప్పాలని కోరగా.. 'హిందీలోనా? ఇది మహారాష్ట్ర భాయ్..' అని బదులిచ్చారు. ఈ సందేశం ఢిల్లీలో కూడా ప్రసారం అవుతుందని చెప్పగా.. చివరకు ఆయన ఇంగ్లి‌ష్‌లో తన సందేశాన్ని ఇచ్చారు.

## బిహార్లో కాంగ్రెస్ ఖాళీ!

### మొన్న గెలిచిన ఎమ్మెల్యేలూ జంప్?

పట్నా, జనవరి 16: బిహార్ రాజకీయ యవనికపై కాంగ్రెస్ అంతర్ధానం కానుందా? ఒకప్పుడు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన ఆ రాష్ట్రంలో దాని ఉనికే ప్రశ్నార్థకమవుతోందా? తాజా రాజకీయ పరిణామాలు దీనినే సూచిస్తున్నాయి. 243 స్థానాల అసెంబ్లీకి గత ఏడాది నవంబర్లో జరిగిన ఎన్నికల్లో ఆర్జేడీతో పొత్తుతో 61 చోట్ల పోటీచేసిన కాంగ్రెస్.. అతి కష్టమ్మీద ఆరు స్థానాలే గెలిచింది. ఇప్పుడా ఆరుగురు ఎమ్మెల్యేలు..సురేంద్రప్రసాద్ కుశ్వాహా (వాల్మీకినగర్), అభిషేక్ రంజన్ (చంపాతియా), మనోజ్ బిశ్వాస్ (ఫోర్బ్‌గంజ్), అవిదుర్ రహ్మాన్ (అరారియా), కమ్రూల్ హోదా (కిషన్‌గంజ్), మనోహర్‌ప్రసాద్ సింగ్ (మణిహారి) పార్టీ ఫిరాయిస్తున్నట్లు వస్తున్న వార్తలు ఆ పార్టీ శ్రేణుల్లో కలకలం రేపుతున్నాయి. పాలక ఎన్డీఏ భాగస్వామి, సీఎం నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూలో చేరేందుకు వారు ఆ పార్టీ నాయకత్వంతో మంతనాలు జరుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గత కొంత కాలంగా వీరు పార్టీకి దూరంగా ఉంటున్నారు. వీబీ-జీరామ్‌జీ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తలపెట్టిన దేశవ్యాప్త ఆందోళనకూ డుమ్మాకొట్టారు. పార్టీపై వారిలో అసంతృప్తి పతాక స్థాయికి చేరిందని.. తమ నాయకత్వంతో గుట్టుగా మంతనాలు జరుపుతున్నారని జేడీయూ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. అయితే ఆయన వ్యాఖ్యలను సీఎల్పీ మాజీ ఛైర్మన్ షకీల్ అహ్మద్ ఖాన్ తోసిపుచ్చారు. ఉపాధి హామీ పథకం రద్దుకు వ్యతిరేకంగా తాము చేస్తున్న ఆందోళన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఎన్డీఏ ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తోందని ఏఐసీసీ బిహార్ కార్యదర్శి షానవాజ్ ఆలం ఆరోపించారు. ఈ ఎమ్మెల్యేలు గనుక జేడీయూలోకి ఫిరాయిస్తే.. స్వాతంత్ర్యానికి ముందు గానీ.. తర్వాత గానీ తొలిసారి రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం లేకుండా పోతుంది.

## మైనస్ మార్కులతో పీజీ వైద్య విద్య ప్రవేశాలా?

(మొదటి పేజీ తరువాయి)

ఒక మార్క్ మైనస్ చేస్తారు. కనీసం 40 ప్రశ్నలకు సరైన సమాధానాలు రాస్తే.. 160 మార్కులు వస్తాయి. మిగిలిన 160 ప్రశ్నలకూ తప్పు సమాధానాలిచ్చినా 160 మార్కులు మైనస్ అయ్యి జీరో వస్తుంది. అప్పుడు అభ్యర్థికి నీట్ పీజీలో జీరో మార్కులువచ్చినట్లుగా పరిగణిస్తారు. ఇక్కడ జీరో మార్కులకు కాదు.. అంతకన్నా తక్కువగా.. మైనస్ 40 మార్కులొచ్చినా (అంటే కేవలం 32 ప్రశ్నలకే సరైన సమాధానాలు రాసి, మిగతా 168 ప్రశ్నలకూ తప్పు జవాబు ఇచ్చినా) పీజీ వైద్య విద్యలో ప్రవేశాలు కల్పిస్తామనడంపైనే తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

### ఉత్తరాదిన పెంచినా..

పీజీలో క్లినికల్, నాన్ క్లినికల్ సబ్జెక్టులుంటాయి. ప్రధానంగా నాన్ క్లినికల్‌లో అనాటమీ, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ సైన్స్, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ ఉంటాయి. వీటిలో అనాటమీ, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ సీట్లు ఎక్కువగా మిగిలిపోతుంటాయని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నాన్ క్లినికల్ సీట్లు దాదాపు భర్తీ అవుతుంటాయని, అందుకు ప్రధాన కారణం స్టైపెండేనని అంటున్నారు. పీజీ మొదటి ఏడాది విద్యార్థులకు సర్కారు స్టైపెండ్ కింద నెలకు రూ.78-80 వేలు ఇస్తుంది. దాంతో నాన్ క్లినికల్ సీట్లు పెద్దగా మిగలవని అంటున్నారు. మిగిలే సీట్లన్నీ కూడా ప్రైవేటు వైద్య కళాశాలల్లోనే ఉంటాయని.. వారు పీజీలకు స్టైపెండ్ చెల్లించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని వైద్యవిద్య నిపుణులు పేర్కొంటున్నారు. మన రాష్ట్రంలోనూ ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోనే నాన్ క్లినికల్ సీట్లు మిగిలిపోతుంటాయని వైద్యవర్గాలు వెల్లడించాయి. ఉత్తరాదితో పోల్చితే మాత్రం.. దక్షిణాది రాష్ట్రాల్లో పీజీ సీట్లు పెద్దగా మిగలవని వైద్యనిపుణులు చెబుతున్నారు. దక్షిణాదిన మెడికల్ కాలేజీలు, యూజీ సీట్లు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం. ఉత్తరాదినా గత ఐదారేళ్లలో యూజీ, పీజీ సీట్లను పెంచారు. కానీ యూజీ పూర్తి చేయాలంటే ఐదేళ్లు పడుతుంది. అది పూర్తి కాకుండానే ఉత్తరాది రాష్ట్రాల్లో ఇబ్బడిముబ్బడిగా పీజీ సీట్లు పెంచడం వల్ల అర్హులైన అభ్యర్థులు లేక అక్కడ సీట్లు మిగిలిపోతున్నట్లు వైద్య విద్య నిపుణులు గుర్తు చేస్తున్నారు.

## హరియాణాలో మహిళపై గ్యాంగ్‌రేప్

న్యూఢిల్లీ, జనవరి 16: హరియాణాలోని బహదూర్‌గఢ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ మహిళ(42)పై ఐదుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె ప్రయాణిస్తున్న బస్సును ఫాలో అయి.. తోడుగా ఉన్న బంధువుల నుంచి ఆమెను ఎత్తుకెళ్లి గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఈ నెల 12న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహిళ ఉద్యోగం కోసం బాబాయితో కలిసి ఢిల్లీకి వచ్చింది. 12వ తేదీ అర్ధరాత్రి 2 గంటలకు ఢిల్లీలోని పండిట్ శ్రీరామ్ శర్మ మెట్రోస్టేషన్ వద్ద బస్సు నుంచి దిగింది. అక్కడి నుంచి వారిద్దరినీ తీసుకెళ్లేందుకు ఆమెకు వరుసకు సోదరుడయ్యే వ్యక్తి వచ్చాడు. అప్పటివరకు బస్సును ఫాలో అయిన ఐదుగురు.. మహిళను ఆమె బాబాయి, సోదరుడి నుంచి ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. పోలీసులు 8గంటల వ్యవధిలోనే నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

# ఇరాన్‌పై దాడి.. ట్రంప్ వెనక్కి!

## ఇజ్రాయెల్ సహా పలు దేశాల ఒత్తిడితో ఆఖరు నిమిషంలో ఆపిన అమెరికా అధ్యక్షుడు

### ఇరాన్‌తో చర్చల కోసం మధ్యవర్తిత్వానికి సిద్ధమన్న పుతిన్

వాషింగ్టన్, జనవరి 16: ఇరాన్‌పై సైనిక చర్య విషయంలో అమెరికా కాస్త వెనక్కి తగ్గింది. ఇప్పుడో, ఇంకాసేపట్లోనో దాడి తథ్యమన్న పరిస్థితి నుంచి.. ఇప్పట్లో సైనిక చర్య ఏదీ చేపట్టే అవకాశం లేదనే దశకు వచ్చింది. ప్రస్తుతానికి దాడి వద్దంటూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, ఇతర దేశాల నేతలు విజ్ఞప్తి చేయడం.. ఆందోళనకారులకు ఉరిశిక్ష వేయడం అంశంలో ఇరాన్ వెనక్కి తగ్గడంతో ట్రంప్ కాస్త శాంతించినట్టు వైట్‌హౌజ్ వర్గాలు చెబుతున్నాయి. ఇరాన్‌పై దాడి వద్దని, ఆ దేశంతో దౌత్యపరమైన చర్చలకు తాము సహకరిస్తామని నెతన్యాహుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ విజ్ఞప్తి చేయడం గమనార్హం. ప్రజా ఆందోళనలను పాశవికంగా అణచివేసేందుకు ఇరాన్ ప్రయత్నించడంతో ఆగ్రహించిన ట్రంప్.. పోరాడండి, సాయం వస్తోందని ఇరాన్ నిరసనకారులకు ఇటీవల పిలుపునిచ్చారు. అన్నట్టుగానే ఇరాన్‌పై సైనిక చర్యకు ఏర్పాట్లు చేపట్టారు. కానీ చివరి నిమిషంలో నెతన్యాహుతోపాటు పలు దేశాల ఒత్తిడితోనే దాడిని వాయిదా వేసుకున్నారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక తాజాగా వెల్లడించింది. బుధవారం రాత్రి ట్రంప్‌తో మాట్లాడిన నెతన్యాహు ఇరాన్‌పై దాడికి ఇది సరైన సమయం కాదని, ఈ విషయంలో పునరాలోచించాలని వ్యక్తిగతంగా ఒత్తిడి చేశారని పేర్కొంది. ఇరాన్‌పై దాడి కోసం భారీగా ఆయుధ సంపత్తి, నిధులు అవసరమని.. అదే సమయంలో ఇజ్రాయెల్, అమెరికా మిలిటరీ స్థావరాల మీద ఇరాన్ దాడి చేసే అవకాశముందని నెతన్యాహు వివరించినట్టు తెలిపింది. మరోవైపు ఖతార్, యూఏఈ తదితర దేశాలు కూడా ప్రస్తుతానికి దాడి వద్దని.. దౌత్యపరంగా, ఇతర మార్గాల్లో ఒత్తిడి పెంచుదామని కోరినట్టు వైట్‌హౌజ్ వర్గాలు తెలిపాయి. ఇరాన్‌పై దాడి ప్రస్తుతానికి ఉండబోదని ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ కూడా పరోక్షంగా వెల్లడించారు. "ఇరాన్ అధ్యక్షుడితో మాట్లాడాను. ఆందోళనకారులను సామూహికంగా ఉరితీసే నిర్ణయంపై అమెరికా ఆందోళనను వివరించాను. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నామని, ఆందోళనకారులకు ఉరిశిక్షలు వేయబోమని ఆయన హామీ ఇచ్చారు. ఇరాన్ అంశంలో దౌత్యపరమైన పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నాం" అని గురువారం తెలిపారు. అయితే ఐరాస భద్రతా మండలి అత్యవసర సమావేశంలో మాత్రం.. ఇరాన్‌పై దాడి సహా అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని అమెరికా పేర్కొంది.


టెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌లో సాధారణ పరిస్థితులు

### ఇరాన్, ఇజ్రాయెల్ నేతలతో పుతిన్ చర్చలు

ఇరాన్‌పై దాడికి అమెరికా సిద్ధమవడం, పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం వేర్వేరుగా చర్చలు జరిపారు. శాంతి నెలకొల్పేందుకు రాజకీయ, దౌత్యపరమైన మార్గాలను అనుసరించాలని కోరారు. ఈ అంశంలో కలసి పని చేద్దామన్నారు. ఇరాన్‌తో చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

### ట్రంప్.. ఈసారి బుల్లెట్ మిస్సవదు!

ఇరాన్‌పై దాడి చేస్తామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను పరోక్షంగా హెచ్చరిస్తూ ఇరాన్ అధికారిక టీవీ ఓ కథనం ప్రసారం చేసింది. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో ట్రంప్ చెవిని తాకుతూ బుల్లెట్ దూసుకెళ్లింది. ఆనాటి చిత్రాన్ని, దాని కింద 'ఈసారి బుల్లెట్ లక్ష్యాన్ని మిస్సవదు' అని రాసిన ప్లకార్డును పట్టుకున్న వ్యక్తి దృశ్యాలను పదే పదే ప్రసారం చేసింది.

## ట్రంప్ చేతికి నోబెల్ శాంతి పతకం

### తనకు వచ్చిన బహుమతిని అమెరికా అధ్యక్షుడికి బహూకరించిన మచాడో



వాషింగ్టన్, జనవరి 16: వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మచాడో.. తన నోబెల్ శాంతి బహుమతిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు బహూకరించారు. గురువారం వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో భేటీ సందర్భంగా ఆయనకు నోబెల్‌ను ఇచ్చినట్లు మచాడో తెలిపారు. 'వెనెజువెలాకు స్వేచ్ఛను కల్పించటానికి సైద్ధాంతిక మద్దతుతోపాటు అత్యంత కీలకమైన తోడ్పాటునందించిన ట్రంప్ కృషికి గుర్తింపుగా నా దేశ ప్రజల తరఫున ఇది నేను వ్యక్తిగతంగా అందిస్తున్నా. అమెరికా, ట్రంప్ చూపిన అసాధారణ ధైర్యాన్ని వెనెజువెలా ప్రజలు ఎన్నటికీ మర్చిపోరు' అని మచాడో ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీనిపై ట్రంప్ ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ.. "నేను చేసిన కృషికిగాను మచాడో తనకు వచ్చిన నోబెల్ బహుమతిని బహూకరించారు. ఇది పరస్పర గౌరవానికి ఓ అద్భుత ఉదాహరణ. థాంక్‌యూ మరియా" అని పేర్కొన్నారు. మరోవైపు, నోబెల్ శాంతి బహుమతిని అందించే నోబెల్ పీస్ సెంటర్ ఈ వ్యవహారంపై తన వైఖరిని స్పష్టం చేసింది. 'ఒకసారి నోబెల్ బహుమతిని ప్రకటించిన తర్వాత దానిని రద్దు చేయటంగానీ, ఇతరులతో పంచుకోవటంగానీ, ఇతరులకు బదిలీ చేయటంగానీ కుదరదు' అని పేర్కొంది. 'పతకం తన యజమానులను మార్చుకోగలదేమోగానీ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత పేరు (నోబెల్ లారెట్) పేరు మాత్రం మారదు' అని స్పష్టం చేసింది.

## టీవీలు, ఫోన్ల ధరలు పెరుగుతాయ్!

న్యూఢిల్లీ, జనవరి 16: కొత్త టీవీ కొనాలనుకుంటున్నారా.. ఫోన్ మార్చాలనుకుంటున్నారా.. ల్యాప్‌టాప్‌ను అప్‌గ్రేడ్ చేయాలనుకుంటున్నారా.. అయితే వెంటనే కొనేసేయండి. రాబోయే రెండు నెలల్లో టీవీలు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్ల ధరలు గణనీయంగా పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. మైక్రో చిప్‌ల కొరత, ఫలితంగా వాటి ధరలు పెరగడం, ఏఐని అందిపుచ్చుకోవడం ఇందుకు కారణాలుగా పేర్కొంటున్నాయి. మైక్రో చిప్‌ల కొరత ప్రభావం ఇప్పటికే కంపెనీలపై తీవ్రంగా ఉందని వివరించాయి.కౌంటర్ పాయింట్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గడిచిన అక్టోబరుతో పోలిస్తే మైక్రోచిప్‌ల ధరలు మార్చికల్లా 120% పెరిగే అవకాశం ఉంది. దీంతో టీవీ, ఫోన్ల కంపెనీలు ధరలు పెంచక తప్పని పరిస్థితి వస్తుంది. ఈ ప్రభావం ఇప్పటికే మొదలైందని, అందుకే చాలా కంపెనీలు డిస్కౌంట్లను, క్యాష్ బ్యాక్ ఆఫర్లను తగ్గిస్తున్నాయని నివేదిక వివరించింది. స్మార్ట్ ఫోన్ల ధరల పెరుగుదల ఇప్పటికే ప్రారంభమైందని పేర్కొంది. ధరల పెరుగుదల కారణంగా మొబైల్ ఫోన్ల అమ్మకాలు 10-12శాతం పడిపోవచ్చని అంచనా వేసింది.

# పండక్కి వచ్చి తిరిగిరాని లోకాలకు..

- సముద్రంలో మునిగి ఇద్దరి దుర్మరణం
- మరో ఇద్దరు గల్లంతు, ఆచూకీ కోసం గాలింపు
- మృతిలోనూ వీడని అన్నాచెల్లెళ్ల బంధం
- కళ్ల ముందే తోబుట్టువుల మృతితో మిన్నంటిన అన్న రోదన
- కనుమ రోజు నెల్లూరు జిల్లాలో విషాదం



ఈగ అమ్ములు, బాలకృష్ణ


అల్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పండక్కని వచ్చిన అన్నాచెల్లెలు తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. ఈ ఘటన నెల్లూరు జిల్లా అల్లూరు మండలం ఇస్కపల్లి తీరంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చికి చెందిన ఈగ చిన్నబ్బయ్య, ఈగ అమ్ములు, ఈగ బాలకృష్ణ తల్లిదండ్రులు లేని అనాథలు. వీరిలో చిన్నబ్బయ్య చిట్టేడులో గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్నాడు. బాలకృష్ణ (15), అమ్ములు (14) అల్లూరు మండలం నార్తుఆములూరు గొల్లపాలెంలో పదోతరగతి, తొమ్మిదో తరగతి చదువుతున్నారు. గత మంగళవారం అల్లూరు పేటలో నిర్వహించిన పోలేరమ్మ తిరునాళ్లకు వెళ్లి అనంతరం పండక్కి అల్లూరు మజరా గ్రామమైన ఎర్రపుగుంటలోని వదిన ఇంటికి వచ్చారు. రెండ్రోజులు ఉత్సాహంగా పండుగ జరుపుకొన్నారు. ఇస్కపల్లి పంచాయతీ ఆదిరాఘవపురం ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన వీరి స్నేహితులు కొమరగిరి అభిషేక్ (16), చేజర్లలో గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న గంధళ్ల సుధీర్(15)తో పాటు బాలాయపల్లి మండలం పాకపురికి చెందిన బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న సిరిసినంబేటి వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకున్నారు. అందరూ కలిసి శుక్రవారం మధ్యాహ్నం ఇస్కపల్లి సముద్ర తీరానికి వెళ్లారు. స్నానం చేసేందుకు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సముద్రంలోకి దిగారు. అమ్ములు, బాలకృష్ణ, అభిషేక్, సుధీర్ ఓవైపు వెళ్లగా, మిగిలిన ఇద్దరూ మరోవైపు వెళ్లారు. లోపల గుంతలు ఉన్న విషయం తెలియని ఆ నలుగురు ఒకరి తరువాత మరొకరు నీటిలో మునిగిపోయారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో వీరిని గమనించలేదు. ఎక్కడా వారు కనపడకపోయేసరికి చిన్నబ్బయ్య, వెంకటేశ్వర్లు గట్టిగా కేకలు వేస్తూ బయటికి పరుగులు తీశారు. స్థానిక మత్స్యకారులకు విషయం తెలియజేయగా, వారు సముద్రంలో దిగి గాలింపు చేపట్టారు. అమ్ములు మృతదేహం కాసేపటికి ఒడ్డుకు కొట్టుకురాగా, బాలకృష్ణ మృతదేహాన్ని మత్స్యకారులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న కావలి డీఎస్పీ శ్రీధర్, సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. స్థానిక మత్స్యకారుల సహకారంతో గాలింపు ముమ్మరం చేశారు. అయినా మరో ఇరువురి ఆచూకీ లభ్యం కాలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### అయ్యో.. పాపం!

తోబుట్టువుల మృతిని జీర్ణించుకోలేక చిన్నబ్బయ్య రోదించిన తీరు స్థానికులను కలచివేసింది. వీరంతా గతంలో నార్తుఆములూరు గొల్లపాలెంలోని చైల్డ్ ఆశ్రమంలో విద్యనభ్యసించారు. వీరిలో చిన్నబ్బయ్య, అభిషేక్, సుధీర్, వెంకటేశ్వర్లు ఒకేచోట చదువుకోవడంతో స్నేహితులయ్యారు. పండుగ సెలవులకు వచ్చి మృత్యువాత పడటం స్థానికులను కలచి వేసింది. కాగా.. మెరైన్ పోలీసుల నిర్లక్ష వైఖరి వల్లే ఈ దారుణం జరిగిందని స్థానిక మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. గల్లంతైన వారి ఆచూకీ కోసం మెరైన్ బోట్లతో రాత్రి కూడా సైతం గాలిస్తామని కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ తెలిపారు.

# ఏఎంఏ అధ్యక్షుడిగా తెలుగోడు

- అమెరికాలో కీలక పదవి చేపట్టిన 'కృష్ణా' మూలాలున్న వ్యక్తి



ఏఎంఏ అధ్యక్షుడిగా ఎన్నికైన ముక్కామల బాబీ

విజయవాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అమెరికా వైద్య రంగంలో కృష్ణా జిల్లా వ్యక్తి కీలక పదవిని అధిరోహించారు. అమెరికా మెడికల్ అసోసియేషన్(ఏఎంఏ) అధ్యక్షుడిగా కృష్ణా జిల్లా గన్నవరం మండలం బుద్ధవరానికి చెందిన బాబి ముక్కామల ఎన్నికయ్యారు. ఏఎంఏను 180 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు అమెరికన్ వైద్యులే దీనికి అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ పదవిని అధిరోహించిన భారతీయ మూలాలు ఉన్న తొలి వైద్యుడు బాబి. అతడి తల్లిదండ్రులు డాక్టర్ అప్పారావు, సుమతి. అప్పారావు స్వగ్రామం బుద్ధవరం. ఆయన రేడియాలజిస్టుగా, సుమతి చిన్నపిల్లల వైద్యురాలిగా అమెరికాలో స్థిరపడ్డారు. అప్పారావు దంపతులకు బాబి అమెరికాలోనే జన్మించారు. ప్రస్తుతం మిచిగాన్ రాష్ట్రంలోని ఫ్లింట్ నగరంలో హర్లీ ఆసుపత్రిలో ఈఎన్‌టీ వైద్యుడిగా పని చేస్తున్నారు. ఏఎంఏలో ఇంతకు ముందు ఆయన ఎనిమిదేళ్లపాటు ట్రస్టీగా పనిచేశారు. ఏటా ఏఎంఏ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతాయి. బాబిని అమెరికాలో ఉన్న 10 లక్షల మంది వైద్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగుతారు. వైద్యరంగంలో అమలు చేయాల్సిన విధానాలు, వైద్య సేవల్లో చేయాల్సిన మార్పులపై ఏఎంఏ అక్కడి ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది.



# 'లిక్కర్' గ్యాంగ్‌కు 30 వరకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న తొమ్మిది మందికి విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 30వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, చెరుకూరి వెంకటేష్ నాయుడు, బూనేటి చాణక్య, గుంటూరు జిల్లా జైల్లో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ, అనిల్ చోక్రా, రోణక్ కుమార్‌ను శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. వారికి రిమాండ్‌ను 30వ తేదీ వరకు కోర్టు పొడిగించింది. బెయిల్‌పై ఉన్న పి.కృష్ణమోహన్ రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనంజయ్‌రెడ్డి మాత్రం వాయిదాకు హాజరుకాలేకపోతున్నామని ఆబ్సెంట్ పిటిషన్ దాఖలు చేశారు.



# అంధత్వ నివారణలో ఏపీ భేష్

- దేశానికి ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర విధానాలు
- కేంద్ర ఆరోగ్యశాఖ తాజా నివేదికలో ప్రశంసలు
- వార్షిక లక్ష్యం 90 వేల నుంచి 2.50 లక్షలకు పెంపు

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, కంటి అద్దాల పంపిణీలో రాష్ట్ర ఆరోగ్యశాఖ అమలుచేస్తున్న విధానాలకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ఏపీ ప్రభుత్వం చూపిన చొరవ ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తన తాజా నివేదికలో ప్రశంసించింది. ఏపీలో అనుసరిస్తున్న ఈ ఉత్తమ విధానాలను ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేసేందుకు త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేస్తామని వెల్లడించింది. ఈ క్రమంలో కంటి అద్దాల పంపిణీకి సంబంధించి 2026-27 విద్యా సంవత్సరానికి రాష్ట్రానికి కేటాయించిన వార్షిక లక్ష్యాన్ని 90 వేల నుంచి ఏకంగా 2.50 లక్షలకు పెంచింది. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలను ప్రభుత్వమే పంపిణీ చేస్తోంది. ప్రతి ఏడాది జూలై నుంచి నవంబరు వరకు అన్ని పాఠశాలల్లోనూ కంటి పరీక్షలు కొనసాగుతాయి. ఆ తర్వాత కళ్లద్దాల సరఫరా సంస్థలను ఎంపిక చేసి.. ఫిబ్రవరిలోగా కళ్లజోళ్ల పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

### ఏటా రూ.3 కోట్లు ఖర్చు

ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం ఏటా రూ.3 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తున్నాయి. ప్రతి కళ్లజోడుకు గరిష్ఠంగా రూ.280 వరకు వ్యయం అవుతోంది. టెండర్ల ద్వారా ఎంపికైన సంస్థలు సరఫరా చేసే కంటి అద్దాల నాణ్యతను లెన్సో మీటర్ ద్వారా పరీక్షిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని వాటిని తిరస్కరించి, నాణ్యమైన అద్దాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అంధత్వ నివారణ కార్యక్రమ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో కంటి పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ సంతృప్తికరంగా ఉంది. దీంతో 2026-27లో లక్ష్యాన్ని 2.50 లక్షల మందికి పెంచేందుకు కేంద్రం సంసిద్ధత వ్యక్తం చేసింది. దీనివల్ల రూ.7.70 కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 2024- 25లో 90 వేల మంది లక్ష్యాన్ని అధిగమించి మొత్తం 1,89,102 మందికి అందించారు. 2025-26లోనూ 94,689 మందికి పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

### స్ఫూర్తిని కొనసాగిస్తాం: మంత్రి సత్యకుమార్

అంధత్వ నివారణలో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. రాష్ట్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఆయన.. దీని వెనుక అధికారుల కృషి ఉందని చెప్పారు. ఈ స్ఫూర్తిని ఈ ఏడాది కూడా కొనసాగిస్తామని మంత్రి వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# ముంబై.. బీజేపీ ముల్లె

దేశ ఆర్థికరాజధాని ముంబైని బీజేపీ చేజిక్కించుకుంది. రాజకీయ అవసరాలు, ప్రయోజనాలు సహా వివిధ కారణాలతో దాదాపు పదేళ్ళుగా వాయిదాపడుతూ వచ్చిన బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికల్లో బీజేపీ–శివసేన కూటమి మంచి విజయం సాధించి, ఠాక్రేల చేతుల్లో మూడుదశాబ్దాలుగా ఉన్న మహానగరాన్ని స్వాధీనం చేసుకుంది. డెబ్బైఐదువేల కోట్ల బడ్జెట్‌తో ఆసియాలో అతిఖరీదైన మునిసిపాలిటీకి తొలిసారి బీజేపీ మేయర్ రాబోతున్నారు. వివిధ సర్వేలు, ఎగ్జిట్‌పోల్స్ బీజేపీ కూటమి ఘన విజయాన్ని, ఠాక్రేల ఘోరపరాజయాన్ని అంచనాకట్టినప్పటికీ, ఫలితాలు అంత తీవ్రంగా లేకపోవడం గమనించాలి.

మహాయుతిది మహాద్భుత విజయమూ కాదు, ఠాక్రేలది ఘోర పరాజయమూ కాదు అంటున్నవారూ లేకపోలేదు. అయినప్పటికీ, ఠాక్రే సోదరుల కలయికతో అద్భుతాలు జరిగిపోతాయని నమ్మినవారికి మాత్రం ఈ ఫలితాలు జీర్ణించుకోలేనివి. సోదరులు ఒక్కటైతే ఇక తిరుగుండదని ఇరవయ్యేళ్ళుగా అదే పనిగా వాదిస్తున్న వారు, నిజం కాబోలని అనుకున్నవారు ఇప్పుడు షాక్‌లో ఉన్నారు. కేవలం ఈ ఎన్నికల ముందు, శివసేన పుట్టినిల్లయిన ఖరీదైన ముంబైని బీజేపీ ఎత్తుకుపోకుండా ఆపడం కోసం ఉద్ధవ్, రాజ్ ఠాక్రేలు ఈ మధ్యనే చేయిచేయి కలిపారు, జనం నమ్మరేమోనన్న అనుమానంతో ఈనాటి ఈ బంధం ఏనాటికీ తెగిపోదని కూడా హామీ ఇచ్చారు. ఉద్ధవ్ పార్టీ ప్రతినిధులు దీనిని మనసుల కలయికగా అభివర్ణించారు. మరాఠీ అస్మితను జనంలో రేపి, మరాఠీ ఓటుబ్యాంకును సుస్థిరం చేసుకొని, హిందీ పెత్తనానికి ప్రతినిధిగా ఉన్న 'మహాయుతి' కూటమిని తరమికొట్టడానికి ఈ సోదరుల ఏకీకరణ ఉపకరిస్తుందని నమ్మారు. 2017నాటి ఫలితాలతో, తదనంతర చీలికల నేపథ్యంలో సాధించిన ఇప్పటి ఫలితాలను పోల్చలేము కానీ, ఉద్ధవ్ మీద ముంబైవాసుల్లోనూ అంత ప్రేమాభిమానాలు పొంగిపొర్లలేదని అర్థం. ఆయనతో చేయికలిపిన సోదరుడికి ఓ మూడుస్థానాలు పెరగడం వినా పెద్ద ప్రయోజనం లేకపోయింది. గుజరాతీలు, తమిళులమీద ఠాక్రే సోదరులు చేసిన ఘాటైన విమర్శలు భూమిపుత్రుల ఓట్లు పెద్దగా సాధించిపెట్టలేకపోయాయి కానీ, మహారాష్ట్రేతరుల ఓట్లు నిర్దిష్టంగా పడి బీజేపీకి అధిక ప్రయోజనం కలిగింది. 'హఠావో లుంగీ, బజావో పుంగీ' వంటి నినాదాలు మరాఠీ అస్మితను ఎంత రేపిందో తెలియదు కానీ, హిందూత్వదే పైచేయి అయింది. ఇక, పవార్ కుటుంబం కూడా ఇటువంటి విన్యాసాన్నే చేసి విఫలమైంది. పై స్థాయిలో చీలిన పవార్లు స్థానిక ప్రయోజనాలకోసం చేయికలపగానే జనం ఆమోదించలేదు. ముంబైసహా అత్యధిక మునిసిపాలిటీలను బీజేపీ గెలుచుకోవడం ఫడ్నవీస్‌కు మంచి శక్తినిస్తుంది. బీజేపీ పక్షాన ప్రచారంలో నరేంద్రమోదీ, అమిత్‌షా వంటి ఉద్దండులు లేకుండా పార్టీని విజయతీరాలకు చేర్చి రాష్ట్రంలో ఆయన తిరుగులేని నాయకుడుగా అవతరించాడు. మరో పరీక్ష నెగ్గిన ఏక్‌నాథ్ షిండే సైతం కూటమిలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడంతోపాటు, అసలు సిసలు శివసేన తానేనని సామాన్య జనంతోనూ అనిపించుకున్నారు. లోక్‌సభ, శాసనసభకు మాత్రమే కాక, మహాయుతి బలం స్థానిక సంస్థలకూ, మరోపక్క యావత్ రాష్ట్రానికీ విస్తరించిందని ఈ ఎన్నికలు రుజువుచేశాయి.

ముంబైని కాపాడుకోకపోయినా, తిరిగికోలుకోగలమన్న నమ్మకాన్ని ఈ ఫలితాలు ఠాక్రేలకు ఇచ్చాయి. ఉద్ధవ్ పార్టీ బీజేపీ తరువాత స్థానంలో ఉండటమే కాక, షిండేసేనతో పోల్చితే ఎంతో మెరుగ్గా కనిపిస్తోంది. సోదరుడితో చేయికలపడంకోసం మహావికాస్ అగాడీకి దూరమైనందువల్ల ఉద్ధవ్ సెక్యులర్ ఓట్లు కోల్పోయారనీ, కాంగ్రెస్ బాగా బలహీనపడినస్థితిలో ఓట్లు బదిలీ అయివుండేవని అంటారు. అయితే, బాల్‌ఠాక్రేమీద స్థానికుల్లో ఉన్న ప్రేమాభిమానాలు పూర్తిగా చెరిగిపోలేదని ఉద్ధవ్‌కు వచ్చిన స్థానాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ముంబైని గెలవడం కంటే పార్టీని రక్షించుకోవడం ఠాక్రేలకు ఇప్పుడు మరీ ప్రధానం. ప్రస్తుతానికి అధికసీట్లు దక్కకపోయినా, రేపోమాపో గాలి తన వైపు తిరగవచ్చునని ఆశ మిగిలింది. ఠాక్రే బ్రాండ్‌నూ, బాలాసాహెబ్ వారసత్వాన్ని కాపాడుకోవడమే కష్టమైపోతున్న తరుణంలో, పార్టీ, గుర్తులతో సహా సమస్తమూ కోల్పోతూ, ఓటర్లకు దూరమైపోతున్న ఉద్ధవ్‌కు ఈ ఎన్నికలు కొత్త ఆశనీ, ఆశ్వాసననూ ఇచ్చాయి.

# మోదీ భారత్‌లో కొత్త మిథ్యావాదం

సంక్రాంతి పండుగ జరుపుకున్న ఆనందోత్సాహాలలో ఉండివుంటారు కదూ, శుభవార్తలే నివేదిస్తాను. ఎందుకంటే అవే వెల్లువెత్తుతున్నాయి మరి. రిటైల్ ద్రవ్యోల్బణం (వినియోగ వస్తువుల ధరల సూచీ ద్రవ్యోల్బణం అని కూడా అంటారు) 1.33 శాతం; 2025–26 ఆర్థిక సంవత్సరానికి స్థూల దేశీయోత్పత్తి పెరుగుదల రేటు 7.4 శాతంగా అంచనా వేశారు. భేష్. మరొక భేష్‌ను కూడా మనం జోడించి తీరాలని నేను భావిస్తున్నాను. ఎందుకు? మన సువిశాల భారత దేశంలో ఎక్కడా నిరుద్యోగమనేది లేదు. కనీసం మనకు కలవరపాటు కలిగించే లేదా కలవరం చెంది తీరాల్సిన తరహా నిరుద్యోగం లేనే లేదు!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఉద్యోగాలు కోరుకునేవారే లేరు! సహేతుకమైన కారణాలతోనే నేను ఈ మాట అంటున్నాను. ప్రభుత్వంలోను, ప్రభుత్వ అనుబంధ సంస్థలలోను వేలాది ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. అయినా వాటిని కోరుకునేవారు లేరు. అవి ఎంతకూ భర్తీ కావడం లేదు. మంచి వేతనం (8వ వేతన సంఘం ఇంకా పెంచుతుంది), కరువు భత్యం, వార్షిక వేతన పెంపుదలలు, ప్రమోషన్లు, ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, హెచ్‌ఆర్ఏ, ప్రయాణ రాయితీలు, వేతన లబ్ధితో సెలవులు, అడ్వాన్సులు, రుణ సదుపాయాలు, యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ – సుఖవంతమైన జీవితానికి ఇంతకు మించిన భరోసా ఏముంటుంది? అయినా యువతీయువకులు ఈ ఉద్యోగాలను తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఉద్యోగ ఆరాటం లేని తరం కాబోలు ఇది. స్పష్టంగా చెప్పాలంటే కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో 27శాతం అధ్యాపక ఉద్యోగాలు, 47శాతం బోధనేతర సిబ్బంది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. జూన్ 2025 నాటికి కేవీఎస్ (కేంద్రీయ విద్యా సంగథన్)లో 7,765 బోధనా సిబ్బంది పోస్టులు, ఎన్‌వీఎస్ (నవోదయ విద్యాసమితి)లో 4,323 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అయినప్పటికీ విద్యారంగం ప్రవర్ధమానమవుతోందని ప్రభుత్వం నిశ్చిత స్వరంతో చెప్పుతోంది.

విద్యారంగంలోనే కాదు, ఇతర రంగాలలోనూ ఉద్యోగ ఖాళీలు పుష్కలంగా ఉన్నాయి. కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సీఏపీఎఫ్)లో 25,487 కానిస్టేబుల్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. రాజస్థాన్‌లో ఎల్‌డీసీ/క్లర్క్ కేడర్–2 లో 10,664 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. బిహార్‌లో 12,199 ఖాళీలు ఉన్నాయి. యూపీలో 60,244 కానిస్టేబుల్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. తమిళనాడులో 2,255 స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నర్సింగ్ ఉద్యోగాలు ఆశించేవారు పాఠశాల విద్య పూర్తి చేసిన లేదా పట్టభద్రులు అయిన దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారయి ఉండడం కద్దు.

దేశవ్యాప్తంగా 21 ఏఐఐఎమ్ఎస్ (ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో 3,485 మంది అధ్యాపక పోస్టులు ఉండగా 1,731 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒడిషాలోని కేంద్రపారా జిల్లాలో 1,087 డాక్టర్లు, పారా మెడిక్స్ ఉండగా 805 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మన

> **ప్రభుత్వ వ్యవస్థల్లో ఉద్యోగ ఖాళీలు పెద్ద సంఖ్యలో ఉండడం, అవి భర్తీ కాకపోవడం అనేది భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ పాలనలోనే కాదు, అంతకు ముందు నుంచీ ఉన్నది. మోదీ పాలనలో సంభవించిన రెండు ఘటన (నోట్ల రద్దు, కోవిడ్)లతో ఆ పరిస్థితి మరింతగా పెచ్చరిల్లింది. నిరుద్యోగం ఏమీ పెద్ద సమస్య కాదు అనేది ఒక కట్టుకథ, మోసపూరిత వాదన. కోట్లాది ప్రజలకు ఉపాధిరాహిత్యమనేది మన ఆర్థిక పురోగతిపై ఒక లజ్జాకరమైన, భయానకమైన మచ్చ.**

ప్రభుత్వం వేలాది ఉద్యోగాలను మంజూరు చేసింది. అయినా అవి ఖాళీగానే ఉంటున్నాయి. ఈ అసాధారణ పరిస్థితిని చూస్తుంటే మీకేమనిపిస్తుంది? నిరుద్యోగం లేదని, ఉద్యోగాలకు అరాటడుతున్న వారు లేరనే కాదూ?

విద్యా మంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం ఏప్రిల్ 1, 2024 నాటికి కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో మంజూరు అయిన, ఖాళీగా ఉన్న ఉద్యోగాల లెక్కలు ఇలా ఉన్నాయి: బోధనా సిబ్బంది– మంజూరు అయినవి 18,940 కాగా ఖాళీగా ఉన్నవి/ భర్తీ కానివి 5,060; బోధనేతర సిబ్బంది ఉద్యోగాలు: మంజూరు అయినవి 35,640 కాగా ఖాళీగా ఉన్నవి, భర్తీ కానివి 16,719. మరింత సమాజంలో బ్యాంకు ఉద్యోగాలు ప్రతిష్ఠాత్మకమైనవిగా ఉన్నాయి. వాటి వేతనభత్యాలే అందుకొక కారణం. 12 ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఉద్యోగాల పరిస్థితి ఇలా ఉంది: ఆఫీసర్లు 4,20,599; క్లర్క్‌లు–2,43,817; సబ్ స్టాఫ్–84,092. ఉద్యోగ ఖాళీలు: ఆఫీసర్లు 17,500; క్లర్క్‌లు 12,861; సబ్ స్టాఫ్ 2,206. కలత చెందవద్దు. ఆంతరంగిక భద్రత, ఆరోగ్య భద్రత, బ్యాంకింగ్ రంగాలలో అంతా సవ్యంగా ఉంది. నిర్దిష్ట విద్య, ఉద్యోగ నైపుణ్యాలు ఉన్న యువతను అగ్రశ్రేణి కంపెనీలతో అనుసంధానించేందుకు ప్రభుత్వ మద్దతు ఉన్న కార్యక్రమం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ అక్టోబర్ 2024లో ప్రారంభించారు. కంపెనీలకు రెండు




విడతలుగా చేసిన 1,65,000 ప్రతిపాదనలలో 20 శాతం మాత్రమే ఆమోదం పొందాయని డిసెంబర్ 2, 2025న ఒక జాతీయ దినపత్రిక వెల్లడించింది. వీరిలో ఐదోవంతు మంది ఇంటర్న్‌షిప్ పూర్తికాక ముందే వెళ్లిపోయారని కూడా ఆ పత్రిక పేర్కొంది.

అభివృద్ధి చెందుతున్న భారత్‌లో నిరుద్యోగం ఒక సమస్య కాదని విశ్వసిస్తున్నవారు ఈ వ్యాసాన్ని ఇంతటితో చదవడం ఆపివేయవచ్చు. నిరుద్యోగం ఒక తీవ్ర సమస్యగా ఉందని భావిస్తున్న వారు వ్యాసాన్ని పూర్తిగా చదవండి. సత్యాన్ని ఒప్పుకోవాలి. ప్రభుత్వ వ్యవస్థల్లో ఉద్యోగ ఖాళీలు పెద్ద సంఖ్యలో ఉండడం, అవి భర్తీ కాకపోవడం అనేది భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ పాలన లోనే కాదు, అంతకు ముందు నుంచీ ఉన్నది. దశాబ్దాలుగా ఉన్నది అనేది ఒక చేదు సత్యం. అయితే బీజేపీ పాలనలో సంభవించిన రెండు సంఘటనలతో ఆ పరిస్థితి మరింతగా పెచ్చరిల్లింది.

గతం పాపంలా వెంటాడుతోంది సుమా! ఆ రెండు సంఘటనల్లో మొదటిది నల్లధనంపై పోరాటం లేదా నోట్ల రద్దు (డీమానిటైజేషన్). ఇది మానవ తప్పిదమే. స్వయంగా చేసుకున్న తీవ్ర గాయమిది. గతంలో నేను వ్యాఖ్యానించినట్టుగా ఈ నోట్ల రద్దు (డీమానిటైజేషన్) కచ్చితమైన అర్థంలో నోట్ల రద్దు కాదు. ఎందుకని? మోదీ సర్కార్ చేసిన నోట్ల రద్దులో ఏ కరెన్సీ నోట్లను చెల్లనివిగా చేయలేదు. అంటే రద్దు చేయలేదు. కరెన్సీ నోట్ల చెలామణి వ్యవస్థ నుంచి వాటిని తీసివేయనూ లేదు. 'పాతనోట్లను తీసుకుని కొత్త నోట్లు ఇచ్చేందుకు' ప్రతిపాదించిన పథకమది. చెలామణిలో ఉన్న కరెన్సీ మొత్తం విలువను పాత స్థాయికి పునరుద్ధరించిన పథకమది. నిజానికి పునరుద్ధరింపబడిన కరెన్సీ విలువ పాత స్థాయికి మించి ఉన్నది. నవంబర్ 4, 2016న చెలామణిలో ఉన్న కరెన్సీ మొత్తం విలువ రూ.17.97 లక్షల కోట్లు కాగా, డిసెంబర్ 2025 తుది రోజుల నాటికి చెలామణిలో ఉన్న కరెన్సీ మొత్తం విలువ రూ.39.24 లక్షల కోట్లు. అందుకు రెట్టింపు కంటే చాలా అధికంగా ఉన్నది. నోట్ల రద్దుతో వాటిల్లిన మహా దుష్ఫలితం వేలాది చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల మూసివేత. లక్షలాది ఉద్యోగాలు ధ్వంసమయ్యాయి. ఈ వాస్తవాన్ని మోదీ ప్రభుత్వం ఈనాటికీ అంగీకరించడం లేదు అఖిల భారత వ్యాపార మండలి వెల్లడించిన వివరాల ప్రకారం 2016లో 6,25,00,000 చిన్న వ్యాపార సంస్థలు ఉండేవి. వాటిలో 48శాతం గత దశాబ్దంలో మూతపడ్డాయి.

రెండో సంఘటన కోవిడ్. ఈ మహమ్మారి కారణంగా 14శాతం సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలు శాశ్వతంగా మూతపడ్డాయని 2022లో ఒక సర్వే వెల్లడించింది. జూలై 2020–ఫిబ్రవరి 2025 మధ్య అంటే కోవిడ్ అనంతర కాలంతో కూడా కలుపుకుని మొత్తం 75,000 రిజిస్టర్డ్ ఎమ్ఎస్ఎమ్ఈలు మూతపడ్డాయని ప్రభుత్వ నివేదిక ఒకటి వెల్లడించింది. ఫిబ్రవరి 2022 నాటికి భారత్‌లో 47శాతం ఎమ్ఎస్ఎమ్ఈలు శాశ్వతంగా గానీ లేక తాత్కాలికంగా గానీ మూతపడ్డాయని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ అంక్టాడ్ (యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ ) అంచనా వేసింది. ఈ అంకెలు అన్నీ ధ్రువీకరింపబడినవి కానప్పటికీ చాలావరకు విశ్వసనీయమైనవేనని ప్రజల అనుభవాలు, ఆర్థిక నిపుణుల పరిశీలనలు నిర్ధారిస్తున్నాయి. సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలకు ఆర్థిక సహాయం అందిస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చలేదు. వాటి పునరుద్ధరణకు ఉదారంగా రుణ సదుపాయమూ కల్పించలేదు. కోవిడ్ మూలంగా మూతపడిన వ్యాపార సంస్థలతో లక్షలాది ఉద్యోగాలకు నష్టం వాటిల్లింది. ఈ ఉద్యోగాలను పునరుద్ధరించారా? కొత్త ఉద్యోగాలను సృష్టించారా? ఈ విషయమై ప్రభుత్వం మౌనం వహిస్తోంది.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో సరఫరా ఆధారిత, భరోసా నివ్వని, నిధుల కొరత తీవ్రంగా ఉండే పథకాన్ని ప్రవేశపెట్టారు. దీంతో గ్రామీణ పేదల పరిస్థితి మరింతగా దుర్భరమైపోయింది. అసలే ఉపాధి లేమితో సతమతమవుతున్న గ్రామీణ పేదల బతుకులు కొత్త పథకంతో మరింతగా కుదేలయిపోతున్నాయి. నిరుద్యోగం ఏమీ పెద్ద సమస్య కాదు అనేది ఒక కట్టుకథ, మోసపూరిత వాదన అది. కొత్త ఉపాధి పథకం వీబీ–జీ–రామ్ జీ విషయమై ప్రభుత్వం తనను తాను అభినందించుకుంటుంది కానీ కోట్లాది ప్రజలకు ఉపాధిరాహిత్యమనేది మన ఆర్థిక పురోగతిపై ఒక లజ్జాకరమైన, భయానకమైన మచ్చ.


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

# వేమన జయంతి తెలుగుకు గౌరవం!

'ప్రపంచ కవుల్లో సోక్రటీస్ ఎలాగో, తెలుగు సాహిత్యంలో వేమన అలా. ఆయన సత్యాన్ని నిర్భయంగా పలికారు.' 19వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి సీపీ బ్రౌన్, వేమన పద్యాల్లోని లోతును చూసి వ్యక్తం చేసిన అభిప్రాయం ఇది. వేల సంఖ్యలో ఉన్న ఆ పద్యాలను సేకరించి, వాటిని ఇంగ్లీష్‌లోకి అనువదించి, ప్రపంచ సాహితీ యవనికపై వేమనకు స్థానం కల్పించారు. అక్షరాయుధంతో సామాజిక విప్లవం తెచ్చిన సహజ కవి వేమన.

సాధారణంగా కవులు అంటే సామాన్యులకు అందని, అర్థం కాని అత్యున్నత సాహితీ విలువలు ఉన్న సాహిత్యం రాస్తారని అనుకుంటారు. కానీ వేమన ప్రతి వ్యక్తి నోటిపై సహజంగా పలికే సాహిత్యం రాశారు. 'విశ్వదాభిరామ వినుర వేమ' అనే మాట ఇప్పటి తరానికీ చిరపరిచితం అంటే, ఆ సాహిత్యానికి అంత జీవం ఉందని అర్థం. వేమన శతకం వినని తెలుగు చెవి ఉండదు. తరగతి గది నుంచి తాత్విక చర్చల వరకు, పల్లె పదాల నుంచి మేధావుల గోష్ఠుల వరకు వేమన పద్యం ఒక వేదంలా మార్మోగుతూనే ఉంటుంది.

వేమన 17వ శతాబ్దానికి చెందినవారు. ఆయన అసలు పేరు కుమారగిరి వేమారెడ్డి. ఆయన అన్న అనవేమారెడ్డి ఒక ప్రాంతానికి పాలకుడిగా ఉండేవారు. వేమన విలాసాల మధ్య పెరిగారని చెబుతారు. యవ్వనంలో వేమన ప్రాపంచిక సుఖాలకు లోనయ్యారని, అయితే తన వదిన మాటల ప్రభావంతో, తన గురువు అభిరామయ్య మార్గదర్శకత్వంలో ఆయనలో గొప్ప జ్ఞానోదయం కలిగిందని చరిత్ర చెబుతోంది. ఆ తర్వాత ఆయన విలాసాలను వదిలి సత్యాన్ని అన్వేషించే యోగిగా మారారు. సమాజంలోని కుళ్లను, మనుషుల వేషధారణలోని మోసాన్ని గమనించిన వేమన, అప్పటి నుంచి ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా దేశాటన చేశారు. ఈ క్రమంలోనే ఆయన సామాన్యుడి భాషలో పద్యాలు అల్లడం ప్రారంభించారు. వేమన సాహిత్యం అంటే 'ఆటవెలది' పద్యాలే. పండితులకే పరిమితమైన కవిత్వాన్ని సామాన్య ప్రజల చెంతకు చేర్చిన ఘనత ఆయనది. సుమారు 3000కు పైగా పద్యాలు రచించారు. ప్రతి పద్యం చివరన 'విశ్వదాభిరామ వినుర వేమ' అనే మకుటం ఉంటుంది. ఆయన పద్యాలలో కేవలం నీతి మాత్రమే కాక, సమాజంలోని మూఢనమ్మకాలు, కుల వివక్ష, మత మౌఢ్యంపై తీవ్రమైన విమర్శలు ఉండేవి. వేమన తన జీవితాంతం ప్రజల కోసమే జీవించారు. సత్యశోధనలో భాగంగా ఆయన కటారుపల్లిలో సజీవ సమాధి చెందారు. ప్రతి యేటా పెద్ద ఎత్తున వారికి ఈ ప్రాంతంలో ఉత్సవాలు జరుగుతాయి. ఇక్కడ నేటికి సమాధి ఆనవాళ్లు కనిపిస్తాయి.




**వేమన ఒక ప్రపంచ మానవుడు. సంస్కృత పదాల భారంతో నలిగిపోతున్న తెలుగు కవిత్వాన్ని జన బాహుళ్య భాషలోకి మళ్లించి, దానికి కొత్త రక్తాన్ని ఎక్కించిన ఘనత వేమనదే. 'విశ్వదాభిరామ వినుర వేమ' అనే మాట ఇప్పటి తరానికీ చిరపరిచితం అంటే, ఆ సాహిత్యానికి అంత జీవం ఉందని అర్థం.**

వేమనను కవిగా కాకుండా రాయలసీమ, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో దేవుడిగా పూజిస్తారు. బెంగళూరులో ప్రముఖ వాణిజ్య ప్రాంతంలో వేమన దేవాలయం ఉంది. వారి జయంతి, వర్ధంతి పేరుతో వేలాదిమంది మందితో కర్నాటకలో దశాబ్దాలుగా పలు ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వేమన పేరును కూడా అనేక మంది నేటికీ పెట్టుకుంటారు.

'నదులన్నీ ఒక్కటే కానీ పేర్లు వేరు... ఆవుల రంగులు వేరు కానీ పాలు ఒక్కటే' అన్న వేమన తత్వం నేటికీ సమాజ శాంతికి మూలాధారం. సమాజంలో వేళ్లూనుకున్న సంప్రదాయాలు మేలుకంటే కీడు చేస్తున్నాయని వేమన భావించారు. వేమన ఒక ప్రపంచ మానవుడు. సంస్కృత పదాల భారంతో నలిగిపోతున్న తెలుగు కవిత్వాన్ని జన బాహుళ్య భాషలోకి మళ్లించి, దానికి కొత్త రక్తాన్ని ఎక్కించిన ఘనత వేమనదే. పండితుల గదుల్లో బందీ అయిన తెలుగు పద్యానికి సంకెళ్లు తెంచి, దానికి స్వేచ్ఛను ప్రసాదించినవాడు వేమన. ఆయన పదాల్లోని సరళత్వం, ఆలోచనల్లోని గాంభీర్యం అద్వితీయం.

'వేమన ఒక 'డెమొక్రాటిక్ పోయెట్'. ఆయన పద్యం ఒక క్లాస్ రూమ్ కాదు, అది ఒక ప్రజా క్షేత్రం. సమాజం అనే రోగికి ఆయన పద్యం ఒక చేదు మందు లాంటిది' అనే అభిప్రాయం వ్యక్తం చేశారు ప్రముఖ విమర్శకులు ఆరుద్ర. వేమన కవిత్వంలో ప్రధానంగా కనిపించేది సత్యం. అది నేటికీ పదును తగ్గలేదు. వేమన కేవలం నీతి పద్యాల కవి మాత్రమే కాదు, గొప్ప హేతువాది, యోగి. శ్రీశ్రీ, ఆరుద్ర వంటి ఆధునిక కవులు వేమనను తమకు గురువుగా భావించేవారు. వేమన ఒక ప్రపంచ మానవుడు. ఆయన పద్యాల్లోని సామాజిక స్పృహ నేటి తరానికి ఆదర్శమని శ్రీశ్రీ చెబుతారు. వేమన ఒక నిప్పుకణిక. సమాజంలోని కుళ్లను కడిగేయడానికి ఆయన తన పద్యాన్ని ఆయుధంగా వాడారని డాక్టర్ సి.నారాయణరెడ్డి పలు సందర్భాల్లో చెప్పారు.

ఐక్యరాజ్యసమితి వేమనను ప్రపంచ కవుల జాబితాలో చేర్చింది. వేమన బోధించిన సత్యాలు ఏ ఒక్క మతానికో, దేశానికో పరిమితం కావు. ఆయన పద్యాల్లోని 'సమత', 'మమత', 'మానవత్వం' వంటి అంశాలు ప్రపంచవ్యాప్తంగా ఏ కాలానికైనా సరిపోతాయి. షేక్స్పియర్, సోక్రటీస్, కన్ఫ్యూషియస్ వంటి ప్రపంచ ప్రసిద్ధ కవులతో సమానమైన గౌరవం వేమనకు దక్కింది. వేమన పద్యాలు కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాలేదు. ఆయన సందేశాలు ఐరోపా దేశాల్లోని మేధావులను సైతం ఆకర్షించాయి. లండన్‌లోని బ్రిటిష్ లైబ్రరీలో కూడా వేమన పద్యాల ప్రతులు భద్రపరిచారు.

యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థ వేమనను గుర్తించినప్పుడు, తెలుగు నేల మీద ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆ మహనీయుడికి మనం ఇచ్చే కనీస గౌరవం. కర్ణాటక రాష్ట్రంలో వేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సైతం గతంలో అధికారికంగా నిర్వహించారు. ఈ సంవత్సరం కూడా వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలి.

• యస్.విష్ణువర్ధన్‌రెడ్డి
బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు

*(జనవరి 19: వేమన జయంతి)*

# 'రోహిత్' అమరత్వానికి పదేళ్లు

దళిత పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో వ్యవస్థీకృత హత్యకు గురై నేటికి పది సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్‌లో ఒక రోజు సెమినార్ జరుగనున్నది. ఉదయం పది గంటల నుంచి నాలుగు సెషన్లుగా ఈ సెమినార్ జరుగుతుంది. 'విశ్వవిద్యాలయం భావన–నయా ఉదారవాద కాలంలో ప్రజలు న్యాయం' అంశంపై ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు; 'ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థులపై కుల అణచివేత, హింసలు–రోహిత్ చట్టం ఆవశ్యకత' అంశంపై వి.రఘునాథ్, అప్పసింగ్, మృదుల, డాక్టర్ ప్రశాంత్ దొంత; 'కులం, రాజ్యం–విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి ఉద్యమాలు' అంశంపై ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ; 'రోహిత్ వేముల మరణం ముందు తర్వాత పరిణామాలు–విద్యార్థులు, విద్యార్థి ఉద్యమాలు' అంశంపై ప్రొఫెసర్లు కె.వై.రత్నం, జి.విజయ్, డా. వేల్పుల సుంకన్న, డా. చెముడగుంట శేషయ్య ప్రసంగిస్తారు. బండారి లక్ష్మయ్య అధ్యక్షత వహిస్తారు.

– కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి


# సీపీఐ: వందేళ్ల విశిష్ట ప్రస్థానం

ఎన్నో కుట్రలు, నిర్బంధాలు, ఉరికొయ్యలను ఛేదించి చెరసాలల్లో పురుడుపోసుకొని భారతగడ్డపై నూరేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ప్రగతిశీల రాజకీయశక్తి భారత కమ్యూనిస్టు పార్టీ. ఈ జయాపజయాల ప్రస్థానం 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ప్రారంభమయింది. కమ్యూనిస్టుల పురిటిగడ్డ అయిన ఖమ్మం పట్టణంలో ఈ నెల 18న శత వసంతాల వేడుకలను నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయించింది. ఈ వేడుకలలో 10వేల మంది అరుణ సైన్యం కవాతు చేయబోతోంది. బహిరంగసభకు భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరుకానున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సౌహార్ద సందేశం ఇవ్వనున్నారు. 20న నిర్వహించే సెమినార్‌కు డి.రాజాతో పాటు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబి, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఫార్వార్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేవరాజన్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరుకానున్నారు.

సీపీఐ పుట్టుకే శ్రామిక అంతర్జాతీయత, దేశభక్తితో మిళితమై ఉంది. వివిధ శ్రేణులుగా ఉన్న దేశభక్తులను, స్వాతంత్ర్య సమరయోధులను కమ్యూనిజం వైపు తీసుకువచ్చింది. భారతదేశంలో ఉన్న జాతీయ విప్లవకారులు, జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగా పనిచేస్తున్న సోషలిస్టు కాంగ్రెస్ పార్టీలోని అనేక మంది, అతివాదపక్షం, టెర్రరిస్టు సంస్థలు, ఖిలాఫత్ ఉద్యమ నాయకులు, గదర్ పార్టీ నాయకులు సోషలిజం వైపు ఆకర్షితులయ్యారు. 1921–22లో శాసనోల్లంఘన ఉద్యమం విఫలమైన తర్వాత గాంధీజీ ప్రతిఘటన సిద్ధాంతం పట్ల భ్రమలు కోల్పోయిన వ్యక్తులు, గ్రూపులు కూడా అక్టోబర్ విప్లవ ప్రభావంతో శాస్త్రీయ సోషలిజం వైపు ఆకర్షితులయ్యారు. ఆ తర్వాత వీరే దేశంలో తొలి కమ్యూనిస్టు గ్రూపుల స్థాపకులయ్యారు. బొంబాయిలో డాంగే, మద్రాసులో సింగార్‌వేల్ సెట్టియార్, కలకత్తాలో ముజఫర్ అహ్మద్, లాహోర్‌లో ఇంక్విలాబ్ గ్రూపులకు చెందిన గులాం హుస్సేన్ తదితరుల కలయికతో 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటయింది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో, రైతాంగ పోరాటాలలో, స్వదేశీ సంస్థానాల్లో, విముక్తి పోరాటాల్లో, సంఘ సంస్కరణలు, సామాజిక మార్పుల కోసం జరిగిన పోరాటాల్లో ఇంకా అనేక రీతుల్లో జరిగిన భారత ప్రజల విప్లవ ఉద్యమంలో పాల్గొన్న వారిలో అధికులు కమ్యూనిస్టు ఉద్యమంలో చేరారు.

కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రమాదకరంగా భావించిన బ్రిటిష్ ప్రభుత్వం 1934 జూలైలో పార్టీని నిషేధించింది. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులందరూ కాంగ్రెస్‌లోనే ఉండి పనిచేసి దేశ స్వాతంత్ర్యం కొరకు ద్విగుణీకృత పోరాటాలు నడిపారు. కాంగ్రెస్‌లోనే అంతర్భాగంగా సోషలిస్టు కాంగ్రెస్ పార్టీని 1932–34 ఏర్పాటు చేసుకున్నారు. అంతిమంగా సోషలిస్టు కాంగ్రెస్‌లోని కమ్యూనిస్టులతో

**పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిస్టు వ్యవస్థ మాత్రమే. మనిషి కేంద్రంగా పుట్టిన సిద్ధాంతమే కమ్యూనిస్టు సిద్ధాంతం. మనిషి ఉన్నంతకాలం, మనిషిలో ఆలోచనలు, భావాలు, ప్రశ్నలు ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుంది. సృష్టి ఉన్నంతకాలం కమ్యూనిజం కొనసాగుతుంది. కమ్యూనిస్టుల విలీనం దేశానికి, దేశ ప్రయోజనాలకు ఒక దిక్సూచి.**




పాటు మరెంతో మంది అభివృద్ధి కాముకులు అక్టోబర్ విప్లవ ప్రభావంతో కాంగ్రెస్‌లోనే వామపక్ష గ్రూపుగా ఏర్పడ్డారు. తదనంతరం అనేక మంది సోషలిస్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు కమ్యూనిస్టు పార్టీలో చేరారు. వీరిలో ఈఎంఎస్ నంబూద్రిపాద్, చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, ఎ.కె.గోపాలన్, కంభంపాటి సీనియర్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ప్రముఖులు.

ఒకనాటి అస్సాం రాష్ట్రం ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న చాబర్ సిల్‌హెట్ జిల్లాలోని లోయ ప్రాంతంలో వీరోచిత కౌలురైతుల పోరాటాలు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగాయి. ఆ పోరాటవీరులు అనేక మంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా వర్లీ తెగకు చెందిన ఆదివాసీలు తిరుగుబాటు చేశారు. 1946లో రాయల్ ఇండియన్ నావీ తిరుగుబాటుదారులు కమ్యూనిస్టు పార్టీ జెండాను చేతబూనారు.

1946–51 మధ్య జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించబడింది. మూడు వేల గ్రామాల విముక్తి, 10లక్షల ఎకరాల భూమి రైతాంగానికి పంపిణీ, వెట్టిచాకిరి రద్దు లాంటి అనేక విజయాలు ఈ పోరాటంలో సాధించారు. ప్రధానంగా నిజాం నవాబు లొంగిపోవడం, హైద్రాబాద్ రాష్ట్రం భారత్‌లో విలీనం, సాయుధ పోరాట ప్రభావంతోనే జరిగాయి. విలీనం తర్వాత భారత సైన్యం, పోలీసులు కమ్యూనిస్టులపై దాడులకు పాల్పడటంతో జరిగిన రైతాంగ గెరిల్లా పోరాటంలో 4000మందికి పైగా కమ్యూనిస్టులు మృతి చెందారు. 10వేల మందిని డిటెన్షన్ క్యాంపుల్లో పెట్టి మూడు, నాలుగు సంవత్సరాల పాటు చిత్రహింసలకు గురిచేశారు. మహిళలతో నగ్నంగా బతుకమ్మలాడించారు. అన్ని నిర్బంధాలను తట్టుకొని నిలబడటమే కాకుండా 1952లో జరిగిన ఎన్నికల్లో అటు మద్రాస్ రాష్ట్రంలోనూ, ఇటు హైద్రాబాద్‌లోని తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టులు కాంగ్రెస్ కంటే అధిక స్థానాలు సాధించారు.

కమ్యూనిస్టుల ఉద్యమ ప్రభావం రాజ్యాంగ పీఠికలో స్పష్టంగా కనిపించింది. దున్నేవాడికే భూమి నినాదంతో జమిందారీ, జాగిర్దారీ పాలనకు వ్యతిరేకంగా రైతు కూలీలను సమీకరించారు. భూ సమస్యను ఎజెండా మీదకు తెచ్చారు. కార్మికులు, కర్షకులతో పాటు మహిళలు, దళితులు, ఆదివాసీలు స్వాతంత్ర్యోద్యమంలోకి వచ్చారు. మహిళా హక్కులు, కుల నిర్మూలన, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమించింది. మహిళా సమానత్వ హక్కును ఎజెండాలోకి తెచ్చింది. యువతను విద్యా, వైజ్ఞానిక సేవా సాంస్కృతిక కార్యక్రమాల్లో సమీకరించింది. ఏఐటీయూసీ, అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), అఖిల భారత విద్యార్థి సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ), అభ్యుదయ రచయితల సంఘం, ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ (ఇప్టా), తెలుగు రాష్ట్రాల్లో ప్రజానాట్య మండలి ఏర్పాటయ్యాయి. అలాగే బ్యాంకు ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు, పాత్రికేయులకు, బొగ్గు గని కార్మికులకు, రవాణా కార్మికులకు, ఆయా రంగాల్లో వివిధ కార్మిక సంఘాలను ఏర్పాటు చేశారు.

దేశంలో కమ్యూనిజం ఆవశ్యకత, అవసరం ఎన్నడూలేని విధంగా నేడు ఉన్నది. ఉద్యోగ భద్రత లేదు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల పేరుతో అతి తక్కువ వేతనాలతో కొత్తరూపంలో శ్రమదోపిడి జరుగుతున్నది. భావాన్ని, ప్రశ్నించేవారిని అణచివేస్తున్నారు. రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారు. కవులు, కళాకారులను మతోన్మాద అరాచకులు కాల్చి చంపుతున్నారు. సోషల్ మీడియాను ఒక యూనివర్శిటీగా మల్చుకొని విద్రోహపూరిత విషజ్వాలలను సమాజంలో విరజిమ్ముతున్నారు. ఆర్థిక అసమానతలు ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. 4వ ఆర్థిక వ్యవస్థగా చెప్పబడుతున్నా, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైంది. అలీన విధానాన్ని గాలికి వదిలేసి అమెరికా ఆదేశాలను పాటించే స్థితికి దేశ పాలకులు వచ్చారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్సు రంగాలను సరళీకరణ పేరుతో విదేశీ, కార్పొరేట్ శక్తులకు స్వాధీనం చేస్తున్నారు. బొగ్గు గనులు, ఉక్కు కర్మాగారాలు, రైల్వే వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, ఆఖరికి అణుశక్తి లాంటి వ్యవస్థల్లో విదేశీయులను పెట్టుబడుల పేరుతో అనుమతిస్తున్నారు. ఈ దశలో ప్రజలు కమ్యూనిస్టు వ్యవస్థను కోరుకుంటున్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిస్టు వ్యవస్థ మాత్రమే. మనిషి కేంద్రంగా పుట్టిన సిద్ధాంతమే కమ్యూనిస్టు సిద్ధాంతం. మనిషి ఉన్నంత కాలం, మనిషిలో ఆలోచనలు, భావాలు, ప్రశ్నలు ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుంది. సృష్టి ఉన్నంత కాలం కమ్యూనిజం కొనసాగుతుంది. కమ్యూనిస్టుల విలీనం దేశానికి, దేశ ప్రయోజనాలకు ఒక దిక్సూచి.



■ కూనంనేని సాంబశివరావు
సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి





చెరుకుపల్లి : తూర్పుపాలెం కోడి పందేల బరి ఏరియల్ వ్యూ

# పగ్గాల్లేని పందేలు

సంక్రాంతి సంబరాల మాటున ఏర్పాటు చేసిన కోడి పందేల బరుల వద్ద మూడు రోజుల పాటు కోట్లాది రూపాయలు చేతులు మారాయి. జూదరులను ఆకర్షించేందుకు నిర్వాహకులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. పందెం బహుమతులుగా కార్లు, బుల్లెట్ వాహనాలను ఇస్తున్నామని ప్రకటనలు గుప్పించడంతో సుదూర ప్రాంతాల నుంచి పందెం కోళ్లతో బారులు తీరారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న స్థానికులతో పాటు తెలంగాణ వాసులు కూడా కార్లలో వచ్చి కోడి పందేలను వీక్షించి.. పైపందేలు కాశారు. బరుల వద్ద మద్యం ఏరులై పారగా.. జూద క్రీడలు విచ్చలవిడిగా సాగాయి. జూద క్రీడలు, పందేలను అడ్డుకోవాల్సిన పోలీసు శాఖ ప్రేక్షక పాత్ర వహించి.. మిన్నకుండిపోయింది.



పర్చూరు : అన్నంబొట్లవారిపాలెంలో పొట్టేళ్ల పందేలు



## రూ.కోట్లు కొల్లగొట్టిన పందెం కోళ్లు

## విచ్చలవిడిగా జూద క్రీడలు

- భారీగా తరలి వచ్చిన జూదరులు
- వీక్షకుల నుంచి విశేష ఆదరణ
- బరుల వద్ద ఏరులై పారిన మద్యం
- పోలీసు శాఖ ప్రేక్షక పాత్ర

కొల్లూరు, నరసరావుపేట, చెరుకుపల్లి జనవరి 16 (ఆంధ్రజ్యోతి: బాపట్ల జిల్లాలోని వేమూరు నియోజకవర్గంలో వేమూరు, కోడిపర్రు, కొల్లూరు మండలంలో క్రాప అడ్డ రోడ్డు వద్ద, అనంతవరం, చుండూరులో ఈ సంక్రాంతికి అధికార పార్టీ నాయకులు సంక్రాంతి సంబరాల పేరుతో కోడిపందేల బరులను ఏర్పాటు చేశారు. ఈ నెల 13న అనధికారికంగా కోడి పందేలు నిర్వహించి 14, 15, 16 తేదీల్లో భారీస్థాయిలో జూద కార్యకలాపాలను బహిరంగంగానే కొనసాగించారు. గుండాట, కోతముక్క, పేకాట, స్పిన్ తదితర జూద క్రీడలను బరుల ప్రాంగణంలో విస్తృతంగా నిర్వహించారు. అదృష్టవంతులకు సొమ్ము రాగా దురదృష్టవంతులు సొమ్మును పోగొట్టుకుని దిగాలుగా ఇంటి ముఖం పట్టారు. పురుషులతో పాటు మహిళలు, యువతులు, చిన్నారులు సైతం వీక్షణకు తరలివచ్చారు.



కొల్లూరు బరిలో తలపడుతున్న కోడి పుంజులు



తూర్పుపాలెం వద్ద హోరాహోరీ

### నేతలకు లాభసాటిగా పందేలు..

పల్నాడు జిల్లాలో అడిగేదెవరూ.. అపేదెవరూ అన్న రీతిలో అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోయారు. సంక్రాంతికి మూడు రోజుల పాటు యథేచ్ఛగా కోడి పందేలు

(మిగతా 7వ పేజీలో)

### శుభం కార్డుకు ముందు.. పోలీసుల ఎంట్రీ

కొల్లూరు, జనవరి 16 (ఆంధ్ర జ్యోతి): సినిమాల్లో శుభం కార్డు పడేముందు పోలీసులు ఎంట్రీ ఇచ్చినట్లు.. కోడిపందేలు ముగిసే సమయానికి బరుల వద్దకు ఖాకీలు వచ్చి హడావుడి చేశారు. కోడి పందేలు శుక్రవారం సాయంత్రం 8 గంటలకు ముగించారు. బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్ కోడి పందేల బరులను సాయంత్రం ఆరు గంటలకల్లా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయడంతో.. చుండూరు, వేమూరు, కొల్లూరులోని బరుల వద్దకు పోలీసులు చేరుకున్నారు. అయితే పందేలు మధ్యలో ఉన్నాయని నిర్వాహకులు వారికి నచ్చజెప్పారు. పందేలు పూర్తయిన తర్వాత టెంట్లు తదితర వాటిని పోలీసు సిబ్బంది తీసి వేయించారు. పేకాటగుడారాలను తొలగించాలని హుకుం జారీ చేశారు. ఇకపై ఎటువంటి జూదాలు నిర్వహించకూడదని హెచ్చరించారు. బరుల నిర్వహణపై కొందరిని బైండోవర్ చేసినట్లు సమాచారం.



రొంపిచర్ల : కొనకంచివారి పాలెం వద్ద కోడి పందేల బరి వద్ద జనం



బరిలో కోతముక్క



తూర్పు పాలెం బరి వద్ద వాహనాలు

### చేతులు మారిన రూ.200 కోట్లు

రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో యథేచ్ఛగా కోడిపందేలు ఐదురోజుల నుంచి జరుగుతున్నాయి. శుక్రవారం కనుమ సందర్భంగా 10 బరులతో కోడి పందేలు జోరుగా కొనసాగాయి. కోళ్ల యజమానులు కాసే పందేల కన్నా పైపందేలు అధికంగా జరిగాయి. తూర్పుపాలెం బరుల వద్ద ఇసుకేస్తే రాలనంత జనసందోహం నెలకొంది. ఐదు రోజుల్లో సుమారు రూ.200 కోట్లు పందేలు జరిగి ఉంటాయని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. వీఐపీ బరిలో లక్ష నుంచి రూ.5లక్షల పందేలు జోరుగా కొనసాగాయి. సంక్రాంతి పండగ రోజున రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పందేలను వీక్షించారు.



నకరికల్లు : కండ్లకుంటలో ఎడ్ల బండిపై వస్తున్న యువతీ యువకులు

- సంప్రదాయాలను ప్రతిబింబించిన సంబరాలు
- అర్చనలు, గోపూజలు, పెద్దలకు తర్పణం..
- సాంస్కృతిక కార్యక్రమాలు, పందేలు, పతంగులు
- ఉమ్మడి కుటుంబాలు.. పిండి వంటలు
- భారంగా నేడు పల్లెలు విడిచి ఉపాధి బాట..

# సంతోషాల సంక్రాంతి

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంబరాలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. భోగి మంటలతో ప్రారంభమైన వేడుకలు సంక్రాంతి, కనుమతో ముగిశాయి. ధాన్యపు సిరులు ఇంటికొచ్చిన వేళ.. ఉద్యోగం, వ్యాపారం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వేలాది మంది, పట్టణాల్లో ఉన్న వారంతా స్వస్థలాలకు చేరుకున్నారు. బొమ్మల కొలువులు, రంగవల్లులతో ఇళ్ల లోగిళ్లు రంగుల మయం కాగా.. పిండివంటలతో పల్లెలు ఘుమ ఘుమలాడాయి. ఆలయాల్లో దైవ దర్శనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పండుగను మరింత ఆనందమయం చేశాయి. దేవతామూర్తుల ఊరేగింపులు, తెప్పోత్సవాలు వేడుకగా నిర్వహించారు. కనుమ పండుగ శుక్రవారం రైతులు పశువులను అలంకరించి పూజలు చేశారు. గో పూజలు ఘనంగా జరిగాయి. పల్లెలన్నీ పండుగ శోభతో వెల్లివిరియగా.. సొంతూళ్ల బాట పట్టిన వారంతా.. పట్టణం వైపుగా శనివారం నుంచి తిరుగు పయనానికి సిద్ధమయ్యారు. పండుగ మిగిల్చిన అనుభూతులతో భారంగా వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఇదే అదనుగా హైదరాబాద్‌కు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు పెద్ద ఎత్తున దోపిడీకి తెరలేపాయి. మామూలు రోజల్లో ఉండే ధరలకు దాదాపు రెండు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండుగకు విదేశాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. పర్చూరు, బాప ట్లలో జరిగిన జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు పండగ సంబరాలను రెట్టింపు చేశాయి.

### సరస్‌లో సంక్రాంతి

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి వేళ గుంటూరులోని సరస్ మేళా ప్రాంగణంలోని వేదికపై భిన్నత్వంలో ఏకత్వం సాక్షాత్కరించింది. శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ సంగీతం, ఆర్ట్స్, నృత్య కళాశాల ఆధ్వర్యంలో ఆర్.లక్ష్మీ శ్రీనివాస్ భక్తి, సినీ గీతాల ఆలాపన వీనుల విందుగా కొనసాగింది. ఒడిశా థింసా గిరిజన జానపద నృత్యాలు, సంప్రదాయ వాయిద్య కచేరీతో హోరెత్తించారు. పల్నాడు కళాకారుల రామాయణ తోలుబొమ్మలాట అద్భుతంగా ప్రదర్శించారు.



ఒడిస్సా కళాకారుల థింసా గిరిజన జానపద నృత్యం



నరసరావుపేటలో చిన్నారుల కుర్చీ లాట



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి లోకేశ్

## ఎంపీఎల్‌లో లోకేశ్ జోష్

మంగళగిరి సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో జరుగుతున్న ఎంపీఎల్ సీజన్-4 క్రికెట్ టోర్నీలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం సందడి చేశారు. తన పుట్టిన రోజు ను పురస్కరించుకుని మంగళగిరి బైపాస్‌లోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న క్రికెట్ టోర్నీని శుక్రవారం ఆయన సందర్శించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం పలికా రు. ఎంపీఎల్‌లో భాగంగా 27వ రోజు మూడో రౌండ్ ఆఖరి మ్యాచ్‌లో వల్లభనేని వెంకట్రావు యూత్, విక్కీ లెవన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ను లోకేశ్ టాస్ వేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని కొద్దిసేపు మైదానంలో క్రికెట్ ఆడి యువతను ఉత్సాహ పరి చారు. నేతలతో కలిసి గ్యాలరీలో కూర్చొని మ్యాచ్‌ను వీక్షించారు. స్థానిక మహిళలు, యువతతో కలిసి మంత్రి లోకేశ్ ఫొటోలు దిగారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ద య్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రాజధానిలో మట్టి గుట్టలు మాయం

**- యథేచ్ఛగా అక్రమ రవాణా**

తుళ్లూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని మట్టిని అమ్ముకుంటున్నారు. అక్రమంగా వేరే జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాజధానిలో పలు కంపెనీలు రోడ్లు, కాల్వల అభివృద్ధి పనులు చేస్తుండటంతో పెద్ద ఎత్తున మట్టి కుప్పలుంటున్నాయి. వాటిని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఇందులో టీడీపీ, వైసీపీ వ్యక్తుల పాత్ర కీలకంగా కనిపిస్తోంది. అర్ధరాత్రిళ్లు మట్టిని తరలిస్తున్నారు. పోలీసులు ఓ పక్క మట్టి లారీలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నా.. ఈ దందా ఆగడం లేదు. ఇటీవల రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబు నాయుడు నియమించిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ త్రీమెన్ కమిటీ ముందు స్థానిక రైతులు ఈ విషయాన్ని ప్రస్తావించారు. మట్టి అక్రమ రవాణాను అడ్డుకోకుంటే రైతుల ప్లాట్ల అభివృద్ధికి సీఆర్డీఏ బయట నుంచి మట్టి కొనుగోలు చేసి భారం మోయాల్సి వస్తుందని తేల్చి చెప్పారు. అయినా ఇంత వరకు సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

నేటి నుంచి ఎన్టీఆర్ కళా పరిషత్

## నాటకోత్సవాలు

- ముఖ్య అతిథిగా మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె లక్ష్మీనారాయణ
- డాక్టర్ లావు రత్తయ్యకు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం

సామాజిక సంస్కరణలకు

## త్రిపురనేని కృషి

7

## మాంసానికి డిమాండ్

- కేజీ మటన్ రూ.1,100, చికెన్ రూ.310
- చేపల మార్కెట్‌లో మరింత రద్దీ

పొన్నూరు. జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం కనుమకు మాంసాహార ప్రియులకు ముక్క లేనిదే ముద్ద దిగదు. ఇందు కోసం ఎవరి స్తోమత కొద్దీ వారు చికెన్, మటన్, చేపలు కొనుగోలు చేసి జిహ్వా చాపల్యాన్ని తీర్చుకుంటారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచే గుంటూరు, నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లోని ప్రధాన పట్టణాల్లో కనుమ సందడి నెలకొంది. మటన్, చికెన్ స్టాల్స్ వద్ద కొనుగోలుదారుల రద్దీ కనిపించింది. ముఖ్యంగా మటన్ కేజీ రూ.900 నుంచి అత్యధికంగా కిలో రూ. 1,100కు విక్రయించారు. చికెన్ స్కిన్ లెస్ రూ. 250 నుంచి రూ.310 వరకు అమ్మకాలు జరిగాయి. బంధువులు, కుటుంబ సభ్యుల రాకతో.. చాలామంది ఎక్కువగా చికెన్, మటన్, చేపలు కొనుగోలు చేశారు. ఎన్నడూ లేని విధంగా గుంటూరులోని లాలాపేట చేపల మార్కెట్‌లో కొనుగోలుదారులతో రద్దీగా కనిపించింది. చికెన్, మటన్ తినని వారు చేపలు తినేందుకు ఆసక్తి చూపారు. దుకాణాలను యజమానులు పూలతో అందంగా అలంకరించారు. వినియోగదారులకు ఎండ పడకుండా షామియానాలు ఏర్పాటు చేశారు.



మటన్ స్టాల్ వద్ద కొనుగోలుదారుల కోలాహలం



కొనుగోలు దారులతో చేపల మార్కెట్ రద్దీ

# పండుగ కానుకగా.. కొత్త రోడ్డు!



- సంక్రాంతి రోజున ప్రారంభమైన వెస్ట్ బైపాస్
- ఒకవైపు పూర్తిస్థాయిలో రాకపోకలకు అనుమతి
- మార్చి నెలాఖరుకు పూర్తిస్థాయిలో..

గుంటూరు, మంగళగిరి జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, విజయవాడ, అమరావతి వాసులకు సంక్రాంతి కానుకగా కొత్త రోడ్డు అందుబాటులోకి వచ్చింది. సంక్రాంతి పండుగ రోజు ఉదయం 9:40 గంటలకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వెస్ట్ బైపాస్‌ను ప్రారంభించారు. గుంటూరు నుం చి విజయవాడకు మూడు లేన్ల బైపాస్‌లో రాకపోకలకు అనుమతించారు. దీంతో బైపాస్‌లో వాహనాలు దూసుకుపోతున్నాయి.

**● ట్రాఫిక్ నుంచి విముక్తి**

వెస్ట్ బైపాస్ అందుబాటులోకి రావడంతో గుంటూరు, విజయవాడ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పినట్లేననుకోవాలి. ప్రత్యేకించి పండగకు వచ్చి తిరిగి వెళ్లేవారికి విజయవాడ ట్రాఫిక్ దిగ్బంధనం నుంచి విముక్తి లభించనట్లయ్యింది. పండగ అనంతరం గుంటూరు నుంచి హైదరాబాద్, ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లే వారికి విజయవాడలో అడుగుపెట్టే పని లేకుండా వెళ్లిపోవచ్చు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి గన్నవరం విమానాశ్రయానికి వెళ్లేవారికి కూడా విజయవాడ ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే. గతంలో పండుగలు, వారాంతపు రోజుల్లో విజయవాడ బెంజ్ సర్కిల్, రమేశ్ హాస్పిటల్, మహానాడు జంక్షన్లు, రామవరప్పాడు రింగు రోడ్డు, నిడమానూరు సెంటర్లలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయేది. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారేది. దీంతోపాటు రాజధాని అమరావతిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు కూడా రాకపోకలకు మార్గ సుగమమైంది.

**● తగ్గిన దూరం..**

గుంటూరు జిల్లా కాజ టోల్‌గేటు వద్ద నుంచి ఎన్టీఆర్ జిల్లా చిన్న అవుటుపల్లి దగ్గర ఉన్న టోల్‌గేటు వరకూ 47 కి.మీ. మేర వెస్ట్‌బైపాస్‌ను నిర్మించారు. ఈ బైపాస్ వల్ల హైదరాబాద్ సహా, ఎన్టీఆర్ జిల్లాలోని చాలా ప్రాంతాలు, తెలంగాణాలోని అనేక ప్రాంతాలకు మధ్య దూరం కూడా తగ్గుతోంది. హైదరాబాద్ వెళ్లే వారు విజయవాడలోకి వెళ్లే పనిలేకుండా వెస్ట్‌బైపాస్ మీదుగా గొల్లపూడి వెళ్లి అటు నుంచి ఎన్‌హెచ్- 65కి వెళ్లిపోతారు. తద్వారా 10 కిలోమీటర్ల వరకు దూరం తగ్గుతుంది. దీంతోపాటు కొండపల్లి, కంచికచర్ల, నందిగామ, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, తెలంగాణలోని కోదాడ, సూర్యాపేటల మధ్య దూరం తగ్గడంతో పాటు, రాకపోకలకు మార్గం సుగమమైంది. అయితే ప్రస్తుతం ఈ రోడ్డు గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గాన్ని మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. రెండోవైపు రోడ్డు కూడా అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుంది. అయితే ఈ రోడ్డు మార్చి నెలాఖరు నాటికి అందుబాటులోకి వస్తుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు.

## వైభవంగా నృసింహుని పార్వేట ఉత్సవం



ఉభయ దేవేరులతో శ్రీలక్ష్మీనృసింహస్వామి

మంగళగిరి సిటీ, జన వరి 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి హరిదాసులు, జంగం దేవరులు, బుడ బు క్కల వేషాలు, పిట్టల దొర లు, గంగిరెద్దుల విన్యాసాలు ఏర్పాటు చేశారు. భక్తులు, ప్రజలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కనుమ సందర్భంగా శుక్రవారం దిగువ సన్నిధిలో గోపూజ నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులతో శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారు పార్వేట (గిరి ప్రదక్షిణ) ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో కె.సునీల్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నేడు కమిషనర్ మయూర్ అశోక్ బాధ్యతల స్వీకారం



గుంటూరు కార్పొరేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా 2019 ఐఏఎస్ అధికారి కె.మయూర్ అశోక్ శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఆయన బాధ్యతల స్వీకారానికి సంబంధించి కమిషనర్ చాంబరులో ఏర్పాట్లను సిబ్బంది పూర్తిచేశారు.

# నవ్య

కుటుంబ కదంబం



# వేడి వేడిగా వెరైటీ సూప్‌లు

చలికాలంలో వేడి వేడిగా ఏదైనా సూప్ తాగితే హాయిగా అనిపిస్తుంటుంది. అందుకే ఈ సమయంలో అందరూ టమాటా సూప్, వెజిటబుల్ సూప్, చికెన్ నూడుల్స్ సూప్‌లాంటి రకాలను ఇష్టంగా ఆస్వాదిస్తుంటారు. వీటికి భిన్నంగా ఇంట్లోనే సులువుగా తయారు చేసుకోదగ్గ కాంటినెంటల్ సూప్‌ల వివరాలు మీకోసం...

## బటర్నట్ స్క్వాష్ సూప్



**కావాల్సిన పదార్థాలు**

● బటర్నట్ స్క్వాష్ (తీపి గుమ్మడికాయ)- చిన్నది, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, ఎండు మిర్చి- మూడు, మిరియాలు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, వెల్లుల్లి తరుగు- ఒక చెంచా, అల్లం తురుం- ఒక చెంచా, సన్నగా తరిగిన ఉల్లికాడలు- రెండు చెంచాలు, బటర్- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, కొత్తిమీర తరుగు- కొద్దిగా, రెడ్ చిల్లీ ఫ్లేక్స్- ఒక చెంచా

**తయారీ విధానం**

● తీపి గుమ్మడికాయకు తొక్క తీసి మధ్యకు కోసి గింజలు తొలగించాలి. ఆ పైన చిన్న ముక్కలుగా తరిగి గిన్నెలోకి తీసుకోవాలి. స్టవ్ మీద వెడల్పాటి పాన్ పెట్టి చెంచా బటర్ వేసి కరిగించాలి. తరువాత ఎండుమిర్చి, మిరియాలు, జీలకర్ర వేసి దోరగా వేయించాలి. ఆ పైన ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. రెండు నిమిషాల తరువాత తీపి గుమ్మడికాయ ముక్కలు, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి పది నిమిషాలపాటు మగ్గించాలి. ముక్కలు మెత్తబడిన తరువాత స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. ఈ మిశ్రమాన్ని బ్లెండర్‌లో వేసి కొన్ని నీళ్లు చిలకరించి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఈ పేస్టుని గిన్నెలోకి తీసుకుని రెండు గ్లాసుల నీళ్లు పోసి బాగా కలపాలి. ఆ పైన గిన్నెను స్టవ్ మీద పెట్టి మూడు నిమిషాలపాటు మిశ్రమాన్ని మరిగించాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి చెంచా బటర్ వేసి అది కరిగిన తరువాత వెల్లుల్లి తరుగు, అల్లం తురుం, ఉల్లికాడల ముక్కలు వేసి దోరగా వేయించి మరుగుతున్న గుమ్మడి ముక్కల సూప్‌లో వేసి కలపాలి. రెండు నిమిషాల తరువాత స్టవ్ మీద నుంచి దించి కొద్దిగా కొత్తిమీర తరుగు, రెడ్ చిల్లీ ఫ్లేక్స్ చల్లి వేడి వేడిగా సర్వ్ చేయాలి.

## మినిస్ట్రోన్ సూప్

**కావాల్సిన పదార్థాలు**

● క్యాబేజీ తరుగు- అర కప్పు, టమాటాలు- రెండు, కేరట్ ముక్కలు- ఒక కప్పు, సెలెరీ తరుగు- అర కప్పు, జుకిని ముక్కలు- అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, ఉడికించిన రెడ్ బీన్స్- ఒక కప్పు, బిరియానీ ఆకు- ఒకటి, వెల్లుల్లి తరుగు- రెండు చెంచాలు, ఉడికించిన వీట్ పాస్తా- అర కప్పు, ఆలివ్ ఆయిల్- మూడు చెంచాలు, ఉప్పు- తగినంత, కారం- అర చెంచా, చీజ్ తురుం- ఒక చెంచా, మిరియాల పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా

**తయారీ విధానం**

● టమాటాల మీద రెండు గాట్లు పెట్టి గిన్నెలో వేసి కొన్ని నీళ్లు పోసి ఉడికించాలి. తరువాత టమాటాలకు తొక్క తీసి మిక్సీలో వేసి ఉడికించిన నీళ్లు కూడా పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ ప్యూరీని గిన్నెలోకి తీసుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి ఆలివ్ ఆయిల్ వేసి వేడిచేయాలి. ఆ పైన వెల్లుల్లి తరుగు, బిరియానీ ఆకు, ఉల్లిపాయ ముక్కలు, క్యాబేజీ తరుగు, కేరట్ ముక్కలు, పావు చెంచా ఉప్పు వేసి బాగా కలిపి మూతపెట్టి రెండు నిమిషాలపాటు మగ్గించాలి. తరువాత జుకిని ముక్కలు, సెలెరీ తరుగు, టమాటా ప్యూరీ, కారం వేసి కలిపి పది నిమిషాలపాటు వేగనివ్వాలి. ఆ పైన అయిదు కప్పుల నీళ్లు పోసి మరిగించాలి. తరువాత రెడ్ బీన్స్, వీట్ పాస్తా, చీజ్ తురుం, మిరియాల పొడి వేసి కలిపి ఉప్పు సరిచేసుకోవాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించి వేడి వేడిగా సర్వ్ చేయాలి. ఈ సూప్‌లో ఆలు, బీన్స్, బీట్‌రూట్ లాంటి ఇతర కూరగాయల ముక్కలను కూడా ఉడికించి వేసుకోవచ్చు.



## థాయ్ చికెన్ సూప్



**కావాల్సిన పదార్థాలు**

● బోన్‌లెస్ చికెన్ ముక్కలు- పావు కేజీ, మష్రూమ్స్- నాలుగు, చక్కెర- చిటికెడు, కొత్తిమీర తరుగు- కొద్దిగా, లెమన్ గ్రాస్- కొద్దిగా, ఉప్పు- తగినంత, ఫిష్ సాస్- ఒక చెంచా, నిమ్మరసం- ఒక చెంచా, కొబ్బరి పాలు- ఒక కప్పు, థాయ్ పేస్టు- రెండు చెంచాలు, థాయ్ జింజర్ తరుగు- అర చెంచా, నూనె- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, తులసి ఆకులు- కొన్ని

**తయారీ విధానం**

● స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడిచేయాలి. అందులో థాయ్ జింజర్, లెమన్ గ్రాస్, చికెన్ ముక్కలు, మష్రూమ్ ముక్కలు వేసి కలిపి పది నిమిషాలపాటు వేయించాలి. తరువాత కొబ్బరి పాలు పోసి రెండు నిమిషాలు ఉడికించాలి. ఆ పైన థాయ్ పేస్టు, ఉప్పు, చక్కెర, నిమ్మరసం, కొత్తిమీర తరుగు, ఫిష్ సాస్ వేసి కలిపి మరో అయిదు నిమిషాలు మరిగించాలి. చివరగా తులసి ఆకులు వేసి స్టవ్ మీద నుంచి దించి వేడిగా సర్వ్ చేయాలి.

## పొటాటో లీక్ సూప్





**కావాల్సిన పదార్థాలు**

● లీక్ తరుగు- ఒక కప్పు, ఆలుగడ్డ ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, బటర్- రెండు క్యూబ్‌లు, వెల్లుల్లి తరుగు- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, చికెన్ స్టాక్- మూడు గ్లాసులు, మిరియాల పొడి- ఒక చెంచా, ఫ్రెష్ క్రీమ్- అర కప్పు, కొత్తిమీర తరుగు- కొద్దిగా

**తయారీ విధానం**

● స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి బటర్ వేసి కరిగించాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి తరుగు వేసి కలపాలి. తరువాత లీక్ తరుగు, ఆలుగడ్డ ముక్కలు, ఉప్పు వేసి కలిపి మూతపెట్టి పదినిమిషాలపాటు మగ్గించాలి. తరువాత చికెన్ స్టాక్ పోసి పావుగంటసేపు మరిగించి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మిశ్రమాన్ని బ్లెండర్‌లో పోసి మెత్తగా బ్లెండ్ చేసి గిన్నెలోకి తీసుకోవాలి. ఈ గిన్నెను మరల స్టవ్ మీద పెట్టి సూప్‌ను మరిగించాలి. అందులో మిరియాల పొడి, ఫ్రెష్ క్రీమ్ వేసి కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి వేడి వేడిగా సర్వ్ చేయాలి. ఈ సూప్‌లో లీక్‌కు బదులు స్ప్రింగ్ ఆనియన్స్ వాడుకోవచ్చు.

# ఊపిరితిత్తులకు రక్ష కంటకారి

భోజన కుతూహలం



మన చుట్టూ ఉండే మొక్కల్లోనే అపారమైన వైద్య రహస్యాలు దాగి ఉన్నాయనే విషయాన్ని నిరూపించే మొక్క కంటకారి.

వంకాయ, టమోటో కుటుంబానికి చెందిన ఈ మొక్క నేలబారున పెరిగే చిన్న పొద! కంటకారికి ఆయుర్వేదంలో ఉన్న పేర్లు దాని గుణాలను ప్రతిబింబిస్తాయి. ఆ పేర్లు..

**క్షుద్రా:** చిన్న పొదగా నేలపై వ్యాపించి ఉండటం వల్ల ఈ పేరు వచ్చింది.

**వ్యాఘ్రీ:** ఈ మొక్కను వాడితే సింహంలా (వ్యాఘ్రం) గర్జించే గొంతు వస్తుంది.

**రాష్ట్రికా:** ఎక్కడైనా, ఏ నేలనైనా పెరిగే సామర్థ్యం దీని సొంతం.

**ధవని:** నేలపై అత్యంత వేగంగా వ్యాపిస్తుంది.

**ద్రవణి:** కఠినమైన కఫాన్ని కరిగించి (ద్రవించి) బయటకు పంపుతుంది.

**కంటకారి:** గొంతులో ముల్లులా గుచ్చుకునే కంటక వ్యాధిని హరిస్తుంది.

**ఉపయోగాలు...**

- వాత, కఫ దోషాలను అదుపు చేయడంలో మేటి. ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన కఫాన్ని కరిగించడం దీని ప్రధాన విధి. దీర్ఘకాలిక వ్యాధులైన బ్రోంకైటిస్, ఆస్తమా, ఎలర్జీ, దగ్గులతో బాధపడేవారు ఈ మొక్కను సమూలంగా (వేర్లతో సహా) ఎండ బెట్టి టీలా కాచుకుని తాగితే అద్భుత ఫలితాలు వస్తాయి.
- వైరస్ వల్ల వచ్చే జ్వరాలు, గొంతు నొప్పులకు ఇది దివ్యౌషధం. కేవలం దగ్గునే కాదు, శరీరంలోని అంతర్గత అవయవాలలో కలిగే వాపులను తగ్గించడంలోనూ ఇది మేటి. లివర్, స్ప్లీన్ (ప్లీహం), గుండె, కిడ్నీలు మరియు ప్రోస్టేట్ గ్రంథిలో వచ్చే
- వాపులను తగ్గించి, ఆ అవయవాలు సక్రమంగా పనిచేసేలా చేస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో కలిగే వాపుల్ని కూడా బాగా తగ్గిస్తుంది.
- నడుము నొప్పి, మడమ శూల, మైగ్రేన్ తలనొప్పులను ఇది తగ్గిస్తుంది.
- ఇది ఆకలిని పెంచుతుంది. జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తుంది. మూత్రం బాగా అయ్యేలా చేస్తుంది.
- పేనుకొరుకుడు సమస్య ఉన్నచోట దీని పండ్ల రసాన్ని తేనెతో కలిపి రాస్తే జుట్టు తిరిగి మొలుస్తుంది.
- చర్మ వ్యాధులు, దురదలు ఉన్నవారు దీని కషాయం తాగడం వల్ల రక్తం శుద్ధి అయ్యి సమస్యలు త్వరగా తగ్గుతాయి.

● గంగరాజు అరుణాదేవి

# ఆమె గణితాన్వేషి

**చాలామందికి అంకెలు అంటే కేవలం లెక్కలు మాత్రమే. కానీ ఆమెకు ప్రకృతి రహస్యాలు విప్పే తాళం చెవులు. సమీకరణాల సంక్లిష్టతలో సౌందర్యాన్ని వెతుకుతూ గణితాన్ని సామాజిక ప్రయోజనానికి ఆయుధంగా మలిచిన మేధావి ఆమె. ఆస్ట్రేలియా గడ్డపై భారతీయ ముద్రవేస్తూ 'ఎన్ఎస్‌డబ్ల్యూ సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచిన ప్రొఫెసర్ నళిని జోషి స్ఫూర్తిదాయక ప్రస్థానంపై ప్రత్యేక కథనం.**


సాధారణంగా గణితం అంటే చాలామందికి భయం. మరికొందరికి అయోమయం. కానీ నళిని జోషికి మాత్రం అదొక అందమైన కళ. మయన్మార్‌లో జన్మించి, భారతీయ మూలాలతో పెరిగిన ఆమె అంకెలను అక్షరాలుగా మలిచి ప్రకృతి రహస్యాలను ప్రపంచానికి వివరించారు. చిన్ననాటి నుంచి ఆమెకు ఉన్న జిజ్ఞాస నేడు ఆమెను ఆస్ట్రేలియాలోని సిడ్నీ విశ్వవిద్యాలయంలో అత్యున్నత చైర్ ప్రొఫెసర్ స్థానంలో నిలబెట్టింది. ఆమె ఆలోచనల నుంచి పుట్టిన ప్రతి సమీకరణం నేడు ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి దిక్సూచిలా మారుతోంది.

### న్యూ సౌత్‌వేల్స్ సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్

ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఎదురుచూసే అత్యున్నత గౌరవాల్లో 'న్యూ సౌత్‌వేల్స్ సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్' ఒకటి. 2025లో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం నళిని జోషిని వరించడం యావత్ భారత సంతతికి గర్వకారణం. గణితం పట్ల ఆమెకున్న జిజ్ఞాస మాత్రమే కాదు.. క్లిష్ట సమస్యలను సులభతరం చేసే ఆమె విశ్లేషణాత్మక శైలికి ఈ అవార్డు పట్టాభిషేకం వంటిది. సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో భారతీయ మూలాలున్న ఒక మహిళ ఈ స్థాయి గౌరవం పొందడం చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం.

### అసాధారణ పరిశోధనల వారధి

నళిని జోషి పరిశోధన 'పెయిన్లెవ్ సమీకరణాల' చుట్టూ తిరుగుతుంది. ఈ పేరు వినడానికి కొత్తగా ఉన్నా వీటి ప్రభావం మాత్రం మన దైనందిన జీవితంలో అనేక అంశాలపై ఉంటుంది. వైరస్‌ల వ్యాప్తిని అంచనా వేయడం నుంచి, భారీ అలల ఉధృతిని లెక్కగట్టడం వరకు ఆమె రూపొందించిన గణిత నమూనాలు కీలక పాత్ర పోషిస్తాయి. వైద్య రంగంలో ఎమ్మారై స్కాన్ల నాణ్యతను పెంచడంలో కూడా నేడు ఆమె పరిశోధనలు ఉపకరిస్తున్నాయి. ఆమె సిద్ధాంతాలు కేవలం పుస్తకాలకే కాకుండా సమాజ శ్రేయస్సుకు ఎలా ఉపయోగపడతాయో ఆమె చేసి చూపించారు.



### మహిళా లోకానికి ఆశాకిరణం

విజ్ఞాన శాస్త్ర రంగాల్లో, ముఖ్యంగా గణితంలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉన్న రోజుల్లో నళిని జోషి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆస్ట్రేలియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు ఎన్నికైన తొలి భారతీయ మహిళగా ఆమె సృష్టించిన చరిత్ర నేటి తరం యువతులకు ఒక గొప్ప స్ఫూర్తి. లింగ వివక్షను అధిగమించి మేధస్సుకు సరిహద్దులు లేవని ఆమె నిరూపించారు. 'సైన్స్ ఇన్ ఆస్ట్రేలియా జెండర్ ఈక్విటీ' వంటి కార్యక్రమాల ద్వారా ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఎదగడానికి ఆమె అండగా నిలుస్తున్నారు. ఆమె సాధించిన ఈ పురస్కారం ఒక వ్యక్తి విజయమే కాదు, అంకితభావంతో పనిచేసే ప్రతి పరిశోధకుడి విజయం.

# చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

## 'ఎల్లమ్మ'తో హీరోగా ఎంట్రీ!



ఎన్నో అద్భుతమైన పాటలను స్వరపరిచి, దశాబ్దాలుగా సంగీత ప్రపంచంలో వెలుగొందుతున్న సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఇప్పుడు కెమెరా ముందుకు వస్తున్నారు. తొలి చిత్రం 'బలగం'తో జాతీయ అవార్డ్ పొంది, దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన దర్శకుడు వేణు యెల్దండి ఆధ్యాత్మిక అంశంతో రూపొందిస్తున్న 'ఎల్లమ్మ' చిత్రంలో దేవిశ్రీప్రసాద్ హీరోగా నటించనున్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ అరంగేట్రానికి ఆయన ఎనుకున్న ఈ సబ్జెక్ట్ తన ఎనర్జీకి, పర్సనాలిటీకి యాప్ట్ అని చెప్పాలి. దిల్ రాజు సమర్పణలో ఆయన సోదరుడు శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం గ్లింప్స్ విడుదల చేశారు. పొడవాటి జుట్టు, రగ్గడ్ లుక్‌తో దేవిశ్రీప్రసాద్ గెటప్ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాకు ఆయనే సంగీత దర్శకుడు. దైవిక శక్తి నేపథ్యంగా 'ఎల్లమ్మ' చిత్రం రూపుదిద్దుకుంటోంది.



## శారదకు జేసీ డానియల్ పురస్కారం

● మలయాళ చిత్రసీమలో అత్యున్నత గౌరవం



ప్రముఖ సీనియర్ నటి 'ఊర్వశి' శారద కేరళ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'జేసీ డానియల్ అవార్డు-2024'కు ఎంపికయ్యారు. మలయాళ చిత్ర పరిశ్రమకు శారద అందించిన సేవలకు గుర్తింపుగా, కేరళ ప్రభుత్వం ఇచ్చే ఈ అత్యున్నత సినిమా పురస్కారానికి ఆమె ఎంపికయ్యారని ఆ రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల మంత్రి సాజి చెరియన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారం కింద రూ. 5 లక్షల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. ఈ నెల 25న తిరువనంతపురంలోని నిశాగంధి ఆడిటోరియంలో జరగనున్న కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతుల మీదుగా శారద ఈ పురస్కారాన్ని అందుకొంటారు. ప్రముఖ దర్శకుడు శ్రీకుమారన్ తంపి నేతృత్వంలో నటి ఊర్వశి, దర్శకుడు బాలు కిరియత్ తదితరులు సభ్యులుగా ఉన్న జ్యూరీ కమిటీ ఈ అవార్డు గ్రహీతను ఎంపిక చేసింది. 80 ఏళ్ల వయసులో ఈ గౌరవాన్ని దక్కించుకున్న శారద, జేసీ డానియల్ అవార్డు అందుకుంటున్న 32వ సినీ ప్రముఖురాలు కావడం విశేషం. 1965లో 'ఇన్‌ప్రావుకల్' చిత్రం ద్వారా శారద మలయాళ చిత్రసీమలో అడుగుపెట్టారు. ఎమ్ టీ వాసుదేవన్ నాయర్ రచించిన 'మురప్పెన్ను, ఇరుట్టింటె ఆత్మవు' చిత్రాలతో ఆమె మలయాళ ప్రేక్షకులకు చేరువయ్యారు. 1968లో వచ్చిన మలయాళ చిత్రం 'తులాభారం'లో ఆమె కనబరచిన అద్భుత నటనకు గాను తొలిసారి ఉత్తమ జాతీయ నటి పురస్కారం అందుకున్నారు. మొత్తం 125కు పైగా మలయాళ చిత్రాల్లో ఆమె నటించారు. 2019లో జరిగిన కేరళ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఆమె నటించిన చిత్రాలను ప్రత్యేకంగా ప్రదర్శించారు. మలయాళ చిత్రసీమ నుంచి ఈ గౌరవం దక్కించుకున్న తొలి నటి శారద కావడం విశేషం.

## వచ్చే ఏడాది వేసవి బరిలో



ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సెన్సేషనల్ అప్‌డేట్ వచ్చేసింది. బ్లాక్‌బస్టర్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా, ప్రభాస్ కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న 'స్పిరిట్' చిత్రం విడుదల తేదీని శుక్రవారం చిత్ర బృందం ప్రకటించింది. 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో వచ్చే ఏడాది వేసవి బాక్సాఫీసు రేస్ 'స్పిరిట్'తోనే మొదలు కానుందని స్పష్టమైంది. సందీప్‌రెడ్డి వంగా మార్క్ యాక్షన్, ఎమోషన్స్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ పతాకంపై ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్రిప్తి దిమ్రీ హీరోయిన్. ప్రకాశ్‌రాజ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది.

## సంతృప్తినిచ్చిన విజయం

నాగవంశీ



'అనగనగా ఒక రాజు' చిత్రంతో భారీ హిట్ కొట్టానని, ఇది తనకు ఆరేళ్ల తర్వాత సంతృప్తిని ఇచ్చిన విజయమని, సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతో మద్దతు తెలిపిన అభిమానులు సంతోషపడేలా త్వరలో భారీ ప్రకటన చేస్తానని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి జంటగా నూతన దర్శకుడు మారి తెరకెక్కించిన చిత్రమిది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. శుక్రవారం చిత్రబృందం థాంక్స్ మీట్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా నాగ వంశీ మాట్లాడుతూ 'అల వైకుంఠపురంలో' సినిమా తర్వాత ఆ స్థాయి సంతృప్తినిచ్చిన సంక్రాంతి ఇది' అని అన్నారు. నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ 'నాకు రాజ్‌కుమార్ హిరాని గారి సినిమాలంటే ఇష్టం. తెలుగులో అలాంటి సినిమా చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేశాం' అని అన్నారు.



సభలో మాట్లాడుతున్న విశ్రాంత పోలీస్ అధికారి వెంకటేశ్వరరావు

## సామాజిక సంస్కరణలకు త్రిపురనేని కృషి

### విశ్రాంత పోలీసు అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

తెనాలి అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సంస్కరించేందుకు త్రిపురనేని రామస్వామి కృషి చేశారని విశ్రాంత పోలీసు అధికారి ఏబీ వెంకటేశ్వరరావు చెప్పారు. కవిరాజా పార్కులో శుక్రవారం రామస్వామి వర్ధంతి పురస్కరించుకుని జరిగిన సభలో ఆయన మాట్లాడారు. హేతువాద ఆలోచనలను వ్యక్తీకరించడానికి రచనలు చేపట్టారని, ఆయన రాసిన కుప్పుస్వామి శతకం సామాజిక విప్లవాన్ని తెలియజేస్తుందన్నారు. శంభుకవధ, సూత పురాణం వంటి రచనలు సామాజిక వర్గాలకు జరిగే అన్యాయాన్ని చాటి చెప్పాయన్నారు. పేదలకు భారంగా మారిన వివాహవేడుకలను వ్యతిరేకించారని, స్వయంగా వివాహాలు చేసేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. కృష్ణాజిల్లాలో జన్మించి తెనాలి వచ్చిన ఆయన మున్సిపల్ చైర్మన్ స్థాయికి ఎదగడం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, న్యాయవాది, కవి, రచయిత, సంస్కర్తగా పేరుగాంచిన త్రిపురనేని ఆంధ్ర మహాసభ కవిరాజు బిరుదును ఇచ్చిందన్నారు. నేటి సమాజానికి త్రిపురనేని ఆదర్శమన్నారు. ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి సభలో రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించగా, అట్లూరి అనిల్, ముత్తేవి రవీంద్రనాథ్ తదితరులు ప్రసంగించారు.



కొండపాటూరు ఆలయం వద్ద ఐరాస భారత ప్రతినిధి పర్వతనేని హరీష్

## ఐరాసలో భారత్ శాశ్వత సభ్యత్వానికి ప్రయత్నాలు

### ● భారత ప్రతినిధి పర్వతనేని హరీష్

కాకుమాను, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితిలో భారతదేశానికి శ్వాశ్వత సభ్యత్వం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ పేర్కొన్నారు. మండలంలోని కొండపాటూరులో స్వయంభు శ్రీపోలేరమ్మ అమ్మవారి ఆలయాన్ని హరీష్ సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ పొన్నం వీరయచౌదరి, ఆలయ అర్చకులు రామచంద్రరావులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హరీష్ మాట్లాడుతూ వివిధ దేశాలలో దౌత్యవేత్తగా పనిచేసి ప్రస్తుతం ఐక్యరాజ్య సమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధిగా పనిచేస్తున్న హరీష్ తన సొంత గ్రామం కొండపాటూరుకు రావడం ఆనందంగా ఉందన్నారు. కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ నిర్వాహకుడు కాటూరి సుబ్బారావు, ఈవో జక్కా శ్రీనివాస్, గన్నపనేని రాఘవరావు, టీడీ ప్రసాద్, తోట ఫణికుమార్‌లు తదితరులు ఆయన వెంట ఉన్నారు.



# సరస్ మేళాకు అపూర్వ ప్రజాదరణ

● 12 లక్షల మంది సందర్శన
● రూ. 20 కోట్ల వ్యాపారం
● డ్వాక్రా ఉత్పత్తులతో కొత్త సంక్రాంతి
● రేపటి వరకే.. మినీ భారత సమ్మేళనం



ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాధర విజయలక్ష్మి

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి): మినీ భారత సమ్మేళనంగా గుంటూరు స్మృతిలో మరచిపోలేని అనుభూతులను మిగిల్చిన సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) విశేష ప్రజాదరణను చూరగొన్నది. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గుంటూరు వేదికగా ఏర్పాటైన మేళా స్వయం సహాయక బృందాల మహిళలకు ఆర్థికంగా వెన్ను దన్నుగా నిలిచింది. ఈ నెల 8న సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదిగా లాంఛనంగా ఆరంభమై (6వ తేదీ నుంచి అమ్మకాలు ప్రారంభం అయ్యాయి) కొత్త రికార్డులను నెలకొల్పిన సరస్ ఆదివారం 18వ తేదీన ముగియనుంది. ఈ కార్యక్రమం ఆరంభం నుంచి అంతం వరకు అహర్నిశలు శక్తి వంచన లేకుండా పాటుపడుతున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థల ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాధర విజయలక్ష్మి ప్రత్యేక స్పందన ఆమె మాటల్లోనే..

**12 లక్షల మందికిపైగా సందర్శన**

సరస్ మేళాకు ప్రజల నుంచి లభిస్తున్న స్పందన నిజంగా అనూహ్యంగా ఉందని పీడీ విజయలక్ష్మి తెలిపారు. గురువారం నాటికి సుమారు 12 లక్షల కు పైగా ప్రజలు సందర్శించారని తెలిపారు. ప్రతి రోజూ అధిక సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో తమకు ఎంతో ఉత్సాహాన్ని అందిస్తున్నట్లు చెప్పారు.

**సరసమైన ధరలు.. నాణ్యమైన ఉత్పత్తులు**

దేశవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన నాణ్యమైన ఉత్పత్తులు సరసమైన ధరలకు లభించడం, ఒకేచోట అన్ని రాష్ట్రాల కళా నైపుణ్యాన్ని చూసే అవకాశం ఉండడం ప్రజా స్పందనకు కారణాలుగా పీడీ పేర్కొన్నారు. దీనికి తోడు ఫుడ్ కోర్టు, ఎమ్యూజ్‌మెంట్ పార్కు, సాంస్కృతిక కార్యక్రమాలు కుటుంబ సమేతంగా విచ్చేసేలా చేశాయన్నారు.

**సెలువుల్లో రోజుకు లక్షమంది..**

సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో 300కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేసిన సరస్ మేళాలో.. జమ్మూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారని విజయలక్ష్మి వెల్లడించారు. హ్యాండీ క్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్స్, కలంకారి, ఎంబ్రాయిడరీ వస్త్రాలు, ఆయుర్వేద-హెర్బల్ ఉత్పత్తులు, ఆర్గానిక్ ఆహార పదార్థాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. ఈ నెల 10, 11, 14, 15 తేదీల్లో ప్రతిరోజూ లక్షకు పైగా ప్రజలు మేళాను సందర్శించారని వెల్లడించారు.

**వ్యాపార వృద్ధి, కొత్త ఆలోచనలకు నాంది**

సరస్ మేళా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వ్యాపార అనుభవం, మార్కెటింగ్ అవగాహన, నేరుగా వినియోగదారులతో కలిసే అవకాశం కల్పిస్తోందని పీడీ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల ఉత్పత్తులను చూసి కొత్త ఆలోచనలకు పునాది పడుతుందని చెప్పారు. చాలామంది మహిళలకు ఇది ప్రేరణగా మారిందన్నారు.

**రూ.20కోట్ల వరకు వ్యాపారం**

ఇక సరస్ మేళాలో సుమారు రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరిగే అవకాశం ఉందని పీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఇది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థికంగా ఎంతో లాభదాయకమన్నారు.

**ఆదివారంతో మేళా ముగింపు..**

సరస్ మేళా ఈ నెల 18వ తేదీ ఆదివారంతో ముగియనుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా నడుస్తుందన్నారు. ప్రభుత్వం అన్ని విభాగాల సమన్వయంతో పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత, పరిశుభ్రత వంటి ఏర్పాట్లు చక్కగా చేసిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చేయాల్సిందంతా చేసి... ఇప్పుడు సుద్దులా..!

● గత ఐదేళ్లు పిన్నెల్లిలో అరాచకాలు.. అత్యాచారాలు
● వైసీపీ నేతలు, కాసు వ్యాఖ్యలను ఖండించిన దళిత నేతలు

పిడుగురాళ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్ల కాలంలో అధికారం అండతో పిన్నెల్లి గ్రామంలో కొందరు నేతలు రెచ్చిపోయి గ్రామాన్ని తమ చెప్పుచేతల్లో వుండేలా భయ భ్రాంతులకు గురిచేశారని దళిత నేతలు పిల్లి చెన్నారావు, పణితి రవి, మందా డేవిడ్, ఏసు పొంగు రాంబాబు, చిలుముల దుర్గారావులు వైసీపీ నేతల తీరుపై శుక్రవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. మాట విననివారిపై అక్రమ కేసులు.. దాడులు.. మహిళలపై అత్యాచారాలకు పాల్పడి ఇప్పుడు ఇరువురు వ్యక్తుల మధ్య జరిగిన గొడవను రాజకీయ రంగు పులమడం సరైన విధానం కాదన్నారు. అధికారంలో వున్నప్పుడు గ్రామంలో బీభత్సం సృష్టించి పోలీసుల సాక్షిగా దాడులకు పాల్పడ్డ విషయం వైసీపీ నేతలు మరిచారా అని ప్రశ్నించారు. మాచవరం మండలంలో 70ఏళ్లకు పైగా వయసున్న వృద్ధ దంపతులను సైతం వదలకుండా హత్యాయత్నం కేసులు పెట్టిన వైసీపీ నేతలు ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారన్నారు. కోనంకి గ్రామంలో యోహాన్ అనే వ్యక్తి నోట్లో పురుగుమందు పోసి చంపి ఇంటి ముందు చెట్టుకు వేలాడతీసింది వైసీపీనేతలు కాదా... అక్రమ మైనింగ్ గుంతల్లో 8 మందికి పైగా చిన్నారులు మృతి చెందడమే కాకుండా మరికొంత మంది నేతలను పొట్టనపెట్టుకున్న విషయం మర్చిపోయారా అని అన్నారు. గురజాల మండలం అంబాపురానికి చెందిన దోమతోటి విక్రమ్ అనే దళిత యువకుడిని పోలీసులతో పిలిపించి అర్ధరాత్రి హత్య చేసింది వైసీపీ నేతలు కాదా... తురకపాలెంలో నిద్రిస్తున్న సమయంలో ఇంటికి నిప్పుపెట్టి ఉమర్ కుటుంబాన్ని సజీవదహనం చేయాలని చూసిన వైసీపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. ప్రశాంతంగా వున్న గ్రామాలలో ఏదో ఒక రాజకీయ రచ్చచేసి శాంతి వాతావరణాన్ని లేకుండా చేసే ఉద్దేశమే వైసీపీ నేతల పన్నాగమన్నారు. వైసీపీ హయాంలో మాచవరం మండలానికి చెందిన పలువురిని తీవ్రంగా హింసించడమే కాకుండా ఎంతో మందిని గ్రామం నుండి బలవంతంగా పంపించిన వైసీపీ నేతలు ఇప్పుడు పిన్నెల్లిలో అశాంతి రేపేందుకే గుంపులు గుంపులుగా వెళ్లారన్నారు. మందా సాల్మన్ మృతి చెందడం బాధాకరమైనప్పటికీ ఇరువురు మధ్య జరిగిన గొడవ వారికే పరిమితం చేయాలన్నారు. పార్టీరంగు పులమొద్దని వైసీపీ నేతలకు హితవు పలికారు.



పిన్నెల్లిలో బాధితులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

### ● మరొకరికి గాయాలు



రవీంద్ర మృతదేహం

దుర్గి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి గాయాలైన సంఘటన మండలంలోని కోలగుట్లలో గురువారం రాత్రి జరిగింది. మండలంలోని ముటుకూరు గ్రామానికి చెందిన గొట్టిపాటి రవీంద్ర (25), అతని మామ మండ్లి బైస్వామితో కలిసి ద్విచక్ర వాహనంపై అనుపాలెంకు వెళ్లి తిరిగి వస్తుండగా కోలగుట్ల శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో రవీంద్ర మృతిచెందగా బైస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న దుర్గి పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని రవీంద్ర మృతదేహాన్ని, గాయాలపాలైన బైస్వామిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రెండు బైకుల ఢీ - యువకుడు..

చిలకలూరిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట వాడరేవు కొత్త బైపాస్‌పై పసుమర్రు, అన్నంభొట్లవారిపాలెం గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొన్న ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి చెందిన గంట్రు వేణుగోపాలకృష్ణ(46)గా గుర్తించారు. అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో జరుగుతున్న ఎడ్ల పందాలు చూడడానికి వెళుతున్న సందర్భంలో ఈ సంఘటన జరిగింది. రాంగ్ రూటులో ఎదురుగా వచ్చిన బైక్‌పై ఉన్న దంపతులు, వారి కుమారుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే చిలకలూరిపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు.



కొండబాబు(ఫైల్)

## కాల్వలో పడి వలసకూలీ...

కొల్లూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కాల్వలో పడి వలస కూలీ మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ కోటేశ్వరరావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం... అల్లూరు సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం, బెల్లవరం గ్రామానికి చెందిన అన్నిక కొండబాబు(35) మూడు వారాల క్రితం కొల్లూరులోని ఇటుక బట్టీల్లో పనులు చేసే నిమిత్తం అతని సోదరుడితో కలిసి వచ్చి పనులు చేస్తున్నాడు. గురువారం పండుగ సందర్భంగా మద్యం సేవించి లాకు సెంటరు వద్ద ఉన్న కాల్వ గట్టుపై కూర్చుని ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## కారు ఢీకొని వ్యక్తి...

చిలకలూరిపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ, చిలకలూరిపేట మార్గంలో పోతవరం గ్రామం వద్ద గురువారం సంక్రాంతి పండుగ నాడు ఎస్‌ఐ కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం ఎస్‌ఐ చౌడయ్య ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో పాల క్యానులతో వాహనంపై వెళుతున్న ప్రకాశం జిల్లా ఉప్పుమాగులూరుకు చెందిన దండా వీరయ్య (63) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వాహనంపై వెళుతున్న మస్తాన్‌వలి తీవ్రంగా గాయపడ్డాడు. రూరల్ ఎస్‌ఐ అనిల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ ఆత్మహత్య

వినుకొండటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తరచూ భర్త మద్యం సేవిస్తున్నాడని తట్టుకోలేక భార్య ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కొప్పుకొండ గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన కటారి బ్రహ్మంకు 8 సంవత్సరాల క్రితం మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలం చాట్లమడ అగ్రహారం గ్రామానికి చెందిన అరుణకుమారి (26)తో వివాహం జరిగింది. పండుగ పూట భర్త మద్యం సేవించడాన్ని తట్టుకోలేక ఇంట్లో ఉరివేసుకొని మృతిచెందినట్లు మృతురాలి తండ్రి సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో అరుణకుమారి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతురాలికి ఇరువురు కుమారులు ఉన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేటి నుంచి ఎన్టీఆర్ కళా పరిషత్ నాటకోత్సవాలు

● ముఖ్య అతిథిగా మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ
● డాక్టర్ లావు రత్తయ్యకు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం



డాక్టర్ రత్తయ్య డాక్టర్ లక్ష్మీనారాయణ

గుంటూరు(తూర్పు), జనవరి 16(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై శనివారం నుంచి నాలుగు రోజులుపాటు ఎన్టీఆర్ కళా పరిషత్ 21వ నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాదు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6.15 గంటలకు ఉత్సవా లు ప్రారంభమవుతాయన్నారు. తొలుత ముఖ్య అతిథి, మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ చేతుల మీదుగా విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యకు ప్రతిష్టాత్మకమైన ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సభానంతరం యాగం(కళాంజలి) నాటక ప్రదర్శన, 18న కందుల చేతన శరణ్య, యర్రం సింధూజ, కొప్పిడి శ్రీలక్ష్మీ కూచిపూడి నృత్య ప్రదర్శన, ఇది ప్రమాదానికి సంకేతం(దృశ్య వేదిక), 19న సహన(అభినయ ఆర్ట్స్) నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 20న ఎస్వీ రామారావు, లంకా లక్ష్మీనారాయణ, జి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రాల మధురగీతాల ఆలాపన కార్యక్రమం ఉంటుందన్నారు.

## ఆల్ ఇండియా అథ్లెటిక్స్‌లో..
## ఎస్ఆర్ఎం వర్సిటీకి 3 బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులు

తుళ్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు మంగుళూరులోని రాజీవ్‌గాంధీ హెల్త్ యూనివర్సిటీలో అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఈ పోటీల్లో మూడు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు ఆదిత్య, అనామిక, ముబాసినా మొహ్మద్‌లు అద్భుత పటిమను కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించినట్లు వర్సిటీ స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ సుస్మితా సింగ్ పేర్కొన్నారు. 50కి పైగా వర్సిటీలు ఈ పోటీలకు హాజరయ్యాయి. ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ నుంచి పోటీలకు హాజరైన ఆదిత్య 74.43 మీటర్ల పొడవు జావిలిన్‌త్రో విసిరి ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. అనామిక హెప్టాథాన్‌లో 5158 పాయింట్లతో ప్రథమస్థానం, ముబాసిన మహ్మద్ లాంగ్‌జంప్‌లో 6.15 మీటర్ల స్కోర్ చేసి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకొని గోల్డ్ మెడల్స్‌ను సొంతం చేసుకున్నారని ఆమె తెలిపారు. ఇంటర్ వర్సిటీ అథ్లెటిక్ లో తొలిసారి గోల్డ్ మెడల్స్ సాధించిన ఈ ముగ్గురిని ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, వైస్ చాన్సలర్ సతీష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ తదితరులు అభినందించారు.

## 'చేయి వీడని చెలిమి'ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్



సాయిజ్యోతి నవలను ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, జనవరి 16 (ఆంధ్ర జ్యోతి): మంగళగిరి పట్టణం 26వ వార్డుకు చెందిన విభిన్న ప్రతిభావంతురాలు చింత క్రింది సాయిజ్యోతి రచించిన చేయి వీడని చెలిమి అనే నవలను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి సాయిజ్యోతి మంత్రి లోకేశ్‌ను కలిశారు. అంధురాలైన సాయిజ్యోతి మొబైల్‌లో వాయిస్ ఇన్‌పుట్ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో రచనలు చేస్తున్నారు. చైత్రశ్రీ కలం పేరుతో కవితాంజలి అనే కవితా సంపుటితోపాటు మంచు తాకిన ప్రేమ, ఎవరు అతను అనే నవలలు, సామాజిక స్పృహ కలిగించే కథలు రచించారు. నూతక్కి హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సాయిజ్యోతి వైకల్యాన్ని జయించి తన ప్రతిభతో యువతరానికి స్ఫూర్తిగా నిలిచారని మంత్రి లోకేశ్ అభినందించారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి ఉన్నారు.

## వ్యక్తిగత గొడవ వల్లే మందా సాల్మన్ మృతి

### ● డీఎస్పీ జగదీష్

దాచేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మందా సాల్మన్ మృతి వ్యక్తిగతమని, ఎటువంటి రాజకీయ పార్టీలకు సంబంధం లేదని గురజాల డీఎస్పీ జగదీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో ఈ నెల 10న ఉదయం మంద సాల్మన్, మోటమర్రి పేతురుకి వ్యక్తిగత స్పర్ధలు ఉండడంతో.. ఒకరిని ఒకరు కేకలు వేసుకుంటూ.. ఘర్షణ పడ్డారని తెలిపారు. దీనికి సంబంధించి కేసులు, కౌంటర్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తలకి బలమైన గాయాలు కావడంతో మందా సాల్మన్ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారన్నారు. సాల్మన్ మృతిని మర్డర్ కేసుగా నమోదు చేయడం జరిగిందని.. ఈ ఘటన మోటమర్రి పేతురు, మందా సాల్మన్ వ్యక్తిగత గొడవలని తెలిపారు.

## వ్యక్తిగత గొడవలకు రాజకీయ రంగు వద్దు : యరపతినేని

పిడుగురాళ్ల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి గ్రామంలో జరిగిన తాజా ఘటన పూర్తిగా వ్యక్తిగత తగాదాల వల్ల జరిగింది. దీన్ని పార్టీలకు ముడిపెట్టి, ప్రభుత్వంపై బురద చల్లడం వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శుక్రవారం ఒక ప్రకటనలో జగన్, కాసు మహేష్‌కు హితవు పలికారు. ఆ వ్యవహారం మీద ఇప్పటికే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరిగింది, ఇది కూటమి ప్రభుత్వం మీలాగా నేరస్తులను వెనకేసుకొచ్చే పాలన కాదని అన్నారు. ఐదేళ్ల వైసీపీ రాక్షస పాలనలో పల్నాడు గడ్డపై రక్తం పారించిన మీరు ఇప్పుడు నీతులు చెప్పడం, దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ధ్వజమెత్తారు. పిన్నెల్లి గ్రామంలో ఎంతో మంది కాళ్లు చేతులు విరగొట్టి, మానభంగాలు చేసి, ఆస్తులు ధ్వంసం చేసి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఊళ్లు విడిచి వెళ్లేలా చేసింది మీ ఫ్యాక్షన్ రాజకీయం కాదా..?, అప్పుడు బీడు వారిన పల్లెలు, కూటమి ప్రభుత్వం వచ్చాక కోలుకుంటున్న తరుణంలో, ఇలాంటి తప్పుడు రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు.

# పగ్గాల్లేని పందేలు

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. తాము వైసీపీకి ఏమీ తక్కువ కాదని నిరూపించుకున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున కోడి పందేలు జరిగాయి. నరసరావుపేట మండలం దొండపాడు, రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం, నాదెండ్ల మండలం చందవరం, యడ్లపాడు మండలం గోపాలపురం ప్రాంతంలో కోడి పందేలు పెద్ద ఎత్తున జరిగాయి. కోడి పందేలు జరగుతున్నాయని ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోవడం తమ పని కాదన్నట్లు పోలీసు అధికారులు వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యల తీసుకుంటామన్న ఎస్పీ బి.కృష్ణారావు హెచ్చరికలు అమలు కాలేదు. మండల స్థాయి కూటమి నేతలు కొందరు పందేలను లాభసాటి వ్యాపారంగా మార్చుకున్నారని పార్టీలోని వ్యక్తులే బహిరంగా విమర్శిస్తున్నారు.

**ఏరులై పారిన మద్యం**

కోడిపందేల బరుల వద్దే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు జరిపారు. అన్ని బ్రాండ్లను, బీర్లతో సహా ఇక్కడ లభించును అని ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేశారు. బ్రాండ్‌ను బట్టి క్వార్టర్ బాటిల్‌కు రూ.100 నుంచి రూ.150ల వరకు, ఫుల్ బాటిల్‌కు రూ.300కు పైగా వసూలు చేస్తున్నారంటూ మందుబాబులు ఆరోపించారు. వీటిని అడ్డుకోవాల్సిన ఎక్సైజ్‌శాఖాధికారులు మాత్రం అధికార పార్టీ నాయకులకు భయపడి అటువైపు కన్నెత్తయినా చూసిన దాఖలాలు లేవు. అనధికార మద్యం దుకాణాలు రోజుకు రూ.3 లక్షలకు పైగా మద్యం విక్రయాలు చేశాయి.

**వీరే విజేతలు..**

కొల్లూరు బరి వద్ద కోడి పందేలలో ఆవులవారిపాలేనికి చెందిన సనకా ఉదయభాస్కర్ విజేతగా నిలిచి కారు బహుమతిగా గెలుచుకున్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజేతకు కారు, మెమెంటో అందజేశారు. అనంతవరం బరి వద్ద నూతక్కి గ్రామానికి చెందిన శ్రీరాములు కోడి పుంజు చల్లపల్లి కోడిపుంజును మట్టి కరిపించడంతో బుల్లెట్ వాహనాన్ని బహుమతిగా లభించింది. తెనాలి మాజీ జడ్పీటీసీ శాఖమూరి నారాయణప్రసాద్ విజేతకు వాహనాన్ని అందజేశారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

## 18న జీడీసీసీబీ విశ్రాంత ఉద్యోగుల మహాజన సభ

గుంటూరు సిటీ,జనవరి 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మహాజన సభను ఈ నెల 18న బ్రాడిపేటలోని జీడీసీసీ బ్యాంక్ ఆవరణలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇ.ఎల్. నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తారని, పలు వైద్యపరీక్షలతోపాటు కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని, బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ ఏడాదికి హెల్త్‌కార్డుల రెన్యూవల్ ప్రక్రియ పూర్తైందని, త్వరలోనే నూతన కార్డులు సంబంధిత బ్రాంచ్‌లకు పంపించనున్నట్లు తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 180, 189, 200 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 350.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 360.00 |

# గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ



## అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన కమిషనర్

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరంలో అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన కమిషనర్ పులి శ్రీనివాసులు భవిష్యత్‌లో మరింత ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనకు శుక్రవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర పాలక సంస్థ అధికారులు సిబ్బంది ఆధ్వర్యంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ నగరాన్ని స్వల్ప వ్యవధిలో జాతీయ స్థాయి ర్యాంకు అందుకునేలా ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో కమిషనర్ పులి శ్రీనివాసులు సాధించారన్నారు. మిషన్ గ్రీన్ గుంటూరు పేరుతో పర్యావరణ హిత నగరంగా తీర్చి దిద్దటానికి విశేషంగా కృషి చేశారన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగర పాలక సంస్థ అభివృద్ధికి మేయర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సహకారం దోహదపడిందన్నారు. బుడమేరు వరదల్లో పని చేసిన అనుభవంతో నగరంలో ఎంతటి భారీ వర్షం కురిసినా ప్రజలు ఇబ్బంది పడకుండా అతి తక్కువ సమయంలోనే నీరు బెయిల్ అవుట్ అయ్యేలా డ్రెయిన్ల ఆక్రమణలు, పూడికలు తొలగించామన్నారు. అనంతరం మేయర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు కమిషనర్‌ని పూలబొకేలు, జ్ఞాపికలు, శాలువాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంహెచ్ డాక్టర్ శాంతి కళ, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాష, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


బదిలీ అయిన కమిషనర్ పులి శ్రీనివాసుని సత్కరిస్తున్న నగర మేయర్ రవీంద్ర

## భక్తిశ్రద్ధలతో మకరజ్యోతి దర్శనం

గుంటూరు(తూర్పు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ పాలక మండలి, భారతి ధార్మిక విజ్ఞాన్ పరిషత్ సంయుక్త నిర్వహణలో మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా గురువారం గంగిరెద్దుల విన్యాసాలు జరిగాయి. అనంతరం అన్నమయ్య కళావేదికపై అతిథులు క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు దంపతులు పాల్గొని అయ్యప్ప శరణు ఘోషతో స్వామి అభిషేకాలు ప్రారంభించారు. 18 మెట్ల దీపాలు వెలిగించి మకరజ్యోతి వెలిగించారు. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో చుక్కపల్లి రమేష్, బొల్లేపల్లి దంపతులు, ఆలయ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మస్తానయ్య, బొర్రా ఉమామహేశ్వరరావు, కమ్మ జన సేవా సమితి కార్యదర్శి కన్నెగంటి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.


మకర జ్యోతిని వెలిగిస్తున్న గ్రంధి కాంతారావు, చుక్కపల్లి రమేష్, పాల్గొన్న పాలక మండలి సభ్యులు

## నేటి నుంచి త్యాగరాజ ఆరాధన సంగీత మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగరాజ కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు శ్రీ త్యాగబ్రహ్మ ఆరాధన సంగీత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.విజయ, ఎంవై శేషురాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం లఘు కచేరీలు, సాయంత్రం ప్రధాన కచేరీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శనివారం శశాంక్ వేణుగాన కచేరీ, ఆదివారం, బెజవాడ లక్ష్మికాంత్ వారి నాదస్వర కచేరి, శోభాయాత్ర, శ్రీ త్యాగరాజ స్వామి కీర్తనల గానం, కొల్లూరు వందన తిరుపతి వారి గాత్ర సంగీత కచేరి, సోమవారం సునీల్ గార్డెన్, చెన్నై వారి గాత్ర కచేరి, ఆంజనేయోత్సవం జరుగుతుందన్నారు.

## అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లచెరువు 5వ లైన్లో కొలువైన కోదండ రామాలయంలో కనుమ సందర్భంగా స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ బృందం పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణ, తబాలపై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.


భక్తిగీతాలను ఆలపిస్తున్న సాయిబాబా శర్మ

## రేపు ఆయుర్వేద చికిత్సపై ఆరోగ్య సభ

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, దీనిపై ఈనెల 18న అరండల్‌పేట 15/1వ లైను లోని సంస్థ కార్యాలయంలో ఆరోగ్యసభ నిర్వహించనున్నట్లు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై జరిగే సభలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జీ రాఘవరావు, సీనియర్ డైటీషియన్ డాక్టర్ ఆర్.బిక్షపతి ప్రసంగిస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, తరుణ వ్యాధులు ఆయుర్వేదం ద్వారా ఎలా తగ్గించుకోవచ్చో తెలియజేస్తారన్నారు.

## చెల్లని చెక్కు కేసులో షేక్ జలీల్‌కు ఏడాది జైలు

మంగళగిరి సిటి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్‌కు చెక్కు బౌన్సు కేసులో శుక్రవారం ఏడాది జైలు శిక్ష, రూ.9లక్షలు పరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు తీర్పు చెప్పారు. చిర్రావూరు గ్రామానికి చెందిన ఫిర్యాది బొప్పన గోపాలరావు వద్ద షేక్ జలీల్ 2022వ సంవత్సరంలో రూ.11లక్షలు అప్పుగా తీసుకుని అనంతరం పార్ట్ పే మెంట్ కింద రూ.9 లక్షలకు చెక్కు ఇచ్చాడు. అనంతరం ఫిర్యాది దారుడు సదరు చెక్కును క్లియరెన్స్‌కు వేయగా ఎకౌంట్ క్లోజ్ పేరిట చెక్కు బౌన్స్ అయింది. దీంతో ఫిర్యాదిదారుడు తన న్యాయవాది కొమ్మా రెడ్డి వీరారెడ్డి ద్వారా మంగళగిరి కోర్టులో ఎన్ఐ యాక్ట్ కేసు దాఖలు చేయగా ఇటీవల విచారణకు వచ్చింది. వాదోపవాదనల అనంతరం జలీల్‌పై నేరం రుజువు కావడంతో అతనికి ఏడాది జైలు శిక్ష, రూ.9లక్షలు ఫిర్యాదుదారుడికి పరిహారం చెల్లించాలని, అప్పీల్‌కు నెల రోజుల సమయం ఇస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఇదిలా ఉండగా షేక్ జలీల్ పై కొందరు వ్యక్తులు శుక్రవారం మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో తమ ఆస్తిని కొన్ని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మోసం చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను ఆశ్రయించారు.


తూర్పు నియోజకవర్గంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన ఎమ్మెల్సీ ఆలపాటి, కూటమి నేతలు


పశ్చిమ నియోజకవర్గం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, చిత్రంలో ఎమ్మెల్యే నసీర్, డిప్యూటీ మేయర్ సజీల

# ప్రతి ఏటా తూర్పులో సంక్రాంతి సంబరాలు

● ఎమ్మెల్యే నసీర్

● ఎన్టీఆర్ స్టేడియంలోనూ అట్టహాసంగా సంబరాలు

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాల వైభవానికి ఇది ఆరంభం మాత్రమేనని, ఇక నుంచి ప్రతి ఏటా సంబరాలు వైభవోపేతంగా నిర్వహిస్తామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన 'మన గుంటూరు- మన సంక్రాంతి' సంబరాలు అట్టహాసంగా జరిగాయి. ముగింపు కార్యక్రమానికి మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు, గళ్లా మాధవి, టీడీపీ, జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, గాదె వెంకటేశ్వర్లు, తిరుపతిరావు తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో చేపట్టిన సంక్రాంతి సంబరాల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చారిత్రాత్మకంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలను విజయవంతం చేసిన సుమారు 140 మందికిపైగా క్రీడాకారులు, వెంగమాంబ ట్రస్ట్ సభ్యులు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో ఈ సంక్రాంతి వైభవం ఆరంభం మాత్రమేనని, మరింత ఉత్సాహంతో నియోజకవర్గ ప్రజల కోసం అహర్నిశలు పాటుపడతానని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్ద పీట వేస్తున్నామని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో ఇలాంటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం మంచి విషయమని అన్నారు. మూడు రోజులపాటు నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల విలువైన బహుమతులను ప్రదానం చేశారు. గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, ప్రదర్శించిన కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# సరస్ మేళాలో ఆకట్టుకున్న వీణా కచేరి


సరస్ మేళాలో లక్ష్మీ శ్రీనివాస్ వీణా కచేరి

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నల్లపాడు రోడ్డులో జరుగుతున్న సరస్ మేళాలో ప్రసిద్ధ వీణా విద్వాంసురాలు రామరాజు లక్ష్మి శ్రీనివాస్ అద్భుతమైన వీణా కచేరి అందించారు. సరస్ మేళా వేదికపై శుక్రవారం ఆమె ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. వీణా సంగీతంలో అసాధారణ ప్రతిభ కలిగిన ఆమె వీణపై రాగాలు ఆకర్షణీయ ప్రదర్శన ద్వారా సంగీత ప్రియులను ఆకట్టుకున్నారు. ప్రదర్శన సరస్‌కు మరింత రంగులు చేర్చిందని, స్థానిక సాంస్కృతిక కార్యక్రమాలకు ఆమె సహకారం అమోఘమని నిర్వాహకులు అభినందించారు. రామరాజు లక్ష్మి శ్రీనివాస్ తమ ప్రదర్శనల ద్వారా భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని ప్రచారం చేస్తూ, యువతకు స్ఫూర్తి ప్రదానం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు సంగీత ప్రియులు హర్షధ్వానాలతో అభినందనలు తెలియజేశారు.

### అత్యద్భుతంగా సాంస్కృతిక ప్రదర్శనలు

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సరస్ మేళా ప్రాంగణంలోని కళావేదికపై శుక్రవారం సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు అత్యద్భుతంగా కొనసాగాయి. గుజరాత్ రాష్ట్ర కళాకారులు గూమర్ సంప్రదాయ నృత్యాలు అద్భుతంగా ప్రదర్శించారు. పొన్నూరు శ్రీ వెంకట అన్నమాచార్యసేవా ట్రస్ట్, కళాకారులు భక్తి, సినీ, డీజే పాటలకు హుషారుగా కోలాట ప్రదర్శన చేశారు. ఫిరంగిపురం కార్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన బాలికలు జానపద, డప్పు, నృత్యాలు, కోలాటం ప్రదర్శించారు. డీఆర్డీఏ ఏపీఎం నాగేశ్వరరావు సినీ గీతాలు, రేష్మా జానపద నృత్యం ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో సందర్శకులు వీక్షించారు.

### శనివారం ప్రదర్శనలు

సరస్ మేళాలోని కళావేదికపై శనివారం సాయంత్రం 6 గంటల నుంచి తమిళనాడు రాష్ట్ర కళాకారులచే కరకట్ట సంప్రదాయ నృత్య ప్రదర్శన, విశాఖ జిల్లా వారి జాలరి నృత్యం, కూచిపూడి, జానపద నృత్యాలు ప్రదర్శిస్తారు.



సరస్‌లో శుక్రవారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు


హజరత్ అలీ పీర్ల పంజాలో మంత్రి నారా లోకేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ముస్లిం పెద్దలు

## పీర్ల పంజాను సందర్శించిన మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పాతమంగళగిరి 26వ వార్డులో పునర్నిర్మించిన హజరత్ అలీ పీర్ల పంజా, మదర్సాను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్ర వారం సాయంత్రం సందర్శించారు. పీర్ల పంజా, మదర్సా అభి వృద్ధికి మంత్రి నారా లోకేశ్ రూ.2.5 లక్షల ఆర్థికసాయం అంద జేశారు. ముందుగా పీర్ల పంజా ప్రాంగణానికి చేరుకున్న మం త్రి లోకేశ్‌కు ముస్లిం మత పెద్దలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎం ఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, హజరత్ అలీ పీర్ల పంజా కమిటీ అధ్యక్షుడు షేక్ సుభానీ, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మహ్మద్ ఇబ్రహీం, షేక్ అక్రమ్, షేక్ రఫీ, జానీ, సాధిక్, మహ్మద్ అలీ, షేక్ ఆషిక్ తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో పది స్క్రాప్ వాహనాలు దగ్ధం

తాడేపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ వారధి సమీపంలోని తాడేపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వద్ద శుక్ర వారం జరిగిన అగ్నిప్రమాదంలో 10 స్క్రాప్ ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. పోలీసుస్టేషన్ ఆవరణలోని వెనుక భాగంలో ఉన్న సదరు వాహనాలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడం వల్ల ఈ ఘటన జరిగినట్టు ఎస్ఐ నారాయణ తెలి పారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

## రూ.15.5 లక్షలు పలికిన పుట్టలమ్మ తల్లి లడ్డూ

గుంటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు రూరల్ మండలం చల్లావారిపాలెం గ్రామంలో ఉన్న శ్రీ ఘంటలమ్మ తల్లి, పుట్టలమ్మ తల్లి అమ్మవారి దేవస్థానం వద్ద సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో భాగంగా అమ్మవారి 9 కేజీల లడ్డూ వేలం పాట జరిగింది. నల్లపాడు గ్రామానికి చెందిన ఇమడాబతిని నాగేశ్వరరావు అమ్మవారి లడ్డూ రూ.15.5 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను అలరించాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది గ్రామస్తులు పాల్గొన్నారు.


పుట్టలమ్మ తల్లి దేవాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన వేలంలో లడ్డూ దక్కించుకున్న గ్రామస్తుడు

## వైద్యుడికి టైమ్స్ ఐకాన్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ రవిశంకర్

తాడేపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మణిపాల్ వైద్యశాలకు చెందిన యూరాలజీ, రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ కన్సల్టెంట్ డాక్టర్ రవిశంకర్‌కు ప్రతిష్ఠాత్మక టైమ్స్ ఐకాన్ ఆఫ్ హెల్త్‌కేర్ అవార్డు లభించింది. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ శస్త్ర చికిత్సలు, లాప్రో స్కోపిక్ యూరాలజీ, రోబోటిక్ యూరాలజీ విధానాల్లో ఆయన చేసిన అసాధారణ సేవలకుగాను ఈ గౌరవ గుర్తింపు లభిం చింది. ఈ అవార్డు వైద్యశాస్త్రంలో అత్యున్నత నైపుణ్యం, నూతన ఆవిష్కరణలు, రోగి సంరక్షణపై నిరంతరం నిబద్ధత చూపిన ప్రముఖ వైద్యులకు అందించే పురస్కారం. అవార్డు సాధించిన డాక్టర్ రవిశంకర్‌ను తోటి సిబ్బంది అభినందించారు.

# విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

● అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్టు

● నల్లగొండ, వరంగల్ జిల్లాలో బాధిత విద్యార్థులు

● 8 మంది నుంచి రూ.85 లక్షల వరకు వసూళ్లు

● వివరాలు వెల్లడించిన నల్లగొండ ఏఎస్పీ



నల్లగొండలోని పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రమేష్

నల్లగొండ క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత చదువులు చదివించడంతో పాటు అక్కడే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని నిరుద్యోగులను నమ్మించి భారీగా డబ్బు వసూలు చేసిన అంతర్రాష్ట్ర నిందితుడిని నల్లగొండ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి ఒక ల్యాప్‌టాప్, మూడు స్మార్ట్ ఫోన్లు, డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ జి.రమేష్ వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన ముప్పాల లీలకృష్ణ కొంతకాలంగా నిరుద్యోగ యువకులను లక్ష్యంగా చేసుకొని మోసం చేస్తున్నాడు. నల్లగొండ జిల్లాలోని చింతపల్లి మండలం పోలేపల్లి రామ్‌నగర్‌కు చెందిన కోయలకారు కరుణాకర్‌బాయి కుమారుడిని విదేశాలకు పంపి ఉన్నత చదువులు చదివించి ఉద్యోగం ఇప్పిస్తానని వారి నుంచి లీలకృష్ణ సుమారు రూ.13.50 లక్షలు తీసుకున్నాడు. కుమారుడిని విదేశాలకు పంపించకపోవడంతో పాటు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఆమె గత సంవత్సరం నవంబరు 25వ తేదీన చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టినట్లు ఏఎస్పీ తెలిపారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం మాల్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు లీలకృష్ణను చింతపల్లి పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. అతడు నల్లగొండ, వరంగల్ జిల్లాలో పలువురు విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బు తీసుకొని ఇదే తరహా మోసాలకు పాల్పడినట్లు తేలింది. పట్టుబడిన నిందితుడు గతంలో విదేశాల్లో ఉద్యోగం చేశాడు. దేశానికి తిరిగివచ్చిన అనంతరం వ్యసనాలకు అలవాటు పడి అమెరికాలో ఉన్న పరిచయాలను ఉపయోగించుకొని సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ మోసాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. విదేశాలకు వెళ్లాలని ఆసక్తి చూపించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నమ్మించి ఇప్పటి వరకు 8 మంది నుంచి సుమారు రూ.85 లక్షల వరకు తీసుకొని మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిపై ఇప్పటికే మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌తో పాటు వరంగల్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు కూడా నమోదైంది. ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

## జబర్దస్త్‌లో అవకాశం కోసం అంబటి ఆరాటం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జబర్దస్త్‌లో అవకాశం కోసం మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరాట పడుతున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి సంబరాల పేరుతో సీఎం చంద్రబాబుపై ఒక పాట రాయించి దానికి డాన్స్ చేస్తూ శునకానందం పొందటం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రజలు వైసీపీని ఏడాదిన్నర క్రితమే భోగి మంటల్లో వేసి తగలబెట్టారని గుర్తు చేశారు. జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లోనే తిరుమల నమూనా దేవాలయం సెట్టింగ్ వేయించుకొని సంక్రాంతి సంబరాలు నిర్వహించిన జగన్ దంపతులు నేడు పదవి పోగానే బెంగుళూరులో ఎందుకు సేద తీరుతున్నారని ప్రశ్నించారు. పండుగలను, దేవుళ్లను సైతం రాజకీయాలకు వాడుకున్న చరిత్ర జగన్ రెడ్డిదేనన్నారు. 200 మంది అమరావతి రైతుల ప్రాణాలు బలిగొన్న జగన్ రెడ్డికి వారిపై ఇంకా కక్ష తీరలేదన్నారు. రాజధాని అమరావతిపై ఎన్నో పిల్లి మొగ్గలు వేశారని, చివరకు నదీ గర్భంలో రాజధాని ఏమిటని అడుగుతూ, సుప్రీంకోర్టుకు వెళతామని మాట్లాడటం ఆయన మానసిక పరిస్థితికి అద్దం పడుతోందని కనపర్తి అన్నారు.

## బీజేపీ నేతల సంబరాలు

గుంటూరు(తూర్పు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలలో ముంబై, పూణేతో పాటు ఇతర కార్పోరేషన్‌లలో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీ నేతలు శుక్రవారం స్థానిక లక్ష్మీపురంలోని వాజ్‌పేయి విగ్రహం వద్ద విజయోత్సవం ఘనంగా నిర్వహించారు. మిఠాయిలు పంచి, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఇతర నేతలకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ ఫలితాలు మోదీ పాలనకు గీటురాయని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివన్నారాయణ, అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, కొత్తూరి సుబ్బారావు, తోట శ్రీనివాస్, భజరంగ రామకృష్ణ, పాలపాటి రవి, రాచమల్ల భాస్కర్, సాదు రామకృష్ణ, విమలాదేవి, కత్తి మేరీ సరోజినీ, సురేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.


వాజ్‌పేయి విగ్రహం వద్ద విజయోత్సవం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

## ప్రపంచ తెలుగు మహాసభల్లో తీర్మానాలకు ఆమోదం

గుంటూరు(తూర్పు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 3 నుంచి జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చించిన తీర్మానాలకు ఆమోదం తెలుపుతున్నట్టు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వాటిలో భాగంగా ఐదవ తరగతి వరకు మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని, డిగ్రీ ఐదవ సెమిస్టర్ వరకు తెలుగు ఒక సబ్జెక్టుగా విధిగా ఉండాలని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో తెలుగు ద్వితీయ భాషగా విధిగా ఉండాలన్నారు. బోధన మాధ్యమాన్ని ఎంచుకునే హక్కు విద్యార్థులకు ఉండాలని, ఆంగ్ల మాధ్యమంలోనే బోధన అనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జీవో నెంబరు 85ను వెంటనే రద్దు చేయాలన్నారు.

చట్టసభలలో, ప్రభుత్వ కార్యాలయాలలో చర్చలు, సమావేశాలు, ఉత్తర్వులు తెలుగు భాషలోనే ఉండాలని, సమీక్షా సారాంశం అవసరమైతే ఆంగ్ల భాషలో కూడా ఉండాలని, న్యాయస్థానాలలో వాదోపవాదాలు, న్యాయమూర్తుల తీర్పులు తెలుగు భాషలోనే ఉండాలన్నారు. ప్రతివారం కనీసం ఒక రోజు లలితకళలు, సంగీతం, సాహిత్యం వంటి అంశాలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞను ప్రతిరోజూ విద్యాలయాల్లో నిర్వహించాలన్నారు. విద్యాలయాలలో వారానికి కనీసం మూడు రోజులు గ్రంథాలయ సమయం ఇవ్వాలన్నారు. దేవాలయ ఉత్సవాలలో హరికథ, బుర్రకథ, అవధానాలు, తోలుబొమ్మలాట వంటి కళారూపాలు తప్పనిసరిగా నిర్వహించాలని కోరారు. స్థానిక కళాకారులకు ఆన్-డ్యూటీ అనుమతులు, ఆర్టీసీ రాయితీలు కల్పించాలని కోరారు. శాసనాలు, తాళపత్ర గ్రంథాలను డిజిటలైజ్ చేసి అంతర్జాలంలో పొందుపరచాలని కోరారు. రాష్ట్రేతర ప్రాంతాలలో తెలుగు భాష పరిరక్షణకు ప్రత్యేక సమితులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ తీర్మానాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, అమలు చేసుకునేలా కృషి చేస్తామని గజల్ శ్రీనివాస్ తెలిపారు.

## విలాసిని పద్య కావ్యం ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళాస్రవంతి సాహితీ స్రవంతి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ రచించిన విలసిని పుస్తకావిష్కరణ జరిగింది. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ వాసా మాణిక్యాలరావు సభా పరిచయం చేశారు. కవి, రచయిత డాక్టర్ సూర్యదేవర రవికుమార్ సభాధ్యక్షతలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు, విశ్రాంత ప్రొఫెసర్ కళా స్రవంతి తాళ్ళూరి వెంకటరత్నారావు పాల్గొన్ని విలసిని పుస్తకావిష్కరణ చేశారు. సంస్థ వారు అతిథులను సత్కరించారు. సభానంతరం చింతామణిలోని భావాన్ని ఘట్టాన్ని ప్రదర్శించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు తదితరులు

## విజయకీలాద్రిని దర్శించుకున్న విదేశీ భక్తులు

తాడేపల్లి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రాన్ని గురువారం సంక్రాంతి పండుగ రోజున విదేశీ భక్తులు దర్శించుకున్నారు. అమెరికాలోని ఓ ప్రముఖ హాస్పిటల్‌లో వైద్యులుగా పని చేస్తున్న 15 మంది ఆలయాలను దర్శించుకున్న వారిలో ఉన్నారు. చినజీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు వారికి పుణ్య క్షేత్ర విశేషాలను వివరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి పుణ్యక్షేత్ర చిత్రపటాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, పలువురు ఆలయ దాతలు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.


విజయకీలాద్రి ఆలయం వద్ద విదేశీ భక్తులు, మాజీ ఎంపీ గంగరాజు

## నేడు ఢాకాకు ఐసీసీ బృందం

**బీసీబీతో చర్చలు**

**దుబాయ్:** టీ20 వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ పాల్గొనడంపై ఏర్పడిన ప్రతిష్ఠంభనను తొలగించేందుకు ఐసీసీ నడుం బిగించింది. ఈ విషయమై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)తో చర్చించేందుకు ఇద్దరు సభ్యులను శనివారం ఢాకా పంపుతున్నట్టు ఐసీసీ వెల్లడించింది. భారత్, శ్రీలంక కలిసి ఆతిథ్యమిస్తున్న మెగా టోర్నీ వచ్చేనెల 7 నుంచి మార్చి 8 వరకు జరగనుంది. అయితే తమ జట్టు క్రికెటర్ల భద్రతను సాకుగా చూపుతూ కోల్‌కతా, ముంబైలో బంగ్లాదేశ్ ఆడాల్సిన గ్రూపు మ్యాచ్‌లను మార్చాలని బీసీబీ డిమాండ్ చేస్తోంది. అయితే ఈ దశలో వేదికలను మార్చడం సాధ్యం కాదని బీసీబీకి ఐసీసీ ఇప్పటికే స్పష్టంజేసినట్టు సమాచారం. బీసీబీ డిమాండ్ చేసినట్టు ఆ జట్టు మ్యాచ్‌లను శ్రీలంకకు కాకుండా..చెన్నై తరలించే విషయంపై చర్చించే అవకాశముంది.

## 'చిన్నస్వామి'లో ఏఐ కెమెరాలు

**రూ. 4.5 కోట్లతో ఆర్‌సీబీ ఆఫర్**

**బెంగూరు:** గతేడాది రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజయోత్సవం సందర్భంగా తొక్కిసలాట జరిగిన దృష్ట్యా ఇక్కడి చిన్నస్వామి స్టేడియంలో కొన్నాళ్లుగా మ్యాచ్‌లు జరగడం లేదు. అంతేకాదు.. సేఫ్టీ క్లియరెన్స్ ఉంటేనే మ్యాచ్‌లకు అనుమతిస్తామని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఖరాఖండీగా చెప్పింది. దీంతో 'చిన్నస్వామి'లో ఈ ఏడాది ఐపీఎల్ మ్యాచ్‌లు జరగడంపైనా సందిగ్ధం నెలకొంది. ఈ నేపథ్యంలో స్టేడియంలో రద్దీ నిర్వహణ, పటిష్ఠ భద్రతకు సంబంధించి ఆర్‌సీబీ యాజమాన్యం కొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చింది. స్టేడియంలో ఏఐ (కృత్రిమ మేధ) ఆధారిత కెమెరాలను తాము ఏర్పాటు చేస్తామని కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ)కు ఆర్‌సీబీ తెలిపింది. 300 నుంచి 350 కెమెరాలు ఏర్పాటు చేస్తామనీ, వీటికయ్యే ఖర్చు రూ. 4.5 కోట్లను భరిస్తామని ఆర్‌సీబీ పేర్కొంది. ఈ అధునాతన కెమెరాలు రద్దీని సమర్థంగా నిర్వహించడం, క్యూలైన్ క్రమబద్ధీకరణ, భద్రతను పటిష్ఠం చేయడం లాంటి అంశాలకు దోహదం చేస్తాయని ఆర్‌సీబీ వివరించింది.

## 'టాటా మాస్టర్స్' బరిలో అర్జున్



**విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్):** ఇటీవలే టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నీలో తలపడ్డ భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేసి అర్జున్, గుకేశ్, ప్రజ్ఞానంద, అరవింద్ చిదంబరం.. శనివారం నుంచి జరిగే ప్రతిష్ఠాత్మక టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ ఈవెంట్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. చెస్‌లో అత్యంత పురాతనమైన ఈ టోర్నీలో అర్జున్ టాప్‌సీడ్‌గా తలపడుతున్నాడు. వరల్డ్‌కప్ విజేత జావోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్)తో గుకేశ్, ప్రజ్ఞానందతో అర్జున్, బ్లూబౌమ్ (జర్మనీ)తో అరవింద్ తొలిరౌండ్ ఆడనున్నారు.

## ఫేవరెట్ భారత్

● నేడు బంగ్లాదేశ్‌తో మ్యాచ్
● అండర్-19 వరల్డ్ కప్

**మ. 1.00 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..**

**బులవాయో:** అండర్-19 వన్డే వరల్డ్ కప్‌లో భారత్ మరో పోరుకు సిద్ధమైంది. శనివారం జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. గురువారం జరిగిన టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లో యూఎస్‌పై విజయం సాధించిన భారత యువ జట్టులో ఆత్మవిశ్వాసం ఉరకలేస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పటిష్ఠంగా ఉన్న భారత్..బంగ్లాదేశ్‌పై ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.


హెనిల్

**కుర్రాళ్ల ఘన బోణీ:** అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో గురువారం అమెరికాతో జరిగిన వర్ష ప్రభావిత మ్యాచ్‌లో భారత్ 6 వికెట్లతో గెలిచింది. మొదట అమెరికా.. పేసర్ హెనిల్ పటేల్ (5/16) ధాటికి 35.2 ఓవర్లలో 107 పరుగులకే కుప్పకూలింది. నితీష్ సూదిని (36) టాప్‌స్కోరర్. అనంతరం వర్షం కారణంగా భారత్ ఛేదనను 37 ఓవర్లలో 96 రన్స్‌గా నిర్ధారించారు. దీంతో భారత్ 17.2 ఓవర్లలోనే 99/4 స్కోరు చేసి నెగ్గింది. అభిగ్యాన్ కుందు (42 నాటౌట్), కెప్టెన్ ఆయుష్ మాత్రే (19) రాణించారు.

## టీ20 జట్టులో శ్రేయాస్, బిష్ణోయ్

● సిరీస్ నుంచి సుందర్ అవుట్

**ముంబై:** న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడి వన్డే సిరీస్‌కు దూరమైన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్.. ఈనెల 21 నుంచి కివీస్‌తో జరిగే ఐదు టీ20ల సిరీస్‌లోనూ ఆడడం లేదు. సుందర్ స్థానంలో లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను జట్టులోకి తీసుకున్నారు. అలాగే, పక్కటెముకల నొప్పితో బాధపడుతున్న తిలక్ వర్మ స్థానంలో తొలి మూడు టీ20ల కోసం స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్‌ను కూడా జట్టులోకి చేర్చినట్టు బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది.


అర్ష్‌దీప్ కుల్దీప్

## బౌలింగ్ వ్యూహం మారాల్సిందే!

**అర్ష్‌దీప్‌పై ఎందుకిలా?**

న్యూజిలాండ్‌తో మొదటి రెండు వన్డేలకు పేసర్ అర్ష్‌దీప్‌ను పక్కపెట్టడంపై మాజీ స్పిన్నర్ అశ్విన్ భారత జట్టు యాజమాన్యాన్ని నిలదీశాడు. 'జట్టుకు ఎన్నో సేవలందించిన అర్ష్‌దీప్ తుది 11 మందిలో స్థానానికి పోరాటం చేయాల్సి రావడమా? ఒక మ్యాచ్ ఆడితే రెండో పోటీలో అతడికి చోటు దక్కడం లేదు. మీరు కారణాలు ఎన్ని చెప్పినా అది అతడి విశ్వాసాన్ని దెబ్బ తీస్తుంది. బౌలర్లకే అన్నిసార్లు ఎందుకిలా జరుగుతున్నది. బ్యాటర్లకు మాత్రం ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాదు' అని అశ్విన్ దుయ్యబట్టాడు.

**ఇండోర్:** భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య నిర్ణాయక మూడో వన్డే ఆదివారం ఇక్కడ జరగనుంది. అయితే సిరీస్ చేజిక్కించుకోవాలని పట్టుదలగా ఉన్న టీమిండియా..తన బౌలింగ్ వ్యూహాలపై పునరాలోచన చేయాల్సి ఉంటుంది. తొలి రెండు వన్డేలలో భారత స్పిన్నర్లను న్యూజిలాండ్ బ్యాటర్లు అలవోకగా ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రత్యర్థి స్పిన్నర్ల బౌలింగ్‌లో పరుగులు రాబట్టడం మన బ్యాటర్లకు కష్టమైపోయింది. రాజ్‌కోట్‌లో జరిగిన రెండో వన్డేలో నెగ్గిన కివీస్ సిరీస్‌ను 1-1తో సమం చేసిన విషయం తెలిసిందే. మధ్య ఓవర్లలో భారత బౌలర్ల వైఫల్యం రాజ్‌కోట్‌లో మరోసారి కొట్టొచ్చినట్టు కనిపించింది. మిస్టరీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను న్యూజిలాండ్ ఆటగాళ్లు సులువుగా ఎదుర్కోవడం గమనార్హం. ఇక..బ్యాటర్లకు అనుకూలించే ఇండర్‌లో బౌండరీ విస్తీర్ణం కూడా తక్కువగా ఉంటుంది. ఈనేపథ్యంలో బౌలింగ్‌లో వైవిధ్యం కన్నా..క్రమశిక్షణగా బంతులు వేయడం ముఖ్యం. అందుకు వికెట్లను లక్ష్యంగా చేసుకొని కుల్దీప్ బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. గాయంతో వాషింగ్టన్ సుందర్ దూరం కావడం రాజ్‌కోట్ మ్యాచ్‌పై ఎంతో ప్రభావం చూపింది. అతడి స్థానంలో జట్టులోకి వచ్చిన నితీశ్ కుమార్ కేవలం రెండు ఓవర్లే వేశాడు. ఇండోర్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే తుది జట్టులో ఆఫ్ స్పిన్నర్ ఆయుష్ బదోనికి స్థానం కల్పిస్తారేమో చూడాలి. పేస్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ఎడమ చేతివాటం బౌలర్ అర్ష్‌దీప్‌ను తీసుకునే అవకాశాలు లేకపోలేదు. అదే జరిగితే ప్రసిద్ధ్‌ను పక్కనపెట్టాల్సి ఉంటుంది. కాగా.. భారత జట్టు శుక్రవారంనాడు ప్రాక్టీస్‌కు దూరంగా ఉండగా, న్యూజిలాండ్ నెట్స్‌లో తీవ్రంగా శ్రమించింది.

## బెంగళూరు హ్యాట్రిక్

● వరుసగా మూడో విజయం ● రాధ అర్ధశతకం
● శ్రేయాంక పాంచ్ పటాక ● గుజరాత్ ఓటమి


శ్రేయాంక పాటిల్ (5/23)

**నవీ ముంబై:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జోరు కొనసాగిస్తోంది. ఆల్‌రౌండ్ షోతో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విజయంతో పాయింట్ల పట్టికలో అగ్ర స్థానాన్ని పటిష్ఠం చేసుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 32 పరుగులతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. తొలుత బెంగళూరు 20 ఓవర్లలో 182/7 స్కోరు చేసింది. రాధా యాదవ్ (47 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 66) లీగ్‌లో తొలి హాఫ్ సెంచరీ చేసింది. రిచా ఘోష్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44) కొద్దిలో అర్ధ శతకం మిస్సయింది. రాధ, రిచా ఐదో వికెట్‌కు 105 పరుగులతో ఆదుకున్నారు. చివర్లో డి క్లెర్క్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 26) ధనాధన్ బ్యాటింగ్‌తో అలరించింది. యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ (5/23) ఐదు వికెట్లతో తిప్పేయడంతో.. ఛేదనలో గుజరాత్ 18.5 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటైంది. భారతీ ఫుల్‌మాలీ (20 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 39), బేత్ మూనీ (14 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 27), తనూజా కన్వర్ (13 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 21) మాత్రమే రాణించారు. లారెన్ బెల్ 3 వికెట్లు తీసింది. రాధా యాదవ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

**డబ్ల్యూపీఎల్‌లో నేడు**

| | |
|---|---|
| ముంబై × యూపీ | (మ. 3.00) |
| ఢిల్లీ × బెంగళూరు | (రా. 7.30) |


రాధా యాదవ్ (66)

**సంక్షిప్తస్కోర్లు**

**బెంగళూరు:** 20 ఓవర్లలో 182/7 (రాధా యాదవ్ 66, రిచా ఘోష్ 44, డి క్లెర్క్ 26, సోఫీ డివైన్ 3/31, కష్వీ గౌతమ్ 2/42).
**గుజరాత్:** 18.5 ఓవర్లలో 150 ఆలౌట్ (భారతీ ఫుల్‌మాలీ 39, బేత్‌మూనీ 27, తనుజా కన్వర్ 21, శ్రేయాంక పాటిల్ 5/23, లారెన్ బెల్ 3/29).

### యూపీ గెలిచింది..

డబ్ల్యూపీఎల్‌లో యూపీ వారియర్స్ ఎట్టకేలకు బోణీ చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు ఏడు వికెట్లతో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌కు షాకిచ్చింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 161/5 స్కోరు చేసింది. నాట్ షివర్ బ్రంట్ (65), అమన్‌జోత్ (38), నికోలా కేరీ (32 నాటౌట్) రాణించారు. శిఖ, ఎకిల్‌స్టోన్, దీప్తీ శర్మ, ఆశా శోభన తలా ఒక్కో వికెట్ పడగొట్టారు. ఛేదనలో యూపీ 18.1 ఓవర్లలో 162/3 స్కోరు చేసి నెగ్గింది. హర్లీన్ డియోల్ (64 నాటౌట్), ట్రయన్ (27 నాటౌట్), మెగ్ లానింగ్ (25), లిచ్‌ఫీల్డ్ (25) సత్తా చాటారు. బ్రంట్ 2 వికెట్లు దక్కించుకుంది.

## ముగిసిన మనోళ్ల పోరు

**ఇండియా ఓపెన్**

● లక్ష్య, కిడాంబి, ప్రణయ్ అవుట్
● సాత్విక్, గాయత్రి జోడీలు కూడా


లక్ష్యసేన్

**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై అభిమానులను మురిపిస్తారనుకున్న భారత షట్లర్లు నిరాశ పరిచారు. ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్‌లో కనీసం ఫైనల్ కూడా చేరకుండానే తమ పోరును ముగించారు. కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి, గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ ప్రీక్వార్టర్స్‌లోనే వెనుదిరగగా.. లక్ష్యసేన్ క్వార్టర్స్‌లో నిష్క్రమించాడు. దీంతో టోర్నీలో భారత్ పోరాటానికి తెరపడింది. శుక్రవారం జరిగిన హోరాహోరీపోరులో లక్ష్య 21-17, 13-21, 18-21తో ప్రపంచ 12వ ర్యాంకర్ లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో ఓడాడు. గురువారం జరిగిన సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 14-21, 21-17, 17-21తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో, ప్రణయ్ 21-18, 19-21, 14-21తో లో కీన్ యే (సింగపూర్) చేతిలో ఓటమి చవిచూశారు. ఇక, పురుషుల డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో సాత్విక్/చిరాగ్ జోడీ 27-25, 21-23, 19-21తో జపాన్ జంట క్యోహీ యమషిత/హిరోకి మిదోరికోవా చేతిలో, మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 22-20, 22-24, 21-23తో చైనా జోడీ లూవో యు/గ్వా మిన్ లూవో చేతిలో పోరాడి ఓడారు.

## 'విజయ్ హజారే' ఫైనల్లో సౌరాష్ట్ర x విదర్భ


విశ్వరాజ్ (165 నాటౌట్)

**బెంగళూరు:** సౌరాష్ట్ర, విదర్భ జట్లు విజయ్ హజారే ట్రోఫీలో ఫైనల్‌కు దూసుకెళ్లాయి. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో సౌరాష్ట్ర 9 వికెట్లతో పంజాబ్‌పై గెలిచింది. మొదట పంజాబ్ నిర్ణీత 50 ఓవర్లలో 291 పరుగులకు ఆలౌటైంది. అన్మోల్‌ప్రీత్ (100) శతకంతో, కెప్టెన్ ప్రభ్‌సిమ్రన్ (87) అర్ధ సెంచరీతో రాణించారు. విదర్భ బౌలర్లలో చేతన్ సకారియా 4, అంకుర్, చిరాగ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఓపెనర్ విశ్వరాజ్ జడేజా (127 బంతుల్లో 18 ఫోర్లు, 3 సిక్సర్లతో 165 నాటౌట్) సూపర్ సెంచరీతో విజృంభించడంతో సౌరాష్ట్ర 39.3 ఓవర్లలో 293/1 స్కోరు చేసి గెలిచింది. మరో ఓపెనర్, కెప్టెన్ హార్విక్ దేశాయ్ (64), ప్రేరక్ మన్కడ్ (52 నాటౌట్) అర్ధ శతకాలతో సత్తా చాటారు. గురువారం జరిగిన తొలి సెమీస్‌లో విదర్భ 6 వికెట్లతో కర్ణాటకను ఓడించింది. తొలుత కర్ణాటక 49.4 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. కరుణ్ నాయర్ (76), కృష్ణన్ శ్రీజిత్ (54) అర్ధ సెంచరీలు చేశారు. విదర్భ బౌలర్లలో దర్శన్ నల్కండే (5/48) ఐదు వికెట్లతో విజృంభించాడు. ఛేదనలో అమన్ (138) సెంచరీకి తోడు రవికుమార్ (76 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో విదర్భ 46.2 ఓవర్లలోనే 284/4 స్కోరు చేసి గెలిచింది. ఆదివారం ఫైనల్ జరగనుంది.





**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,43,400 ▼ | 1,31,450 ▼ | 3,06,000 ▲ |
| విజయవాడ | 1,46,000 ▲ | 1,36,000 ▲ | 2,90,000 ▲ |
| విశాఖపట్నం | 1,46,463 ▲ | 1,31,650 ▲ | 3,07,000 ▲ |
| రాజమండ్రి | 1,43,620 ▲ | 1,31,650 ▲ | 2,76,000 ▲ |
| ప్రొద్దుటూరు | 1,43,300 ▲ | 1,31,840 ▲ | 2,78,000 ▲ |
| ముంబై | 1,41,590 ▼ | 1,29,700 ▼ | 2,81,890 ▲ |

### ఫిబ్రవరి 1న మార్కెట్లు పని చేస్తాయి

ముంబై: ఫిబ్రవరి ఒకటో తేదీన ఆదివారం అయినప్పటికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజిలైన ఎన్ఎస్ఈ, బీఎస్ఈ పని చేస్తాయి. ఈ మేరకు రెండు ఎక్స్ఛేంజిలు ఇన్వెస్టర్ల సమాచారం కోసం సర్క్యులర్లు జారీ చేశాయి. ఆ రోజు ప్రీ ఓపెన్ మార్కెట్ ఉదయం 9 గంటలకు ప్రారంభమై 9.08కి ముగుస్తుందని, ఆ తర్వాత సాధారణ మార్కెట్ వేళలు 9.15 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు ఉంటాయని ఎన్ఎస్ఈ తెలియచేసింది. బీఎస్ఈ కూడా అదే తరహా సర్క్యులర్ జారీ చేస్తూ సాధారణ వేళల్లోనే మార్కెట్ పని చేస్తుందని వెల్లడించింది.

### లాభాల్లోకి మార్కెట్

ముంబై: ఈక్విటీ మార్కెట్ రెండు రోజుల నష్టాలకు తెర దించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 752.26 పాయింట్లు లాభపడినప్పటికీ ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన మిశ్రమ సంకేతాలు, విదేశీ నిధుల తరలింపు వంటి పరిణామాలతో లాభాన్ని 187.64 పాయింట్లకు పరిమితం చేసుకుని 83,570.35 వద్ద ముగిసింది. నిఫ్టీ 28.75 పాయింట్లు లాభపడి 25,694.35 వద్ద క్లోజయింది.

## రిలయన్స్ లాభం రూ.18,645 కోట్లు

● ఆదాయం రూ.2.69 లక్షల కోట్లు
● రిటైల్ వ్యాపారం డీలా..
● కేజీ బేసిన్‌లో తగ్గిన గ్యాస్ ఉత్పత్తి






ముంబై: వర్తమాన ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికానికి (క్యూ3) రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.18,645 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.18,540 కోట్లతో పోలిస్తే లాభం కేవలం 0.60% పెరిగింది. డిజిటల్, ఎనర్జీ విభాగాలు మంచి పనితీరు కనబరిచినప్పటికీ, జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ కారణంగా రిటైల్ వ్యాపారం డీలా పడటం, కేజీ బేసిన్ నుంచి గ్యాస్ ఉత్పత్తి తగ్గుదల ఇందుకు దోహదపడ్డాయి. అయితే క్యూ3లో ఆదాయం మాత్రం 10.51% వృద్ధితో రూ.2,69,496 కోట్లకు ఎగబాకింది. 2024-25లో ఇదే కాలానికి రెవెన్యూ రూ.2,43,865 కోట్లుగా నమోదైంది. కాగా, 2025 సెప్టెంబరు చివరినాటికి రూ.1,18,545 కోట్లుగా ఉన్న కంపెనీ నికర రుణ భారం.. డిసెంబరు చివరికల్లా రూ.1,17,102 కోట్లకు తగ్గింది.

### జియో లాభంలో 11.3% వృద్ధి

టెలికాం కంపెనీ రిలయన్స్ జియోతోపాటు డిజిటల్ వ్యాపారాలన్నింటినీ ఒకే గొడుగు కింద చేర్చి ఏర్పాటు చేసిన జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం ఈ క్యూ3లో 11.3% వృద్ధితో రూ.7,629 కోట్లకు పెరిగింది. రిలయన్స్ జియో కస్టమర్ల సంఖ్య, ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయం (ఆర్పు) గణనీయంగా పెరగడంతోపాటు డిజిటల్ సేవల విస్తరణ ఇందుకు దోహదపడింది. సమీక్షా త్రైమాసికానికి జియో ప్లాట్‌ఫామ్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 12.7% వృద్ధితో రూ.37,262 కోట్లకు చేరుకుంది. ఈ క్యూ3లో రిలయన్స్ జియో ఆర్పు 5.1% పెరిగి రూ.213.7కు చేరుకుంది.

### రిటైల్‌పై మార్జిన్ల ఒత్తిడి

డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) ఆదాయం వార్షిక ప్రాతిపదికన 9.2% పెరిగి రూ.86,951 కోట్లకు చేరుకుంది. నికర లాభం మాత్రం 2.7% వృద్ధితో రూ.3,551 కోట్లకు పరిమితమైంది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతోపాటు కన్స్యూమర్ ప్రొడక్ట్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ వ్యాపార విభజనతో లాభాల మార్జిన్లపై ఒత్తిడి ఇందుకు కారణమైంది. గత మూడు నెలల్లో ఆర్ఆర్‌వీఎల్ కొత్తగా 431 స్టోర్లను ప్రారంభించింది. దాంతో మొత్తం విక్రయ కేంద్రాల సంఖ్య 19,979కి పెరిగింది.

### ఓ2సీ ఆదాయం రూ.1.62 లక్షల కోట్లు

రిలయన్స్‌కు చెందిన ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ) విభాగ వ్యాపారం ఆదాయం ఈ క్యూ3లో 8.4 శాతం పెరిగి రూ.1,62,095 కోట్లకు చేరుకుంది. ఎగుమతులు మాత్రం 1.2% తగ్గి రూ.66,830 కోట్లకు పరిమితం అయ్యాయి. కాగా, ఎబిటా 14.6% పెరిగి రూ.16,507 కోట్లకు ఎగబాకగా.. ఎబిటా మార్జిన్ కూడా 10.2 శాతానికి పెరిగింది.

### ఆయిల్ అండ్ గ్యాస్ ఆదాయం 8.4% డౌన్

కంపెనీ చెందిన ఆయిల్ అండ్ గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి విభాగం ఆదాయం ఈ క్యూ3లో 8.4% తగ్గి రూ.5,833 కోట్లకు పడిపోగా.. ఎబిటా 12.7% తగ్గి రూ.4,857 కోట్లకు పరిమితమైంది. కేజీ బేసిన్ నుంచి సహజ వాయువు ఉత్పత్తితోపాటు దాని ధర కూడా తగ్గడం ఇందుకు కారణం.

### జియోస్టార్ లాభం రూ.888 కోట్లు

సెప్టెంబరుతో ముగిసిన క్యూ2తో పోలిస్తే, క్యూ3లో కంపెనీ మీడియా వ్యాపార విభాగమైన జియోస్టార్ ఆదాయం రూ.8,010 కోట్లకు పెరగగా.. నికర లాభం మాత్రం రూ.888 కోట్లకు తగ్గింది.

## అక్రమంగా వాకీ-టాకీల విక్రయం..

**అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మెటా, మీషోపై 10 లక్షల చొప్పున జరిమానా**

న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో అక్రమంగా వాకీ-టాకీలను విక్రయించినందుకుగాను ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషోతో పాటు ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్ మాతృసంస్థ మెటాపై సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) రూ.10 లక్షల చొప్పున జరిమానా విధించింది. వినియోగదారుల పరిరక్షణ చట్టం 2019తో పాటు టెలికం నిబంధనలను ఉల్లంఘిస్తూ ఈ-కామర్స్ సంస్థలు తమ వేదికల ద్వారా వాకీ-టాకీల విక్రయాలు జరిపినందుకు సుమోటో చర్యలను ప్రారంభించింది. 8 సంస్థలకు తుది ఆర్డర్లు జారీ చేయడమే కాకుండా వాటన్నింటికీ కలిపి మొత్తం రూ.44 లక్షల జరిమానా విధించింది. సీసీపీఏ నోటీసులు జారీ చేసిన సంస్థల జాబితాలో చిమియ, జియోమార్ట్, టాక్ ప్రో, మీషో, మాస్క్‌మ్యాన్ టాయ్స్, ట్రేడ్ఇండియా, అంతరిక్ష్ టెక్నాలజీస్, వర్ధాన్‌మార్ట్, ఇండియామార్ట్, ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్, ఫ్లిప్‌కార్ట్, కృష్ణమార్ట్, అమెజాన్ ఉన్నాయి.

## విప్రో లాభంలో 7% క్షీణత

న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల దిగ్గజాల్లో ఒకటైన విప్రో...డిసెంబరు 31వ తేదీతో ముగిసిన వర్తమాన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక లాభంలో 7% క్షీణతను నమోదు చేసింది. కార్మిక చట్టాల అమలు, పునర్ వ్యవస్థీకరణ వ్యయాల కారణంగా కంపెనీ లాభం గత ఏడాది ఇదే కాలంలో పోల్చితే రూ.3,353.8 కోట్ల నుంచి రూ.3,119 కోట్లకు తగ్గింది. కొత్త కార్మిక చట్టాల ప్రభావం కంపెనీపై రూ.302.8 కోట్ల మేరకు పడిందని వెల్లడించింది. దీనికి అదనంగా పునర్నిర్మాణ వ్యయాల భారం రూ.263 కోట్లు పడినట్టు తెలిపింది. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం 5.5% పెరిగి రూ.23,555.8 కోట్లకు చేరింది. విప్రో డైరెక్టర్ల బోర్డు రూ.2 ముఖవిలువ గల ఒక్కో షేరుపై రూ.6 మధ్యంతర డివిడెండును ప్రకటించింది. డివిడెండుకు రికార్డు తేదీ జనవరి 27 కాగా ఫిబ్రవరి 14 లోగా అర్హులందరికీ చెల్లింపులు పూర్తి చేయనున్నట్టు కంపెనీ తెలిపింది.

### టెక్ మహీంద్రా లాభంలో 14% వృద్ధి


ఐటీ సర్వీసుల రంగంలోని మరో కంపెనీ టెక్ మహీంద్రా మూడో త్రైమాసికంలో రూ.1,122 కోట్ల లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.983.2 కోట్లతో పోల్చితే లాభం 14.11% పెరిగింది. ఇదే కాలంలో ఆదాయం రూ.13,286 కోట్ల నుంచి రూ.14,393 కోట్లకు పెరిగింది. డిసెంబరు 31 నాటికి కంపెనీలో 1,49,616 మంది పని చేస్తున్నారని, ఏడాది కాలంలో ఉద్యోగుల సంఖ్య 872 తగ్గిందని, ఉద్యోగుల వలస రేటు 12.3% ఉన్నదని తెలిపింది.

### ఆగని వెండి మెరుపులు

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్లో వెండి ధరల్లో పరుగు వరుసగా ఆరో రోజు కూడా కొనసాగింది. ఢిల్లీ మార్కెట్లో శుక్రవారం కిలో వెండి ధర రూ.3,600 పెరిగి రూ.2,92,600 పలికింది. వరుసగా ఆరు సెషన్లలో వెండి ధర 20.16% (రూ.49,100) పెరిగింది. అయితే 99.9 శాతం స్వచ్ఛత గల మేలిమి బంగారం ధర మాత్రం 10 గ్రాముల ధర జీవిత కాల గరిష్ఠ స్థాయి నుంచి రూ.1,100 తగ్గి రూ.1,46,200 వద్ద ముగిసింది.

## డీప్ టెక్‌పై దృష్టి పెట్టండి..

● భారత్‌ను ఆవిష్కరణల్లో అగ్రస్థానంలో నిలబెట్టాలి..
● దేశీయ స్టార్టప్‌లకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు


నేషనల్ స్టార్టప్ డే సందర్భంగా ఏర్పాటైన ఎగ్జిబిషన్‌ను సందర్శించిన ప్రధాని

న్యూఢిల్లీ: భారత స్టార్టప్‌లు తయారీ, డీప్ టెక్నాలజీ, ప్రపంచ నాయకత్వంపై దృష్టిసారించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. స్టార్టప్ ఇండియా వచ్చే దశాబ్ద కాలంలో భారత్‌ను ఆవిష్కరణల్లో అగ్రస్థానంలో నిలబెట్టాలన్నారు. ఢిల్లీలోని భారత మండపం వేదికగా శుక్రవారం జరిగిన స్టార్టప్ ఇండియా 10వ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రధాని ప్రసంగిస్తూ.. దేశ ఆర్థిక, సాంకేతిక భవిష్యత్‌ను మలచడంలో స్టార్టప్‌లు కీలకపాత్ర పోషించనున్నాయన్నారు. స్టార్టప్ ఇండియా మిషన్ ఒక విప్లవమని, ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్‌ల ఆవరణ వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దిందని అన్నారు. 2014లో దేశంలో 500లోపు అంకురాలుండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 2 లక్షలు దాటిందని, అందులో 125 యూనికార్న్‌లు కూడా ఉన్నాయన్నారు. కనీసం 100 కోట్ల డాలర్ల (రూ.9,000 కోట్లు) విలువైన స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా పిలుస్తారు.

### స్టార్టప్‌లకు అండగా ఉంటాం..

భారత యువత, వ్యవస్థాపకులు సమాజ సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టారని, రిస్క్ తీసుకునేవారికి సమాజంలో ప్రోత్సాహం, గౌరవం లభిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. స్టార్టప్‌లు ఉద్యోగాల కల్పన, ఆవిష్కరణలు, ప్రపంచ పోటీతత్వాన్ని పెంచుతున్నాయని ఆయన అన్నారు. "మీ ప్రయత్నాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. మీ సామర్థ్యాలపై నాకు నమ్మకం ఉంది. మీ ధైర్యం, విశ్వాసం, ఆవిష్కరణలు దేశ భవిష్యత్‌ను మారుస్తాయి" అని స్టార్టప్ ప్రతినిధులనుద్దేశించి ఆయన అన్నారు.

### కృత్రిమ మేధకు ఊతం

దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను పెంపొందించేందుకు కేంద్రం ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందని ప్రధాని మోదీ అన్నారు. "కొత్త ఆలోచనలపై పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం పలు కొత్త టెక్నాలజీ డొమైన్లు పుట్టుకొస్తున్నాయి. భవిష్యత్‌లో అవి ఆర్థిక భద్రత, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిలో కీలక పాత్ర పోషించగలవు. అందుకు ఉదాహరణ ఏఐ. దేశం ఏఐ విప్లవంలో ఎంత ముందంజలో ఉంటే అంత ప్రయోజనకరం" అని అన్నారు. ఏఐ అభివృద్ధిలో అధిక కంప్యూటింగ్ వ్యయం సవాలును పరిష్కరించేందుకు ఇండియాఏఐ మిషన్ ఇప్పటికే 38,000 జీపీయూలను సమకూర్చుకుందన్నారు.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| 17వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 540 | విజయవాడ | 550 |
| వరంగల్ | 542 | గోదావరి | 550 |
| చిత్తూరు | 583 | విశాఖపట్నం | 550 |
| | | డజను గుడ్లు రూ. 75 | |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 156 | విజయవాడ | 157 |
| వరంగల్ | 156 | గుంటూరు | 164 |
| కరీంనగర్ | 156 | ఒంగోలు | 164 |
| మహబూబ్‌నగర్ | 156 | చిత్తూరు | 164 |
| కర్నూలు | 156 | నెల్లూరు | 169 |
| విశాఖపట్నం | 145 | అనంతపురం | 169 |
| గోదావరి | 157 | | |



జగ్గన్నతోట ప్రభల తీర్థానికి వచ్చిన జనసందోహం

## వైభవంగా జగ్గన్నతోట ప్రభల తీర్థాలు

అంబాజీపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కనుమ రోజు నిర్వహించే ప్రభల తీర్థాలు కోనసీమ జిల్లాలో శుక్రవారం ఘనంగా జరిగాయి. అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోట ప్రభల తీర్థం చూసేందుకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. 11 గ్రామాల నుంచి వచ్చిన ఏకాదశ రుద్రులు, ఉప ప్రభలు జగ్గన్నతోటలో కొలువుతీరాయి. పచ్చని చేలను తొక్కుకొంటూ గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారానికి చెందిన చెన్నమల్లేశ్వర స్వామి, వీరేశ్వర స్వామి ప్రభలను పంట కాలువ దాటిస్తున్న తీరు చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వర స్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వర స్వామి, వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి, కె.పెదపూడి మేనేకశ్వరస్వామి, ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి, వక్కలంక కాశీవిశ్వేశ్వరస్వామి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల రాఘవేశ్వరస్వామి, మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి, పాలగుమ్మి చెన్నమల్లేశ్వర స్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి ప్రభలు జగ్గన్నతోటకు తరలివచ్చాయి. అంబాజీపేట మండలం వాకలగరువు, తొండవరం గ్రామాల నుంచి సుమారు 57 అడుగుల ప్రభలను వాకలగరువులో జరిగే తీర్థానికి తీసుకువచ్చారు.



రూ.1.53 కోట్లు పందెం గెలిచిన రాజమండ్రికి చెందిన రమేష్ టీం

## సేతువాపై డేగ ఆధిపత్యం.. 1.53 కోట్ల పందెం

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని తోటతో గురువారం భారీ కోడి పందెం జరిగింది. గతేడాది రూ.కోటి 25 లక్షలు గెలుచుకున్న గుడివాడ ప్రభాకర్ మరోసారి కోట్ల పందెంలో నిలవగా, ఈ సారి రాజమండ్రికి చెందిన రమేశ్ టీమ్ పందేనికి సై అన్నారు. సేతువా (పుంజు)తో గుడివాడ ప్రభాకర్ రూ.కోటి 53 లక్షలతో బరిలోకి వచ్చి కాలుదువ్వగా రాజమండ్రి రమేశ్ డేగ (పుంజు) సై అంది. ఈ పోటీలో సేతువాపై డేగ ఆధిపత్యం చూపించి సేతువాను మట్టి కరిపించింది. ఈ పోటీలో గెలిచిన రాజమండ్రి రమేశ్ టీమ్ రూ.1. 53 కోట్లు సొంతం చేసుకుంది. నిర్వాహకులు గోనె సంచిలో పందెం సొమ్ము రమేశ్ టీమ్‌కు అందించారు. భోగి రోజు రూ.63 లక్షలు, సంక్రాంతి, కనుమ రోజు రూ.45 లక్షలు రమేశ్ వర్గానికి చెందిన అమలాపురం వాసి కొవ్వూరి జానకి రామరాజు గెలుచుకుని ఈ ఏడాది జరిగిన భారీ పందేలలో సత్తా చాటారు.



బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో వీఐపీ బరిలో భారీజనసందోహం మధ్య జోరుగా కోడిపందేలు



కోనసీమ జిల్లా మురమళ్ల బరి వద్ద జనం



కోనసీమ జిల్లా మురమళ్ల బరి వద్ద సినీ నిర్మాత ఆదిత్యరామ్‌కు చెందిన రూ.6 కోట్ల విలువైన టెస్లా కారు

# 'కోట్ల'లో కూత!

(మొదటి పేజీ తరువాయి)

వెనకేసుకున్నారు. కరప మండలంలో కోడిపందేలు మూడు రోజులు కలిపి రూ.15 కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయి. తాళ్లరేవులో అధికార పార్టీకి చెందిన ఓ కీలకనేత యానాం రిసార్ట్‌లో 40 గదులు బుక్ చేయించి మూడు రోజులు రేయింబవళ్లు పేకాట ఆడించారు. మూడు బోర్డుల గేమ్ పేకాటలో రోజుకు మొదటి విన్నర్ రూ.కోటి వరకు గెలుచుకున్నారు. మగువలను కూడా తీసుకువచ్చి చిందులేశారు. మొత్తం పేకాట టర్నోవర్ రూ.12 కోట్లని అంచనా. కాకినాడ రూరల్, కరప, ఉండూరు, కందరాడ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పందేల వద్ద ప్రవేశ రుసుం కనీసం రూ.1.50 లక్షలుగా ఉంది. ఎక్కడిక్కడ భారీ ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. పందేలు తిలకిస్తున్న వారికి ఉదయం టిఫిన్, మధ్యలో స్నాక్స్ పలు రకాల వంటలతో మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటుచేశారు. పలు బరుల వద్ద రక్షణ కోసం బౌన్సర్లను ఏర్పాటు చేసుకున్నారు. తునిలో రూ.8 కోట్లకుపైగా పందేలు జరిగాయి. పక్కనే ఉన్న అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి పందెం రాయుళ్లు ఇక్కడకు పోటెత్తారు.

### కోనసీమలో పందేల జోరు...

ఫ్లడ్‌లైట్లు, డిజిటల్ స్ర్కీన్‌లతో సర్వహంగులతో అంబేడ్కర్ కోనసీమ జిలాల్లోని ఐ.పోలవరం మండలం మురమళ్లలో ఏర్పాటుచేసిన అతిపెద్ద కోడి పందాల బరికి ప్రముఖులు పోటెత్తారు. ఇక్కడ కోట్లాది రూపాయలు చేతులు మారాయి. జిల్లావ్యాప్తంగా వందకుపైగా పందెంబరులతోపాటు వందలాది బోర్డులతో గుండాటలు, పేకాటలు వంటివి జోరుగా సాగాయి. మూడురోజులపాటు సుమారు రూ.150 కోట్ల మేర జూద క్రీడల జాతరలో వెచ్చించినట్టు సమాచారం. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి పందెంరాయుళ్లు ముఖ్యంగా మహిళలు కోడిపందాలను తిలకించారు. మురమళ్ల బరి వద్ద పార్లమెంటు సభ్యులు గంటి హరీశ్‌బాలయోగి(అమలాపురం), తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ (కాకినాడ), ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు(ముమ్మిడివరం), గిడ్డి సత్యనారాయణ(పి.గన్నవరం), ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, నిర్మాత ఆదిత్యరామ్, సినీ నటి హేమ సహా అనేకమంది ప్రముఖులు వీక్షించారు. ఇక రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల పరిధిలో 20కి పైగా ప్రాంతాల్లో అశ్లీల రికార్డింగ్ డాన్స్‌లు హోరెత్తిపోయాయి.

### 'తూర్పు' పందెం రూ.100 కోట్లపైనే

తూర్పుగోదావరి జిల్లాలో చాలాచోట్ల కార్పొరేట్ లెవల్‌లో కోడి పందాలు, గుండాటలు, పేకాటలు జోరుగా సాగాయి. రూ.100కోట్లకుపైగానే చేతులు మారినట్టు అంచనా. మొత్తం 150 వరకూ బరులు నిర్వహించారు. ఒక్కో బరి వద్ద నాలుగు నుంచి ఆరు వరకు గుండాట బోర్డులు ఏర్పాటు చేశారు. ఈసారి బరులను కొంతమంది వ్యక్తులు పాడుకోవడం గమనార్హం. బరిని బట్టి రూ.లక్ష నుంచి కోటి వరకూ పాడుకున్నారు. పందెం కమీషన్లుతోపాటు, గుండాట నిర్వాహకులు ఇచ్చే సొమ్ము, పేకాట, మద్యం. ఇతర దుకాణాల నుంచి వచ్చే సొమ్ముతో వీళ్ల లాభాలు గడించారు. ఇక.. పశ్చిమ గోదావరి జిల్లాలో మూడు రోజులు కలిపి సుమారు రూ. 300 కోట్లు చేతులు మారాయి. ఉండి నియోజకవర్గం కాళ్ల మండలంలోని పెద అమిరం, సీసలి బరుల్లో ప్రతి పందెం కనిష్ఠంగా రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు కాశారు.

### 'బాపట్ల'లో 200 కోట్ల పందేలు

బాపట్ల జిల్లావ్యాప్తంగా నిర్వహించిన కోడి పందేల్లో దాదాపు రూ.200 కోట్ల వరకు చేతులు మారినట్లు సమాచారం. ఒక్క చెరుకుపల్లి మండల పరిధిలో ఏర్పాటు చేసిన బరిలోనే పండుగ 3 రోజుల్లో దాదాపు రూ.100 కోట్ల వరకు పందేలు సాగినట్లు అంచనా. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని బరిలో రూ.60 కోట్ల లావాదేవీలు జరగ్గా, వేమూరు పరిధిలో కూడా భారీగానే పందేలు కాశారు. బరుల వద్ద గుండాట, పేకాట యథేచ్ఛగా కొనసాగాయి. ప్రధాన బరుల వద్ద నిర్వహించిన కోడి పందేల్లో ఆరుగురు బుల్లెట్లను గెలుచుకున్నారు. పల్నాడు జిల్లాలో ప్రతి పందేనికి రూ.లక్షల్లో నగదు చేతులు మారింది.

### ఏలూరులో 200 కోట్లు తెగాయి

ఏలూరు జిల్లాకు ఈసారి పెద్దఎత్తున తెలంగాణ జిల్లాల నుంచి ప్రముఖులు, పలువురు ప్రజాప్రతినిధులు పోటెత్తడంతో కోడి పందేలు రంజుగా సాగాయి. భోగి నుంచి కనుమ పండగ శుక్రవారం సాయంత్రం వరకు రూ.200 కోట్ల పైగా పందేలు తెగినట్టు చెబుతున్నాయి. నూజివీడు మండలం మీర్జాపురం పది ఎకరాల బరితో కలిపి, మరికొన్ని బరుల్లో మెట్టగూడెం, నూజివీడు టౌన్, సిద్ధార్థనగర్, ఆగిరిపల్లి, జనార్దనవరం, కోటపాడు, ముసునూరు, చెక్కపల్లి, కాట్రేనిపాడు కోడి పందేల్లో రూ.120 కోట్ల ఫైమాటే చేతులు మారినట్లు అంచనా. ఈసారి పెద్దఎత్తున తెలంగాణ వాసులు, ప్రముఖ రాకలతో శిబిరాలు హైటెక్ సొబగులను అద్దుకున్నాయి. యథేచ్ఛగా గుండాట, పేకాట, లోపల-బయట మ్యాచ్‌ల్లో రూ.100 కోట్ల పైబడి చేతులు మారాయి. కైకలూరులోని భుజబలపట్నంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ మాగంటి బాబు, జబర్దస్త్ అవినాశ్ పందెం పోటీలను తిలకించారు. ముదినేపల్లి మండలంలో అల్లూరు, పెయ్యేరు, పెదపాలపర్రు, సింగరాయపాలెం-కోరుకొల్లు రోడ్ల వద్ద భారీ ఎత్తున పందేలు జరిగాయి. గురు, శుక్ర వారాల్లో రూ.5 కోట్ల చేతులు మారాయి. ఏడు బుల్లెట్‌లు, కారు, రెండు హోండా యాక్టివాలను ఎక్కువ పందేలను గెలుచుకున్న వారికి బహూకరించారు. కొయ్యలగూడెం రామానుజపురంలో 4 ఎకరాల తోటల్లో కోడి పందేలు నిర్వహించారు. రూ.3.5 కోట్లు చేతులు మారాయి. లింగపాలెం మండలంలో భారీ పందెలు జరిగాయి. ఇక్కడ యాంకర్ ఆర్పే శ్యామల తిలకించేందుకు వచ్చారు.



విజయవాడ రామవరప్పాడులోని ఓ బరిలో తలపడుతున్న పుంజులు

## మందుబాబులకు పండగే!

(మొదటి పేజీ తరువాయి)

అమ్మకాలు రెట్టింపయ్యాయి. కోడిపందేల బరులు పెరగడం కూడా ఈ విక్రయాలపై ప్రభావం చూపింది. ఇతర రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాకుండా ఎక్సైజ్ శాఖ పటిష్ఠ చర్యలు చేపట్టింది. వీటన్నిటి కారణంగా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు బాగా పెరిగాయి. రాష్ట్రంలో రోజూ రూ.85 కోట్ల అమ్మకాలు జరుగుతాయి. సాధారణ రోజుల్లో జరిగే అమ్మకాల కంటే జనవరి 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రెట్టింపు పెరిగాయి. ఆ వారంలో రూ.877 కోట్ల లిక్కర్ విక్రయాలు జరుగగా.. ఒక్క భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లోనే రూ.438 కోట్లు అమ్మారు. ఈ ఏడాది కొత్త సంవత్సరం సందర్భంగా కూడా మద్యం ఏరులైపారింది. డిసెంబరు 29 నుంచి జనవరి 1 వరకు 4 రోజుల్లోనే రూ.543 కోట్ల విలువైన మద్యాన్ని షాపులు, బార్ల లైసెన్సీలు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి మూడు త్రైమాసికాల్లో రూ.22,983 కోట్ల విక్రయాలు జరిగాయి.

### లక్కీడ్రాలో రూ. 25 లక్షల కారు..

» స్కార్పియో గెలుచుకున్న 'పాతూరి'



నారాయణపురంలో రూ.25 లక్షల కారును గెలుచుకున్న పొత్తూరి నరసింహరాజు అండ్ టీమ్

ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురం కోడిపందేల బరిలో పొత్తూరి నరసింహరాజుకు అదృష్టం వరించింది. కోడిపందేల నిర్వాహకులు టోకెన్ ఒక్కింటికీ రూ.25 వేల చొప్పున మొత్తం వంద టోకెన్లను పంపిణీ చేశారు. మొత్తం 25 లక్షల రూపాయలు వసూలు కాగా, మహేంద్ర స్కార్పియో లక్కీ డ్రాలో ఏర్పాటు చేశారు. కోడి పందేల మూడో రోజు శుక్రవారం లక్కీ డ్రా తీయగా, ఫత్తేపురం సొసైటీ అధ్యక్షుడు పొత్తూరి నరసింహరాజు అండ్ టీమ్ సభ్యులను విజయం వరించింది. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చేతుల మీదుగా విజేత పొత్తూరి నరసింహరాజు టీమ్‌కు స్కార్పియో తాళం చెవిని అందజేశారు. కోడి పందేలలో కూడా పొత్తూరి టీమ్ హవా నడిచింది. సంక్రాంతి 3 రోజుల్లో తొలిరోజు ఆయన టీమ్ ఆరు జోడీలకుగాను 3 విజేతలు కాగా, రెండో రోజు 2 జోడీలూ విజేతలయ్యాయి. చివరి రోజు ఆరు జోడీలకుగాను 5 విజేతలుగా నిలిచాయి. ఒకటి సమంగా నిలిచింది. దీంతో పొత్తూరి టీమ్ లీడ్ విన్నర్‌గా నిలిచింది.

### కోడి పందేల్లో 'వికృత'ం!

» ఒకరి పీక కోసిన ప్రత్యర్థి కుమారుడు.. పెదపారుపూడిలో ఘటన

గుడివాడ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం భూషణగుళ్ల గ్రామంలో.. కోడిపందాల్లో రేగిన చిన్న వివాదం పెద్దదై ఓ వ్యక్తి పీక కోసే వరకు వచ్చింది. శుక్రవారం జరిగిన కోడిపందెంలో గుడివాడలోని ధనియాలపేటకు చెందిన అనగాని జగన్నాథంకు, పెదపారుపూడి మండలం భూషణగుళ్లకు చెందిన పానకాలుకు మధ్య చిన్న వివాదం చెలరేగింది. ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో పానకాలు కుమారుడు 'వికృత ఈశ్వర్' బ్లేడ్‌తో వెనుక నుంచి జగన్నాథం పీకపై కోశాడు. తీవ్ర రక్తస్రామవ్వడంతో జగన్నాథంను చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అతడి పరిస్థితి విషయంగా ఉన్నట్లు సమాచారం.



ఆసుపత్రిలో జగన్నాథం

# ఊరూరా సంబరం!

» గోదావరి జిల్లాల్లో తెలంగాణ సందడి

» కనుమ రోజు పశువుల సందడి.. ప్రభల తీర్థాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరి జిల్లాల్లో సందడే సందడి.. సంక్రాంతి మూడు రోజులూ ఉత్సాహం ఉరకలేసింది..! ఏ ఊరిలో చూసినా బంధాలు అనుబంధాలు, ప్రేమలు, ఆప్యాయతలు. బతుకుదెరువు కోసమో.. వ్యాపారాల కోసమో.. పనుల నిమిత్తమో దూర ప్రాంతాలకు, పొరుగు రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లిన కుటుంబాలు పిల్లా పాపలతో సహా సొంతూళ్లలో అడుగుపెట్టాయి. ముఖ్యంగా తెలంగాణలోని హైదరాబాద్ నుంచి వేలాది మంది సొంతూళ్లకు చేరుకున్నారు. చానాళ్ల తర్వాత పుట్టిన ఊరిని చూసి పులకించిపోయాయి. కార్లు, ఇతర వాహనాల్లో సొంతూరికి వచ్చిన వారు.. ఊరిలో అడుగుపెట్టగానే ఊరు చాలా మారిపోయింది.. అంటూ ఆశ్చర్యపోయారు. ఇంటికి చేరాక.. ముత్యాల ముగ్గులతో అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలు, బంధువులు, వారి ఇళ్లలో పెరిగిన కొత్త తరం పిల్లలతో సరదాగా, సంతోషంగా గడిపారు. ఏడాదికో సారి వచ్చే సంక్రాంతి.... మూడు రోజులే అయినా.. మళ్లీ సంక్రాంతి వచ్చే వరకూ మధురానుభూతుల్ని మిగుల్చుతుంది. ఈ జ్ఞాపకలు చెరిగిపోవు. భోగి రోజున భోగి మంటలు వేయడం... పిల్లలకు భోగి పళ్లు పోయడం అదో ఆనందం. ఎన్ని పండుగలొచ్చినా.. కొత్త బట్టలంటే సంక్రాంతే గుర్తొస్తుంది. రెండో రోజు పెద్దల పండుగ. తమను విడిచి అనంత లోకాలు వెళ్లిపోయిన పెద్దల జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ అందరూ సంతోషంగా గడిపారు. పెద్దల పేరుతో బ్రాహ్మణులకు గానీ, తమ బంధువర్గంలోని పెద్దలకు గానీ కొత్తబట్టలు పెట్టడం ఇక్కడి సంప్రదాయం. రకరకాల పండి వంటలు చేసుకుని, అందరూ కలసి తినడం.. అల్లర్లు, మర్యాదలు, వెటకారాలు, ఆటపట్టించడం అన్నీ ఓ మధుర జ్ఞాపకమే. ఆంధ్ర ప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి, తెలంగాణ, ఇతర ప్రాంతాల నుంచి కూడా లక్షలాది మంది తరలివచ్చి గోదావరి పల్లెల్లో సందడి చేశారు. కనుమ రోజున పశువులకు పూజలు చేయడం సంప్రదాయం. కోనసీమలో ప్రభల తీర్థాలను ప్రజలు బాగా ఎంజాయ్ చేశారు. ఆంధ్ర, తెలంగాణ ప్రజలతో మూడు రోజుల పాటు దేవాలయాలు కిటకిటలాడాయి. రాజకీయ నేతలు, ప్రముఖు లు, సెలబ్రెటీలు కూడా ఈసారి కోడి పందేలపైనే దృష్టి సారించడం గమనార్హం. గోదావరి పాయలు, కాలువలు, చెరువులు, చేలగట్లు, రొయ్యలు, చేపల చెరువులు, తోటలు, చేలు, నర్సరీలు అన్నీ పర్యాటక స్పాట్లుగా మారిపోయాయి.

### అమెరికా నుంచి రాలేక..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరి, విధిస్తున్న ఆంక్షలు వల్ల అనేక కుటుంబాలు పండుగను సంతోషంగా జరపుకోలేకపోయాయి. గోదావరి జిల్లాల నుంచి చదువులు, ఉద్యోగాల కోసం అమెరికాకు వెళ్లినవారు అక్కడి ఆంక్షల వల్ల వీసాలు రాక ఇబ్బంది పడుతున్నారు. కొందరేమో భారత్‌కు వస్తే.. మళ్లీ అమెరికాకు తిరిగివచ్చే అవకాశం ఉంటుందో లేదోనని అక్కడే ఉండిపోయారు. ఇలా వేలాది మంది కుటుంబాలతో కలిసి సంక్రాంతి జరుపుకోలేకపోయారు. సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు వచ్చిన లక్షలాది మంది మూడురోజుల పండగ పూర్తి కావడంతో కొందరు శనివారం నుంచే తిరుగు పయనానికి సిద్ధమవుతున్నారు.

### పోలీసు కాన్వాయ్‌తో వచ్చి.. కోటి పట్టి..

ఉమ్మడి కృష్ణా జిల్లా కీసరలో ఓ వ్యక్తి 25 కోడి పందేలు గెలిచి బుల్లెట్‌ను బహుమతిగా అందుకున్నాడు. గన్నవరం నియోజకవర్గం కేసరపల్లిలో ఒక ప్రముఖుడు కోడి పందెంలో రూ.కోటి గెలుచుకున్నారు. పోలీసు కాన్వాయ్‌తో వచ్చిన ఆయన ఒకే ఒక పందెం కట్టి పది నిమిషాల్లోనే రూ.కోటి కొల్లగొట్టారు. ఆ తర్వాత అక్కడి నుంచి పోలీసు ఎస్కార్ట్‌తో వెళ్లిపోయారు. ఆయన ప్రభుత్వంలోని ముఖ్యనేతకు అత్యంత ఆప్తుడని చెబుతున్నారు. ఇక పెనమలూరు, గుడివాడ, మచిలీపట్నం నియోజకవర్గాల్లోనూ పందేలు జోరుగా సాగాయి. ఈసారి పందేల్లో ఎన్ఆర్ఐ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కోడి పందేల జోరు కొనసాగింది. గమళ్లపాలెంలో ఎక్కువ పందేలు గెలిచిన వ్యక్తికి బుల్లెట్ బహుమతిగా అందజేశారు. పై పందేలు కూడా లక్షల్లో సాగాయి. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా కోట్లల్లోనే డబ్బులు చేతులు మారినట్లు తెలిసింది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తెలంగాణ వాసుల హవానే ఎక్కువగా కనిపించింది. వారి కార్లతోనే రోడ్లన్నీ నిండిపోయాయి. అలాగే ఎక్కువ కోడి పందేలు గెలిచిన వారికి కార్లు, బుల్లెట్లు బహుమతిగా అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలంలో కార్లు బహుమతులు ఇవ్వడం గమనార్హం. క్యాసినో నిర్వాహకుడు చీకోటి ప్రవీణ్ వంటి వాళ్లు కూడా జిల్లాలోని పలుచోట్ల హల్‌చల్ చేశారు. అలాగే కాకినాడ జిల్లాలోని కాకినాడ రూరల్, కరప, జగ్గంపేట, పెద్దాపురం బరుల వద్ద పెద్దఎత్తున తెలంగాణ నుంచి వచ్చిన పందెంరాయుళ్లు పందేలు కాశారు. తెలంగాణ నుంచి వచ్చిన కొందరు మహిళలు, సాఫ్ట్‌వేర్ యువతులు సైతం గుండాట ఆడారు. తాళ్లరేవులో తెలంగాణకు చెందిన ఓ జంట కోడి పందేల్లో బుల్లెట్ గెల్చుకుంది. ఇక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధిక పందేల్లో గెలుపొందిన విజేతలకు ఆత్రేయపురం మండలం, రావులపాలెం మండలాల్లో పలు గ్రామాల్లో బుల్లెట్లను కానుకగా అందించారు. ఆత్రేయపురం మండలం లొల్ల బరి వద్ద అత్యధిక పందేలు గెలిచిన వ్యక్తికి శుక్రవారం రాత్రి క్రెటా కారును అందజేశారు.

### 'సినిమా' సందడి..

పందేలను వీక్షించేందుకు పశ్చిమగోదావరి జిల్లాకు ఈ సారి తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి యువత పెద్ద ఎత్తున వచ్చారు. పెదఅమిరం బరిలో సినీ నిర్మాత దగ్గుబాటి సురేశ్, సినీ నటులు బెల్లంకొండ సురేశ్, రోషన్, హీరోయిన్ డింపుల్ హయాతి పందేలను తిలకించి సందడి చేశారు. భీమవరం రూరల్ మండలం గొల్లవాని తిప్ప, తాడేరు బరుల్లో బుల్లితెర నటులు పందెం రాయుళ్లలో జోష్ నింపారు. యలమంచిలిలో సంక్రాంతి రోజున విందు భోజనాలకు జనం పోటెత్తారు. పాలకొల్లు నియోజకవర్గంలో యలమంచిలి, కలగంపూడి, పూళ్లలో ప్రతి పందెం రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పలికింది. గుండాటలో ఈ ఏడాది మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 'తెలంగాణ' సందడి.. బహుమతులుగా కార్లు, బుల్లెట్లు

కృష్ణాజిల్లా కేసరపల్లి బరులకు హాజరైన జనం, పార్కింగ్‌లో కారులు, మోటార్‌సైకిళ్లు



## సేల్ అగ్రిమెంట్‌కు స్టాంప్ డ్యూటీ అక్కర్లేదు

- ఏపీ స్టాంప్, రిజిస్ట్రేషన్ చట్టంపై సుప్రీం తీర్పు
- 50 ఏళ్లుగా అద్దెకు ఉంటున్న వ్యక్తికి భారీ ఊరట

న్యూఢిల్లీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అద్దెకు ఉంటున్న ఇంటిని కొనుగోలు చేయడానికి యజమానితో ఒప్పందం చేసుకుంటే ఆ ఒప్పందాన్ని 'సేల్‌డీడ్'గా పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆస్తి కొనుగోలుకు సంబంధించి 'అగ్రిమెంట్ టు సేల్'(విక్రయ ఒప్పందం) కుదుర్చుకున్నప్పటికీ ఆస్తి స్వాధీనం కాకపోతే దానిపై పూర్తిస్థాయి స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఆంధ్రప్రదేశ్ స్టాంప్, రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం.. కేవలం ఒప్పందం జరిగినంత మాత్రాన అది 'కన్వేయన్స్' (ఆస్తి బదిలీ/రిజిస్ట్రేషన్) కిందకు రాదని, దానికి స్టాంప్ డ్యూటీ, పెనాల్టీలు కట్టాల్సిన పనిలేదని స్పష్టం చేసింది. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వయ్యేటి శ్రీనివాసరావు వర్సెస్ గైనిడి జగజ్యోతి కేసులో జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం కీలక తీర్పునిచ్చింది. జగజ్యోతి ఇంట్లో శ్రీనివాసరావు గత 50 ఏళ్లుగా అద్దెకుంటున్నారు. 2009లో తను అద్దెకుంటున్న ఇంటిని రూ.9 లక్షలకు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. రిజిస్ట్రేషన్ విషయంలో వివాదం తలెత్తడంతో శ్రీనివాసరావు కోర్టును ఆశ్రయించారు. అయితే, విచారణ సమయంలో ఒప్పందాన్ని సేల్ డీడ్‌గా భావించి దానికి తగ్గట్టుగా స్టాంప్ డ్యూటీ, పెనాల్టీ కట్టాలని ట్రయల్ కోర్టు, ఏపీ హైకోర్టు ఆదేశించాయి. దీంతో శ్రీనివాసరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఆ ఉత్తర్వులను కొట్టివేస్తూ బాధితుడికి ఊరటనిచ్చింది.

## ఆ ముగ్గురు మావోయిస్టులను పెనమలూరు పీఎస్‌లో విచారించవచ్చు

- పోలీసులకు హైకోర్టు వెసులుబాటు

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు యు.రఘు, ఓయం జ్యోతి, మడకం దివకర్‌లను 16, 17 తేదీల్లో కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో విచారించేందుకు పోలీసులకు హైకోర్టు వెసులుబాటు ఇచ్చింది. వీరిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ చేయాలని విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది. నిందితుల భద్రతకు సంబంధించి పూర్తి బాధ్యత గన్నవరం డీఎస్పీదేనని స్పష్టం చేసింది. నిందితుల తరపు న్యాయవాదులు కోరితే... వారికి కనిపించేంత దూరంలో విచారణ చేయాలని, ప్రక్రియ మొత్తం ఆడియో, వీడియో రికార్డు చేయాలని పోలీసులను ఆదేశించింది. వివరాలను సంబంధిత మేజిస్ట్రేట్ ముందు ఉంచాలని గన్నవరం డీఎస్పీని ఆదేశించింది. ఇంట్రాగేషన్ వివరాలను సీల్డ్ కవర్‌లో విజయవాడ కోర్టుకు అందజేయాలని, ఓ కాపీ హైకోర్టుకు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ పిటిషన్‌పై తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

## అనంతబాబు భార్య ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కారు మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తులో కొత్త అంశాలు వెలుగులోకి వచ్చాయని, నిందితులపై ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సెక్షన్లు చేర్చారని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వెంకటరమణ శుక్రవారం హైకోర్టుకు నివేదించారు. ఎస్సీ, ఎస్టీ కేసులో బాధిత కుటుంబసభ్యులకు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత కేసులో ఫిర్యాదుదారు సుబ్రహ్మణ్యం తల్లి నూకరత్నంకు నోటీసు ఇచ్చి ఆమె వాదన కూడా వినాలని వివరించారు. పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.హరిహరనాథశర్మ ఫిర్యాదుదారు నూకరత్నంకు నోటీసులు జారీచేశారు. విచారణను ఈనెల 20కి వాయిదా వేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ అనంతబాబు సతీమణి అనంతలక్ష్మి చేసిన అభ్యర్థనను హైకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపించారు.

# తిరుపతిలో 'ఏపీ-ఫస్ట్'!

**అతిపెద్ద పరిశోధనా కేంద్రం.. యువత భవితకు భరోసా**

- పలు కీలక రంగాల్లో శిక్షణ
- ఏరో స్పేస్, డిఫెన్స్, ఐటీ సలహాదారులతో సీఎం సమావేశం
- ఏపీ-ఫస్ట్ ఏర్పాటుకు బాబు ఆమోదం
- డ్రోన్ వ్యవస్థపై మరింత అధ్యయనం
- అన్ని విభాగాల్లోనూ 'డ్రోన్' సేవలు



ఏపీ ఫస్ట్ పేరుతో తిరుపతిలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుపై క్యాంపు కార్యాలయంలో ఏరోస్పేస్, డిఫెన్స్, ఐటీ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో సమావేశమైన సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్, డిఫెన్స్ ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో యువతకు మరింత భవిష్యత్తు లభించేలా రాష్ట్రంలో అతిపెద్ద పరిశోధనా కేంద్రం 'ఏపీ-ఫస్ట్'ను తిరుపతిలో ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. శుక్రవారం అమరావతిలోని క్యాంపుకార్యాలయంలో ఏరోస్పేస్, డిఫెన్స్, ఐటీ రంగాల సలహాదారులతో ఆయన భేటీ అయ్యారు. యువత భవితను తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధి పెంచుతూ.. వారిలో కౌశల్యాలను వెలికితీసేలా పరిశోధనా రంగంలో అన్నివిధాలా సహకరించేలా 'ఏపీ ఫస్ట్' పేరిట రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. "రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. వివిధ రంగాల్లో కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ సెంటర్, సెమీకండక్టర్ డివైజెస్, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ వంటి రంగాలు భవిష్యత్తులో కీలకం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీటికి అనుగుణంగా పాలసీలు రూపొందిస్తోంది. ఆయా రంగాల్లో కంపెనీలు పెట్టేందుకు సహకరిస్తుంది. దేశంలో తొలిసారిగా గ్రీన్ ఎనర్జీ రంగంలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌ను కాకినాడలో ఏర్పాటు చేయబోతున్నాం. తిరుపతిలోని ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ రెండు ప్రముఖ జాతీయ విద్యాసంస్థల కాంబినేషన్లలో ఏపీ ఫస్ట్ ఏర్పాటు కాబోతుంది. దీనిని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దాలి. 'ఏపీ ఫస్ట్' పరిశోధనా వ్యవస్థను సమర్థంగా నిర్వహించేందుకు కేంద్రంతోనూ సంప్రదింపులు జరపాలి." అని సీఎం చంద్రబాబు సూచించారు.

### టాటా ఇన్నోవేషన్ హబ్‌తో..

యువతకు మెరుగైన అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం ప్రణాళికలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు. దీనిలో భాగంగానే ఏపీ ఫస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వర్సిటీలు, వివిధ రంగాల్లో ప్రముఖ ఉన్న కంపెనీలతో ఏపీ ఫస్ట్ సమన్వయం చేసుకోవాలని సూచించారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానం చేసుకోవాలని పేర్కొన్నారు. "ఇప్పటికే వివిధ ప్రభుత్వ, ప్రైవేటు వర్సిటీల్లో విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేస్తున్నారు. వాటిని అందిపుచ్చుకోవాలి. వివిధ రంగాల్లో నైపుణ్యం తీర్చిదిద్దేందుకు పరిశ్రమలు, కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరపాలి. సాంకేతికలు, అభివృద్ధి చెందుతున్న రంగాలపై అవగాహన పెంచుకోవాలి. వాటిని కరిక్యులంలో చేర్చేలా విద్యావ్యవస్థలను తీర్చిదిద్దాలి. కరిక్యులం రూపకల్పన బాధ్యతను ఏపీ ఫస్ట్‌కు అప్పగించాలి" అని సీఎం సూచించారు.

### డ్రోన్లతోనూ సేవలు

డ్రోన్లతోనూ సేవలు అందించవచ్చని నిరూపిద్దామని, దీనికోసం డ్రోన్ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని చంద్రబాబు సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాల్లో ప్రజలకు ఆహారంతో పాటు సహాయ పునరావాస కార్యక్రమాలను అందించడంలో డ్రోన్ల సహకారం, సేవలను తీసుకోవాలన్నారు. వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీలాంటి సేవల్లో డ్రోన్ల వినియోగం పెరగాలన్నారు. "ఇవన్నీ భవిష్యత్ సాంకేతిక వ్యవస్థకు నిదర్శనం. రాష్ట్రంలో ఇప్పటి నుంచే వాటిని వినియోగించేలా చర్యలు ప్రారంభించాలి. వివిధ దేశాల్లో డ్రోన్ల వ్యవస్థను ఉపయోగిస్తున్న తీరుపై అధ్యయనం చేయాలి. సాంకేతికతపై ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందాలి. అందరూ టెక్నాలజీ వినియోగించుకునేలా వ్యవస్థల్ని సన్నద్ధం చేయాలి. డ్రోన్ నిపుణులతో సలహా బృందాన్ని ఏర్పాటు చేయాలి. రానున్న ఇంటర్నేషన్ డ్రోన్ డే నాటికి ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించే సేవలపై అవగాహన కల్పించాలి. కేంద్రంతో సంప్రదింపులు జరిపి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ తరహాలో డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయడంపై ఆలోచనలు చేయాలి." అని సీఎం సూచించారు. ఈ సమావేశంలో ఏరోస్పేస్ డిఫెన్స్ సలహాదారు సతీశ్‌రెడ్డి, ఐటీ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవదాయంలో పదోన్నతుల రచ్చ!

- అధికారుల అండదండలు ఉన్నవారికే ప్రమోషన్లు
- నెలలు గడుస్తున్నా భర్తీ కాని సూపరింటెండెంట్ పోస్టులు
- గెజిటెడ్ సూపరింటెండెంట్ పోస్టు 14 రోజుల్లోనే భర్తీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దేవదాయ శాఖలో ఉద్యోగులకు పదోన్నతి దక్కడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఉన్నతాధికారులకు నచ్చాలి.. వారి మెప్పు పొందాలి... ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం అధికారులను ప్రసన్నం చేసుకోవాలి... ఆ తర్వాతే ఎవరికైనా ప్రమోషన్ లభిస్తుంది. అధికారులను ప్రసన్నం చేసుకుంటే అర్హత లేకపోయినా పదోన్నతులు ఇచ్చేస్తుంటారు. లేకపోతే ఆ ఉద్యోగి ఎన్నేళ్లైనా అదే కేడర్‌లో ఉండిపోవాల్సిందే. డిప్యూటీ కమిషనర్ నుంచి సీనియర్ అసిస్టెంట్ పదోన్నతుల వరకూ దేవదాయ శాఖలో ఇదే విధానం అమలవుతోంది. శాఖ ప్రధాన కార్యాలయంలో కొంత మంది ఉద్యోగులపై తీవ్ర వివక్ష కొనసాగుతోంది. ఇక్కడ ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ పోస్టును భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అయితే గతేడాది డిసెంబరు 31న ఖాళీ అయిన గెజిటెడ్ సూపరింటెండెంట్ పోస్టును మాత్రం ఆగమేఘాలపై భర్తీ చేశారు. ల్యాండ్ సెక్షన్ చూసే సూపరింటెండెంట్‌కు జనవరి 14న గెజిటెడ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించారు. ఇదే వేగం సూపరింటెండెంట్ పోస్టు విషయంలో ఎందుకు చూపించడం లేదని విమర్శలొస్తున్నాయి. గత వారం ఒక అసిస్టెంట్ కమిషనర్ పదోన్నతికి సంబంధించి జాతీయ ఎస్టీ కమిషనర్ జోక్యం చేసుకుంటే తప్ప ప్రమోషన్ ఇవ్వలేదు. శాఖలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఎందుకు అమలు చేయడం లేదని కమిషన్ మొట్టికాయలు వేసే పరిస్థితి వచ్చింది. మరోవైపు జనవరి 31 నాటికి అన్ని శాఖల్లో అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. దేవదాయ శాఖలో ఈ ఆదేశాల అమలు సాధ్యమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రభుత్వం జోక్యం చేసుకుంటేనే...

దేవదాయ శాఖలో సీనియర్ అసిస్టెంట్ పదోన్నతులపై కొన్నేళ్లుగా వివాదం నెలకొంది. రాష్ట్ర విభజనకు ముందు శాఖలో 31 ఎస్‌ఏ పోస్టులు ఉన్నాయి. వీటిలో 17 పోస్టులు ఏపీకి, 14 తెలంగాణకు వెళ్లాలి. కానీ అప్పటి దేవదాయ శాఖ అధికారులు మొత్తం 51 పోస్టులు చూపించి, 34 ఏపీకి వచ్చినట్లు రికార్డులు సృష్టించారు. ఈ విషయాన్ని సాధారణ పరిపాలన శాఖ నిర్ధారించింది. కేడర్ స్ట్రెంత్ ప్రకారం శాఖలో 17 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఉంటే 19 మందికి ఆ స్థానంలోకి పదోన్నతులు కల్పించారు. అడిగినవారికి అడిగినట్టు ప్రమోషన్ ఇచ్చేశారు. ఇప్పుడు దేవదాయ శాఖకు ఇదో తలనొప్పిగా తయారైంది. ఈ చిక్కుముడి కారణంగా భవిష్యత్తులో ఏ ఉద్యోగి పై కేడర్‌కు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అక్రమంగా పదోన్నతులు కల్పించిన వారికి రివర్సల్ ఇచ్చి, ఆ వెంటనే తిరిగి పదోన్నతులు కల్పిస్తే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రావని పలువురు సూచిస్తున్నారు. అయితే శాఖలో అంతర్గత రాజకీయాలు ఈ సమస్యను మరింత జటిలంగా మారుస్తున్నాయి. అక్రమ పదోన్నతులకు సంబంధించిన సమస్యలు ప్రభుత్వం జోక్యంతోనే పరిష్కారమవుతాయని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## జల జగడాలపై 30న ఉన్నత స్థాయి కమిటీ తొలి భేటీ

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ మధ్య జలవివాదాల పరిష్కారానికి కేంద్రం ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి కమిటీ ఈ నెల 30న తొలి సమావేశం నిర్వహించనుంది. కేంద్ర జలసంఘం ఛైర్మన్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగే ఈ భేటీలో కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) ఛైర్మన్లు.. ఎన్‌డీడబ్ల్యూఏ చీఫ్ ఇంజనీర్, ఏపీ జల వనరుల శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర జల వివాద విభాగం చీఫ్ ఇంజనీర్ సుగుణాకర్‌రావు, తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారు, కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి, ఈఎన్‌సీ హాజరవుతారు. రెండు రాష్ట్రాల నడుమ నీటి నిర్వహణకు సంబంధించిన కీలక అంశాలను ఆయా ప్రభుత్వాలు అందజేయడం.. కమిటీ చర్చించాల్సిన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని కృష్ణా, గోదావరి బోర్డులు సమకూర్చడం.. కమిటీకి సహకరించడానికి ఇతర అధికారులు/నిపుణులను నియమించుకోవడం.. ఈ సమావేశం ఎజెండాగా పేర్కొంటూ కమిటీ సభ్య-కార్యదర్శి, జలసంఘం చీఫ్ ఇంజనీర్ రాకేశ్‌కుమార్ రెండు రాష్ట్రాలకూ తాజాగా సమాచారమిచ్చారు. ఛైర్మన్ అనుమతితో ఇతర అంశాలను ప్రస్తావించవచ్చని సూచించారు. సంబంధిత వివరాలతో సభ్యులు హాజరు కావాలని కోరారు. రాష్ట్రం నుంచి జల వనరుల శాఖ స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, అంతర్రాష్ట్ర జల వివాద విభాగం చీఫ్ ఇంజనీర్ సుగుణాకర్‌రావు హాజరవుతారు. మూడు నెలల్లో నివేదిక అందించాలని కేంద్ర జలశక్తి శాఖ స్పష్టం చేయడంతో ఈ దిశగానే కమిటీ చర్చలకు శ్రీకారం చుట్టనుంది.

# అందరి ఆనందమే లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)

గానూ మారిందని చెప్పారు. జాయింట్ కలెక్టర్లు ఈ ఏడాదంతా దీనిపైనే దృష్టి పెట్టి పనిచేయాలని ఆదేశించామన్నారు. అయినా ఫిర్యాదులు వస్తే తానే స్వయంగా వెళ్లి విచారిస్తానన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన గురువారం తన స్వగ్రామం నారావారిపల్లెలోని నివాసంలో మీడియాతో మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. 2025లో ప్రజల అవసరాలను తీర్చామని, 2026లో వారి ఆకాంక్షలను నెరవేర్చేలా పనిచేయాలని టీడీపీ శ్రేణులకు పిలుపిచ్చారు. సంక్షేమం, అభివృద్ధితో సుపరిపాలనకు నాంది పలికామన్నారు. పండుగకు పల్లెలకు వచ్చినవారికి గతంలో మాదిరి గుంతలు పడిన రోడ్లు కనిపించలేదన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ పాలసీతో గ్రామాల్లో ప్రతి ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నామని, పరిశుద్ధమైన, ప్రశాంతమైన గ్రామాలను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోపాటు స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్ డెలివరింగ్ విధానం వైపు వెళ్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాగానే మెగా డీఎస్సీ, పోలీసు రిక్రూట్‌మెంట్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, ఎన్టీఆర్ భరోసా, అన్న క్యాంటీన్ వంటి పథకాలను అమలు చేశామని గుర్తుచేశారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు డబ్బులు చెల్లిస్తున్నామని, ఈ ఏడాది 42 లక్షల టన్నులు కొనుగోలు చేసి.. రూ.10వేల కోట్లు వారికి అందజేశామన్నారు. విద్యుత్ చార్జీల భారం తగ్గించామని, ట్రూడౌన్ విధానంతో యూనిట్‌కు 13పైసలు తగ్గించామని.. ఈ ఏడాది మరింత తగ్గించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సాయంత్రం 4గంటలకు ఆయన హెలికాప్టర్లో ఉండవల్లి బయల్దేరారు. ఆయా సందర్భాల్లో సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

> కూటమి ఉంటేనే రాష్ట్రం బాగుంటుంది. రాబోయే అన్ని ఎన్నికల్లో కూటమి విజయం సాధించాలి.. మనమే గెలవాలి. ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను నేతలు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
>
> \- సీఎం చంద్రబాబు

### ఉద్యోగులకు బకాయిలు చెల్లించాం..

ఉద్యోగులకు రూ.1,100కోట్లతో డీఏ ఎరియర్స్, సరెండర్ లీవులు చెల్లించాం. 60నెలలుగా చెల్లించని డీఏ ఎరియర్స్‌ను సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాం. 2019కి ముందు పనులు చేసిన నీరు-చెట్టు బిల్లులు కూడా క్లియర్ చేశాం. పార్టీపరంగా పార్లమెంటు నియోజకవర్గ స్థాయి వరకు పదవులు భర్తీ చేశాం.. త్వరలోనే రాష్ట్ర కమిటీ నియామకం చేపడతాం. రాష్ట్రంలోని ప్రతి పల్లె పండుగ శోభతో కళకళలాడింది. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు ఈ వాతావరణం కనబడింది. సంక్రాంతి సంప్రదాయాలను పునరుద్ధరించుకుందాం. కుటుంబంతో సంక్రాంతికి సొంత ఊరికి వెళదామని, మూలాలను మరచిపోకుండా పిల్లలకు వారసత్వం ఇవ్వాలని 15-16 ఏళ్ల కిందటే నా భార్య భువనేశ్వరి చెప్పింది. ముఖ్యమంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా కుటుంబంతో కలసి స్వగ్రామానికి వస్తే రాష్ట్ర ప్రజలందరికీ ఒక సందేశం ఇచ్చినట్లవుతుందనే క్రమం తప్పకుండా కుటుంబంతో వస్తున్నా. ఉన్నతస్థాయిలో ఉన్నవారు తమ జన్మ భూమిని మరచిపోవద్దు. ప్రభుత్వాల ప్రణాళికల వల్ల సంపన్నులు పెరుగుతున్నారు. అదేస్థాయిలో ఆర్థిక అసమానతలూ పెరుగుతున్నాయి. వాటిని తగ్గించాలన్న భావనలో నుంచి పుట్టుకొచ్చిందే పీ-4 కార్యక్రమం. దీనికింద 10లక్షల కుటుంబాలను దత్తత తీసుకున్నాం. ఈ ఏడాది ఆ కుటుంబాలపై దృష్టి పెడతాం. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర అనారోగ్యంతో ఉంటున్న వారికి 3నెలలకోసారి వైద్యపరీక్షలు నిర్వహిస్తాం. ఏఐ, డాక్టర్, న్యూట్రిషనిస్ట్ సాయంతో వైద్య చికిత్స, హెల్త్ స్కోర్ నమోదు చేస్తాం. 'సంజీవని' కార్యక్రమం కింద బిల్‌గేట్స్ ఫౌండేషన్ ద్వారా కుప్పంలో చేపట్టిన కార్యక్రమం విజయవంతమైంది. ప్రస్తుతం చిత్తూరు జిల్లావ్యాప్తంగా, నారావారిపల్లెలోనూ అమలు చేస్తున్నాం. ఈ ఏడాది రాష్ట్రమంతా విస్తరింపజేస్తాం.

### 19న దావోస్‌కు సీఎం

సీఎం చంద్రబాబు దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశానికి హాజరుకానున్నారు. ఆదివారం రాత్రి 8.30కి విజయవాడ నుంచి ఢిల్లీ వెళ్లి.. 19న తెల్లవారుజామున జూరిక్ చేరుకుంటారు. 19 నుంచి 23 వరకు దావోస్‌లో జరిగే సదస్సులో పాల్గొంటారు. ఆయన వెంట మంత్రులు లోకేశ్, టీజీ భరత్ తదితరులు వెళ్తున్నారు.

# క్లీన్ ఎనర్జీలో మరో చరిత్ర!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుతో సుమారు 8 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆపరేషన్స్, పునరుత్పాదక ఇంధనం, లాజిస్టిక్స్, నిల్వలు, పోర్టు సేవలు వంటి అనుబంధ రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు సృష్టించనున్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా దేశీయంగా ఉత్పత్తి చేసిన గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తులు జర్మనీ, జపాన్ వంటి దేశాలకు ఎగుమతి కానున్నాయి.

### భవిష్యత్ ఇంధనం

ఏఎం గ్రీన్ సంస్థ.. గ్రీన్ హైడ్రోజన్‌ను ఉపయోగించి కార్బన్ ఉద్గారాలు లేకుండా గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనుంది. బొగ్గు, చమురు, సహజవాయువులతో తయారయ్యే గ్రే, బ్లూ అమ్మోనియాకు భిన్నంగా ఈ ఉత్పత్తి జరగనుంది. ప్రపంచం మొత్తం డీ-కార్బనైజేషన్, నెట్ జీరో ఎమిషన్స్ లక్ష్యాల వైపు అడుగులు వేస్తున్న తరుణంలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా భవిష్యత్తు ఇంధనాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడలో 'ఏఎం గ్రీన్ అమ్మోనియా' ప్రాజెక్టు దేశానికే గర్వకారణంగా నిలవనుంది. నాగార్జున ఫెర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్ పాత గ్రే అమ్మోనియా ప్లాంట్‌ను గ్రీన్ ప్లాంట్‌గా అభివృద్ధి చేస్తున్నారు. 495 ఎకరాల్లో ఏఎం గ్రీన్ సంస్థ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టును 3 దశల్లో పూర్తి చేయనున్నారు. తొలిదశలో 2027 నాటికి ఏడాదికి 0.5 టన్నుల అమ్మోనియాను ఉత్పత్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలిదశలో రూ.18 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. రెండో దశలో 2028 నాటికి టన్ను, మూడో దశలో 1.5 టన్నుల అమ్మోనియా ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. అన్ని దశల్లోనూ గ్రీన్ ఎనర్జీని మాత్రమే వినియోగించుకునే ఏకైక ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు దేశంలో ఇదేనని అధికారులు తెలిపారు. గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి అవసరమయ్యే విద్యుత్తు కోసం 7.5 గిగావాట్ల సోలార్, విండ్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీకి 1950ఎంవీ సామర్థ్యంతో ఎలక్ట్రోలైజర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. నిరంతరాయంగా విద్యుత్తును అందించేందుకు 2జీవీ సామర్థ్యంతో పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రాజెక్టు అవసరాలన్నింటికీ గ్రీన్ ఎనర్జీని వినియోగించుకునే ప్లాంటు దేశంలో ఇదే మొదటిది. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.90వేల కోట్లుగా అధికారులు చెబుతున్నారు.

### ఎగుమతికి అద్భుత అవకాశం

ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ కాకినాడ పోర్టుకు కిలోమీటరు దూరంలో ఉంటుంది. గ్రీన్‌అమ్మోనియాను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేందుకు ఈ వెసులుబాటు అద్భుత అవకాశం కల్పిస్తుంది. ఏఎం గ్రీన్ సంస్థ ఇప్పటికే జర్మనీకి చెందిన యూనిఫర్ ఎస్ఈతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు ఓ పారిశ్రామిక పెట్టుబడి మాత్రమే కాదని, రాష్ట్ర ఇంధన భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. దీని ద్వారా దేశంలోనే తొలిసారిగా జర్మనీ, సింగపూర్, జపాన్‌కు గ్రీన్ అమ్మోనియా ఎగుమతి జరగనుందని తెలిపారు.



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.